
జూలై '65
75 పైసలు
31
49
52
84
93


హెచ్చరిక
దొంగలు
అవినీతి నిర్మూల
ఆదర్శ వంతమైన
చిత్రం
ఆకాశరామన్న
కోదండపాణి

తొలిమాట

అభిజ్ఞుల అంచనా ప్రకారం ఆంగ్లభాషలోకల్లా అందమైన సానెట్స్ వ్రాసినవాడు షేక్‌స్పియర్. అంత సుతారమైన భావుకత్వాన్ని అతనిలో ఆవేశింపజేసిన 'డార్క్ లేడీ' ఎవరో, సానెట్స్‌ను అంకితం పొందిన 'డబ్ల్యు. హెచ్.' ఎవరో ఈ నాటికి పరిశోధకులకు మిస్టరీగానే మిగిలిపోయింది. బహుశా ఎలిజబెత్‌రాణి అంతఃపురంలోని ఏ అందాల రాసినో ఉద్దేశించి షేక్‌స్పియర్ ఈ ప్రేమ గీతాలు వ్రాసి వుంటాడని ఊహించి బెర్నార్డ్‌షా ఒక చక్కటి నాటకం వ్రాశాడు కూడా.

పిలకా గణపతిశాస్త్రిగారు 'చరణసేవ'తో ప్రారంభించి వ్రాస్తున్న షోకైన షోడశపదుల్ని (సానెట్స్?) ఇంత మనోహరంగా ఉద్దీప్తం చేసిన దెవరో వారికే తెలియాలి. ఏమైనా ఆ వివరాలలోకి పోవడం సమకాలికులమైన మనకు సమంజసంకాదు. (9 వ పేజీ)

*

ఆదర్శాలను వల్లించడం ఎంత సులభమో ఆచరించడం అంత దుర్లభం. అయినా, నీరు పల్లానికి ప్రవహించినంత సహజంగా కొందరి ప్రవృత్తులు ఆదర్శాలవైపు పరుగులు తీస్తాయి. ఈ నిజాన్ని నిరూపించే నవల 'మార్గదర్శి' ఈ సంచికలో ప్రారంభమౌతున్నది (66 వ పేజీ)

వి. వి. రాఘవయ్య

సచిత్ర మాసపత్రిక
బకింగ్‌హామ్‌పేట, విజయవాడ-2
విడిప్రతి వెల: 75 పైసలు — ఏడాది చందా: 9 రూపాయలు
సంపుటి 3 జూలై 1965 సంచిక 7

ముఖచిత్రం : పద్మశ్రీవారి
"ప్రేమించిచూడు" చిత్రంలో దృశ్యాలు

మేనేజింగ్ ఎడిటరు : వి. వి. రాఘవయ్య
ఆర్ట్ ఎడిటర్ : బాపు
సంపాదక వర్గం :
నండూరి రామమోహనరావు, ముళ్ళపూడి వెంకటరమణ,
వి. ఎ. కె. రంగారావు, రావి కొండలరావు.



ఉత్తరాయణం

అతని జీవితానికి ఆమె సెక్రటరీ అవుతుందని, ఆమె హృదయానికి అతడు ప్రెసిడెంటని పాఠకులు మొదటే ఊహించారు. కాని రచయిత్రి వారిద్దరిని ఎలా కలుపుతారో అని పాఠకులు అణచుకోలేని ఆత్రుతతో ఉక్కిరి బిక్కిరి అయ్యారని వేరే చెప్పాలా?

మిస్ బి. కృష్ణ, మద్రాసు.

'నాకీ అదృష్టం చాలు' చదివినప్పటినుంచి యద్దనపూడి సులోచనారాణిగారి రచనలంటే నాకు చాలా ఇష్టం. సుజాత, అరవింద, అమూల్య, శేఖరంవంటి పాత్రలూ, వేసంకాలపు ప్రాతఃకాలాలూ, శీతాకాలపు సాయంకాలాలవంటి చక్కటి సున్నితమైన వాతావరణం నా ఇష్టానికి కారణాలు. ఈసారి "జ్యోతి"లో జయంతిని గురించి తెలుసుకోడమే గాక, రచయిత్రిని చూడ్డం కూడా తటస్థించింది కాబట్టే ఈ ఉత్తరం. మరేం లేదు.

రామం, మద్రాసు.

"సెక్రటరీ"లోని పాత్రలు ఒక విశిష్ట వ్యక్తిత్వంతో, మరుపురాక సాహిత్య వీధులలో చిరస్థాయిగా వెలుగొందుతాయి. జయంతి, రాజశేఖరంల విరుద్ధ మనస్స్వభావాలని ఏకీకరణం చేసిన శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి భావనా కౌశలం, భాషాపటిమ, హేతువాదం చాలా అపూర్వమైనవి, ప్రశంసనీయమైనవి.

భాస్కరభట్లజోగారావు,
అరసవిల్లి.

"సెక్రటరీ" సీరియల్ అంకితం పొందిన వాళ్ళలో నేనొకదాన్ని. నిజంగా ఇంతమంది సీరియల్ అంకితం పొందినందుకు చాలా గర్వంగా ఉంది.

ఎస్. రమ, అనకాపల్లి

నవలనంతా సమీక్షిస్తే తేలదొక్కటే. ఇది జీవితం. అన్ని కోణాల్లోంచి దర్శించబడింది. అర్థమైనవారు ఆరాధిస్తారు. జయంతి నిన్న, యివాళా, రేపు ఎప్పుడూ వుంది; ఉంటుంది.

జయంతి పాత్ర పోషణే తలమానికం మొత్తంమీద. స్త్రీని వివిధ ఉద్వేగాలలో చూడాలనుకున్న వారికామె కావాలి.

జి. నరసింహారావు, దూసి.

"సెక్రటరీ" ఆమూలాగ్రం చదివాను. చెత్తగా వుంది. ఎందుకంటారేమో? కారణాలుగూడా యిచ్చుకుంటాను. ముఖ్యాతి ముఖ్యమైన కారణమేమిటంటే, కథ అసహజంగా, అసంబద్ధంగా అనుభవంలేని ఆడపిల్లలు (12-16 వయస్సు) పిచ్చి

తోచక, వూహించుకునే తియ్యటి పగటి కలలాగా వుంది.

ఇహపోతే పాత్రలు. కథానాయిక చాలా అందగత్తె, పెద్దకళ్ళు, పొడుగుపాటి జడ, తెల్లటి దేహచ్ఛాయ. కాస్తో కూస్తో చదువుకున్నా బొత్తిగా ప్రపంచ జ్ఞానం శూన్యం. ఆ అమ్మాయికి, ఒక్కగానొక్క బామ్మ (ఎక్కువమంది, అంటే అమ్మా నాన్నా వుంటే కథకు అడ్డొస్తారని గాబోలు రచయిత్రి అభిప్రాయం) కథానాయకుడు శేఖరం అందగాడు, అంత లావూ ఇంత పొడుగూను. ఎంత ధనవంతుడయ్యా అంటే, ఆయనగారికి ఓ పెద్ద బంగళానే గాదూ, కంపెనీలేగాదూ, ద్రాక్ష తోటలే గాదూ- ఇంకా వంటవాడూ, బూట్లు తొడగటానికీ, దానికీ - దీనికీ మనుష్యులూ - ఓహ్. చెప్పలేం, ఆయనగారి ఐశ్వర్యం. అతనికూడా తల్లీ, తండ్రీ వగైరా ఎవరూ వుండరు. అతనిచుట్టూ అందమైన ఆడవాళ్ళు డాన్సులు, పరిచర్యలూ చేస్తున్నా, వాళ్ళతో నవ్వుతూ మాట్లాడతాడే గాని, వాళ్ళకు తన వెడల్పాటిహృదయంలో చోటివ్వడు.

ఇంకోటి గమనించాలి. మన దేశంలో, ముఖ్యంగా మన తెలుగువాళ్ళలో ఎంత ధనవంతులుగానీ, ఎంత చక్కటి శేఖరాలుగానీ, ఆడ సెక్రటరీలను పెట్టుకోవటం నేను కనీ వినీ ఎరుగను. పోనీ, సెక్రటరీని పెట్టుకున్నాడే అనుకోండి, ఆవిడచేత అన్నీ నాజూకు పనులే చేయిస్తాడు. ఆవిడకి బోల్డంత జీతం. ఇవేగాక ఆవిడకి బోలెడు ప్రజెంటేషన్లు.

ఇట్లా బోలెడున్నయ్ రాయటానికి. కానీ రాస్తే ఓ చాటు భారతం లాగా తయారవుతుంది.

నీహారిక, హైద్రాబాదు.

'జ్యోతి' ముఖచిత్ర సౌందర్యమే నన్ను మీ పాఠకుడిగా చేసిందంటే సత్యదూరం కాదేమో!

'సుబ్బలక్ష్మి పెళ్ళి' వాస్తవానికి చాలా చాలా సన్నిహితంగా ఉంది.

మల్లాది బాపన్నశాస్త్రి,
హిందూపురం.

జూన్ 'జ్యోతి' లో "తోడూ నీడా" రివ్యూ వ్రాస్తూ 'దీన్లో భానుమతి పాడిన ఇంగ్లీషుపాట ప్రత్యేక ఆకర్షణ కాగలదు' అన్నారు. అది భానుమతి స్వంత పాట కాదు, మహాదేవన్ స్వంతంగా ట్యూన్ చేసినదీ గాదు. "ది మాన్ హూ న్యూ టూ మచ్" అనే పిక్చర్లో డోరిస్ డే తనకోసం స్వంతంగా పాడుకున్న 'కె సెరా సెరా' అనే పాట. దానిని జోలపాట సన్నివేశంలో భానుమతి యథాలాపంగా రెండు చరణాలు మాత్రం పాడింది.

అం దేవ్, రాజమండ్రి.

అవసరాలవారి "అసలైన ఆత్మహత్య" ఆణిముత్యం అయితే, అది విష్ణుగారి "దేవుడు కరుణించాలి" నీలిరాగం.

ముదిలి మహేశ్వరరావు,
హైదరాబాదు.

చరణ సేవ

పి. గణపతి శాస్త్రి

బ్రతుకులో నునువెచ్చ పసిమి పొంగుల గుమ్మ
పాలపాయసము నా ప్రాయమ్ము సర్వమ్ము
ప్రతి దినము దుష్ట దుర్భర దాస్య భావాన
భగ్నమ్మె దేదురిత ఫలితమో అనుకొంటి!

బోయవలలో నింగికే యెగసి పోజూచు
కోయిలల దొరవోలె కొసరెక్కలల్లార్చి,
పాయదిక, జటిలమై పట్టి బంధించె నా
పాదపాశమ్మాశలేదని కలంగితిని.

జగదేకధాత్రి యెదజాలికై కయి మోడ్చి,
సకల శృంఖల లూడ్చి, యిక భావి జనినైన
స్వచ్ఛ మానస సరోవర రాజహంసనై
స్వేచ్ఛ విహరింప నువ్విళ లూరితిని! కాని,

ఈ వేళ నీ చరణసేవావకాశ మొక
యింతైన లభియించెనేని, రారాజులే
ఆవంత ననుగొలువ నర్హులా! యని లోన
భావించితిని సుమా! ప్రాణ సర్వస్వమా!

తోచక, పూహించుకునే తియ్యటి పగటి కలలాగా వుంది.

ఇహపోతే పాత్రలు. కథానాయిక చాలా అందగత్తె, పెద్దకళ్ళు, పొడుగు పాటి జడ, తెల్లటి దేహచ్ఛాయ. కాస్తో కూస్తో చదువుకున్నా బొత్తిగా ప్రపంచ జ్ఞానం శూన్యం. ఆ అమ్మాయికి, ఒక్కగానొక్క బామ్మ (ఎక్కువమంది, అంటే అమ్మా నాన్నా వుంటే కథకు అడ్డొస్తారని గాబోలు రచయిత్రి అభిప్రాయం) కథానాయకుడు శేఖరం అందగాడు, అంత లావూ ఇంత పొడుగూను. ఎంత ధనవంతుడయ్యా అంటే, ఆయన గారికి ఓ పెద్ద బంగళానే గాదూ, కంపెనీలేగాదూ, ద్రాక్ష తోటలే గాదూ- ఇంకా వంటవాడూ, బూట్లు తొడగటానికీ, దానికీ - దీనికీ మనుష్యులూ - ఓహ్. చెప్పలేం, ఆయనగారి ఐశ్వర్యం. అతనికూడా తల్లీ, తండ్రీ వగైరా ఎవరూ వుండరు. అతనిచుట్టూ అందమైన ఆడవాళ్ళు డాన్సులు, పరిచర్యలూ చేస్తున్నా, వాళ్ళతో నవ్వుతూ మాట్లాడతాడే గాని, వాళ్ళకు తన వెడల్పాటిహృదయంలో చోటివ్వడు.

ఇంకోటి గమనించాలి. మన దేశంలో, ముఖ్యంగా మన తెలుగు వాళ్ళలో ఎంత ధనవంతులుగానీ, ఎంత చక్కటి శేఖరాలుగానీ, ఆడ సెక్రటరీలను పెట్టుకోవటం నేను కనీ వినీ ఎరుగను. పోనీ, సెక్రటరీని పెట్టుకున్నాడే అనుకొంది, ఆవిడచేత అన్నీ నాజూకు పనులే చేయిస్తాడు. ఆవిడకి బోల్డంత జీతం. ఇవే గాక ఆవిడకి బోలెడు ప్రజెంటేషన్లు.

ఇట్లా బోలెడున్నయ్ రాయటానికి. కానీ రాస్తే ఓ చాటు భారతం లాగా తయారవుతుంది.

నీహారిక, హైద్రాబాదు.

'జ్యోతి' ముఖచిత్ర సౌందర్యమే నన్ను మీ పాఠకుడిగా చేసిందంటే సత్యదూరం కాదేమో!

'సుబ్బలక్ష్మి పెళ్ళి' వాస్తవానికి చాలా చాలా సన్నిహితంగా ఉంది.

మల్లాది బాపన్నశాస్త్రి,
హిందూపురం.

జూన్ 'జ్యోతి' లో "తోడూ నీడా" రివ్యూ వ్రాస్తూ 'దీన్లో భానుమతి పాడిన ఇంగ్లీషుపాట ప్రత్యేక ఆకర్షణ కాగలదు' అన్నారు. అది భానుమతి స్వంత పాటు కాదు, మహాదేవన్ స్వంతంగా ట్యూన్ చేసినదీ గాదు. "ది మాన్ హు న్యూ టూ మచ్" అనే పిక్చర్లో డోరిస్ డే తనకోసం స్వంతంగా పాడుకున్న 'కె సెరా సెరా' అనే పాట. దానిని జోలపాట సన్నివేశంలో భానుమతి యధాలాపంగా రెండు చరణాలు మాత్రం పాడింది.

అం దేవ్, రాజమండ్రి.

అవసరాలవారి 'అసలైన ఆత్మహత్య' ఆణిముత్యం అయితే, ఆది విష్ణుగారి "దేవుడు కరుణించాలి" నీలిరాగం.

ముదిలి మహేశ్వరరావు,
హైదరాబాదు.

చరణ సేవ

పి. గణపతి శాస్త్రి

బ్రతుకులో నునువెచ్చ పసిమి పొంగుల గుమ్మ
పాలపాయసము నా ప్రాయమ్ము సర్వమ్ము
ప్రతి దినము దుష్ట దుర్భర దాస్య భావాన
భగ్నమ్మై దేదురిత ఫలితమో అనుకొంటి!

బోయవలలో నింగికే యెగసి పోజూచు
కోయిలల దొరవోలె కొసరెక్కలల్లార్చి,
పాయదిక, జటిలమై పట్టి బంధించె నా
పాదపాశ మ్మాశలేదని కలంగితిని.

జగదేకధాత్రి యెదజాలికై కయి మోడ్చి,
సకల శృంఖల లూడ్చి, యిక భావి జనినైన
స్వేచ్ఛ మానస సరోవర రాజహంసనై
స్వేచ్ఛ విహరింప నువ్విళ లూరితిని! కాని,

ఈ వేళ నీ చరణసేవావకాశ మొక
యింతైన లభియించెనేని, రారాజులే
అవంత ననుగొలువ నర్హులా! యని లోన
భావించితిని సుమా! ప్రాణ సర్వస్వమా!

రాజకీయ వాతావరణం

ఒక ఏడాది గడచిన తరువాత....

"విక్రమార్కుడి సింహాసనం ఎక్కిన శ్రీ లాల్ బహదూర్ శాస్త్రికి— ఎక్కేంత వరకు వూరుకుని, ఎక్కి కూర్చున్న తరువాత సాలభంజికలు 'కథలు' చెప్పి 'వేధించటం' ప్రారంభించాయి.

'ఇంటు గెలవటం రచ్చగెలవటం' ఒక్కమాటే శ్రీ లాల్‌బహదూర్‌ను పెనవేశాయి.

మరి, శ్రీ శాస్త్రి, నెహ్రూగారి 'చెప్పుల్లో' కాలెట్టిన 'చిన్న మనిషి'–

అయినా ఆయనకు కాలం బాగానే కలిసివచ్చింది. సుడిగాలి పడకొట్టకుండానే, ఏడాది గడచిపోయింది.

ప్రధానిగా శ్రీ శాస్త్రి, క్రిందటి జూన్ తొమ్మిదవ తేదీన ప్రారంభించి, మొన్న జూన్ తొమ్మిదవ తేదీతో ఒక మైలురాయి దాటి వెళ్ళారు—

నెహ్రూ లేకుండా దేశం, ప్రజలు ఏడాది గడిపేశారు.

జరిగిన గతాన్ని స్మరించి ...రీజు లేస్తే — భయం ముందుకొస్తుంది. మనమీదే మనకు నమ్మకంపోతుంది; ఆసాంతంలో మన మీద మనకు నమ్మకం కూడా పుడుతుంది...

వెక్కిరిస్తూ చుట్టూరా శత్రు సైన్యాలు, మధ్యలో 'గాలిలో దీపం పెట్టి' బిక్కు బిక్కుమంటూ మనం.

పాకిస్తాన్‌వాళ్ళు కంజర్‌కోటను వదలి పెట్టకుండా 'రాణ్ ఆఫ్ కచ్'లో దాదాపు పదిమైళ్ళు ఇంకా ఆక్రమించుకునే వున్నారు. ఈ తగాదా గురించి గత మేలో మధ్యవర్తిత్వం ప్రారంభించిన బ్రిటన్ ఇంకా దానిని అట్లాగే సాగిస్తోంది. కప్పుని కరవద్దంటే పాముకి కోపం వస్తుందనేదే దాని భయం. అప్పుడే జూన్ కూడా వెళ్ళిపోతోంది.

చైనా వాళ్ళు రెండవ దఫా అటంబాంబు పేల్చి అక్కడక్కడా మన సరిహద్దులతో దాగుడుమూతలాడుతున్నారు.

పాకిస్తాన్ వెళ్ళి చైనా ఒళ్ళో కూర్చుని ఇండియామీద నిప్పులు చెరుగుతుంటే, అమెరికా బ్రిటన్‌లు కిమ్మనక లేకపోగా పైపెచ్చు మనకే శ్రీరంగనీతులు బోధిస్తున్నారు.

చైనాను ప్రతిఘటించి నిలబడా

లంకే రష్యా ఇచ్చే శస్త్ర పాటవాన్ని నమ్మలేం కనుక అమెరికా వైపు మొగ్గు చూపాలనేవారు కొందరు; పాకిస్తాన్ చేసే అల్లరిని అపు చెయ్యాలన్నప్పుడు అమెరికావాళ్ళు చేసే సైనిక సహాయాన్ని నమ్మలేం కనుక రష్యావైపే మొగ్గుచూపి వాళ్ళతోనే మరింత పొత్తు సాగించాలనేవారు మరి కొందరు... 'అటువెళితే అగాథం, ఇటు తిరిగితే మింగెయ్యాలని మీదకురికే పెనుభూతం'.

బజార్లో ధరలు మండిపోతున్నా నోరు మూసుకుని 'గృహస్థు' దొరికిందే చాలనుకుని 'దినవెచ్చాలు' కొనుక్కుపోతున్నాడు. చాలీచాలని జీతాలను చాలినంతగానే సరిపెట్టుకుంటున్నాడు.

ప్రత్యక్షంగా ప్రతి విషయంలోనూ నిత్య జీవితంలో గతయేడాదిలోలాగా యెప్పుడూ భారతదేశంలో ఇంతటి వైరాగ్య చింతన కనిపించలేదేమో... అనిపిస్తోంది.

దేశంలో భక్తి పెరిగింది. బొట్టు పెట్టుకునే మొగవాళ్ళు యెక్కువైనారు. తిరుపతి వెంకటేశ్వరునికి ముడుపుల చెల్లింపు యెక్కువైంది. అఖిలభారత తెలుగు రచయితలు కూడా తమ సమావేశాలను తిరుపతిలోనే జరిపించారు. వాటికి వెళ్ళిన చాలామంది రాజకీయ నాయకులు తల నీలాలు స్వామివారికిచ్చారు.

అదృష్టంమీద, విధివిలాసం మీద నమ్మకం పెరిగే రోజులు;

పట్నం గడుపుకోవటం ప్రధానం,

కమ్యూనిస్టుల కంచుకోటనుకున్న నల్లగొండ ఉపయెన్నికలో అంతులేని మెజారిటీతో కాంగ్రెస్ వారు గెలిచారు అలాగే చాలా ఉపయెన్నికల్లో కాంగ్రెసువారే గెలిచారు.

అవును మరి, 'పర్మిట్ల రాజ్యం' అంటారు రాజాజీ.

అయితే పోనీలే, పదిహేనేళ్ళ నుంచీ మీ ప్రతిపక్షాలు మాత్రం యేం చేశాయి అని ప్రశ్నిస్తాడు వీధి మూసిన 'కుటుంబరావు'...

అంతవరకు శాసనసభలో అన్యాయాన్ని, మంత్రిగారిని, [illegible] దుయ్యబట్టిన ప్రతిపక్షంలోని అసామీ, సభ వాయిదా పడగానే 'డిన్నరని' కోసం నవ్వుతూ మంత్రిగారి దగ్గరకు వెడితే 'కుటుంబరావు'కు మతి పోతుంది.

అందుకే — తన అదృష్టాన్నే తాను [illegible]. తనకు నాయకుడు యెడుకొండలవాడు. అలాగే ఆ నాయకుల్ని [illegible] తన 'పనులు' [illegible] చేయించి [illegible] తాను నమ్ముతాడు.

ఇహ ఢిల్లీ [illegible] వస్తే—

విక్రమార్కుడి సింహాసనం మీద కూర్చున్న శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి కనిపిస్తారు.

ఒక్క [illegible] గమనించాలి. శ్రీ [illegible] అనుకుని కూడా [illegible]లేదు.

ప్రతి సమస్యకు శ్రీ నెహ్రూగారి త్రిక దృక్పథాన్ని చూపించేవారు. ఆయన ఊహ చాలా విశాలంగా వుండేది. ఉన్నతంగా చూసి గంభీరంగా మాట్లాడేవారు. దేశాలను మనుషులను కాలాలను తరచి అరసి మననం చేసుకుని మాట్లాడిన మాటలు ఆయనవి. అందుకే అందరికి అవి వినిపించేవి. అందరినీ ఒప్పించేవి.

ఆ నడకలో ఆ నిండుతనం, ఆ పొంకం, ఉత్సాహం, ప్రపంచాన్ని వెర్రి ఆనందంలో ముంచెత్తేవి. పరవశం చెందిన ప్రపంచం ఆయన మూర్తిలో తన లక్ష్యాన్ని దర్శించేది.

అలీన విధానాన్ని ఆయన ప్రవచిస్తే రష్యా అమెరికాలు కాదనలేదు. ఒప్పుకున్నాయి.

కొత్తగా స్వాతంత్ర్యం పొందిన ఆసియా ఆఫ్రికా రాజ్యాలకు ఆయన గమనం మార్గదర్శకం అయింది. ఒక నాసర్ ఉద్భవించాడు. ఒక యన్క్రుమా లేచి నిలబడ్డాడు. అలాగే అనేకమంది వరుసగా నెహ్రూ అలీన విధానాలకు చెప్పకుండానే వారసులైనారు.


శ్రీ శాస్త్రికి ఆ గంభీరత యెలా వస్తుంది? ఆ మాటలోని, భావంలోని, మూర్తిలోని నిండుతనం ఒక్క మాటుగా యెలా అబ్బుతుంది ...?

ఏమైనా సరే — కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఉప నాయకత్వానికి పోటీ చేస్తానని గంభీరంగా వుపన్యాసాలు పలికిన శ్రీమతి విజయలక్ష్మి పండిట్ చివరిక్షణంలో విరమించుకోవటం, మరుక్షణం శ్రీ శాస్త్రి నాయకత్వానికి చాలావరకు విజయచిహ్నమే అనుకోవాలి.

ఈనాడు కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలువున్న పరిస్థితుల్లో, విరుద్ధ శక్తులను చాకచక్యంతో ఓర్పుతో కూడగట్టుకుని సమన్వయం సాధించగలిగిన నాయకుడే కావాలి. దబాయించి నిర్మొహమాటంగా తెగేసినట్లు వ్యవహరించే నాయకుడు యెంత పెద్దవాడైనా, ఈ ఒడుదుడుకుల్లో దేశానికి అరిష్టమే తెస్తాడు.

నెహ్రూగారి హయాంలో తగాదాలు తీర్చే పెద్దమనిషిగా శ్రీ లాల్ బహదూర్‌కు పేరు. అందరినీ మంచి చేసుకునే స్వభావం ఆయనది. కొందరనేటట్టు శ్రీ మురార్జీలాగా 'రియాక్షనరీ' కాడు. శ్రీ నందా లాగా 'లెఫ్టిస్టు' కాదు. అందరితోనూ సంప్రతిస్తాడు. తన ఉద్దేశాలను ముందుగా చెప్పడు. ఎదుటివారి ఉద్దేశాలను వింటాడు. అందరినీ వింటాడు. అందరినీ అడుగుతాడు. అందుకే ఆయన నిర్ణయాలు ఆలస్యం అవుతాయి.

అయితేయేం, కాంగ్రెస్ నాయకులలో యెక్కువమందికి ఆయనంటే తృప్తి. కారణం— వాళ్ళ మాటలు వినిగాని యే నిర్ణయాలూ తీసుకోటం లేదు. కాబట్టి—వాళ్ళల్లో యెవరూ యెదురు తిరగరు. కాబట్టే దేశానికి కొంత క్షేమం. ఇప్పుడున్న పరిస్థితుల్లో మరీనూ—



కాని, ప్రజలకు మాత్రం నిర్ణయాలు తీసుకోటంలో జరిగే జంఝాటన చాలా చికాకు కలిగిస్తోందనేది వాస్తవం.

ప్రతి సమస్యమీదా వెంటనే ముందుగా గంభీరంగా ప్రధాని సూచనలు, వ్యాఖ్యానాలు వినటానికి అలవాటు పడ్డ ప్రజకు, ఇప్పుడు శ్రీ శాస్త్రి సాగిస్తున్న 'సుదీర్ఘ సమాలోచనలు', జాప్యం చికాకు కలిగిస్తున్నాయి.

సంప్రతింపులు చెయ్యకూడదని కాదు మా అభిమతం. చేసేవి త్వరగా చెయ్యాలని. నిర్ణయాలు త్వరగా వ్యక్తం అవాలని. కాంగ్రెస్ తగాదాలు తీర్చటానికి, దేశ సమస్యలు సరిదిద్దడానికి చాలా వ్యత్యాసం వుంది.

నాయకుడంటే, తాను దారి చూపించి, అందరినీ ఆ దారిని నడిపించేటట్టు వుండాలి. అంతేకాని, దాంకోసం తడుముళ్ళాడుతూ అందరినీ అడగటం కాదు.

శ్రీ లాల్‌బహదూర్ చేస్తున్న విదేశ పర్యటనలు ఆయన వ్యక్తిత్వానికి కొత్త మెరుగులు దిద్దుతాయని మా ఆశ.

ఆయన రష్యా పర్యటన విజయవంతం అయింది. అమెరికా పర్యటన మానివేసి కెనడా వెళ్ళి విజయవంతంగానే తిరిగి లండన్ వెళ్ళటం; ఈజిప్టులో నాసర్‌తో సలిపిన సంప్రతింపులు – శ్రీ శాస్త్రికి కొత్త వ్యక్తులతో ముఖాముఖీ పరిచయం కలిగే అవకాశం లభించింది.

లండన్‌లో శ్రీ అయూబ్ ఖాన్‌ను ఆయన కలుసుకున్నారు. అట్లాగే అల్జీర్స్‌లో చౌ యన్ లైను కూడా కలుసుకోవచ్చు.

అంతర్జాతీయ వ్యవహారాలలో ఆయా నాయకుల ఆలోచనలు మన సత్వాలు యెలా వుంటాయో ప్రత్యక్షంగా శ్రీ శాస్త్రి తెలుసుకుంటున్నారు.

ఈమధ్య ఆఫ్రికా అరేబియా ఖండాలలో చైనా పలుకుబడి క్రమంగా క్షీణిస్తోంది. అక్కడి దేశాలకు చైనా అంటే అనుమానం యేర్పడుతోంది. దానికి తోడుగా భారత దేశంపట్ల సౌహార్ద్రభావం పెంపొందుతోంది.

అల్జీర్స్‌లో జరిగే అలీన రాజ్యాల కూటమికి శ్రీ శాస్త్రి తనవెంట కృష్ణమీనన్‌ను తీసుకు వెళ్ళకుండా వుండటం శ్రీ శాస్త్రి ఆలోచనావిధానంలో కొంత గంభీరతను తను సూచిస్తోంది.

వియత్‌నాం సమస్య విషయంలో అలీన రాజ్యాల ఆలోచనలతో మన నాయకుల ఉద్దేశాలు ఏకీభవించటం, ఇందుకు కెనడా కూడా చాలా వరకు మద్దతు అవటం, ఒక శుభ సూచకమే.

అల్జీర్స్‌లో జరిగే అలీన రాజ్య కూటమిలో మలేసియాకు, రష్యాకు ప్రవేశం కల్పించే విషయంలో భారత దేశాన్ని అలీన రాజ్యాలు దాదాపు అన్నీ సమర్థించటం మరో ముఖ్య విషయం.

కేంద్ర-సాహిత్య అకాడమీచే ప్రప్రథమంగా తెలుగు నవలకు బహుమతి నందుకొన్న

శ్రీ. శే. గోపీచంద్

నవలలు

పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా	6.00
యమపాశం	6.00
అసమర్థుని జీవయాత్ర	4.00
మెరుపుల మరకలు	5.00
పరివర్తనం	1.50
పిల్లతెమ్మెర	1.50

క్రమక్రమంగా అంతర్జాతీయంగా ఈ మధ్య చైనా ప్రాభవం తగ్గిపోతోంది. భారత దేశంపట్ల సానుభూతి పెరుగుతోంది.

భారత దేశానికి చేస్తున్న సహాయాన్ని తగ్గించాలనే తీర్మానాన్ని అమెరికన్ సెనేట్ త్రోసిపుచ్చటం ఒక శుభ పరిణామమే.

శ్రీ శాస్త్రి యేడాదిపాటు సాగించిన ప్రధాని గిరి, బేరీజులు వేసుకుంటే—భవిష్యత్తును గురించి ఆదిలో కొంత భయం వేసినా క్రమంగా కొంత ధైర్యం కూడా జనిస్తోంది.

నాల్గవ ప్రణాళికకు తగినంత ధన సహాయం కూడా లభ్యం అయే సూచనలు కనిపిస్తున్నాయి.

సైనిక పాటవం క్రమంగా త్వరగానే పెంపొందించుకుంటున్నాం.

సంధి యుగంలో ఒడుదుడుకులు లేకుండా ఓడ నడిపించగల సరి అయిన నాయకుడు శ్రీ శాస్త్రి అనే నమ్మకం కలుగుతోంది.

— జరగ వలసిందల్లా ఒక్కటే.

ఏతుపానూ రాకూడదు. పాము కప్పని కరవకూడదు. విక్రమార్కుడి సింహాసనాన్ని మోస్తున్న సాలభంజికలు కథలు చెప్పినట్లుచెప్పి ఒక్కమాటుగా తల్లక్రిందులు చేసి మాయమై పోగూడదు... అంతే.

భాషా సమస్య

ఆరునెలలు సాముచేసిన ఆ పెద్ద మనిషి మళ్ళీ వెళ్ళి ఆ మూలనున్న ముసలమ్మనే తన్ని వచ్చాడట—



తిరుపతిలో అఖిలభారత తెలుగు రచయితల మహాసభ సందర్భంలో పరస్పరం అభినందించుకుంటున్న కేంద్ర మంత్రి శ్రీ బి. ఎస్. మూర్తి, శ్రీ విశ్వనాథసత్యనారాయణ.

సమావేశాల మీద సమావేశాలు యేర్పాటుచేసి, సంప్రతించి యేమిటయ్యా అంటే — త్రిభాషా సూత్రాన్నే ఆచరించటానికి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఒప్పుకుంది.

దీనికి తోడుగా మరో కొత్త 'సొంపు' కూడా జత చెయ్యటంతో అంతా సజావుగా జరిగితేసవ్యంగానే వుంటుందిగాని, తంత్రాంగం బెడిసి కొడితే మాత్రం, మళ్ళీ అల్లరు అలజడులు, తప్పవు అనే అనుమానం కూడా కలుగుతోంది.

యు. పి. యస్. సి. పరీక్షల్లో హిందీ, ఇంగ్లీషులతోపాటు, ప్రాంతీయ భాషలో కూడా పరీక్షలు వ్రాయటానికి వర్కింగ్ కమిటీ ఒప్పుకుంది. బాగానే వుంది. తత్ఫలితంగా ప్రాంతీయ భాషలు అభివృద్ధి చెందుతాయి. విశ్వవిద్యాలయాల్లో బోధనా భాషగా ప్రాంతీయ [illegible] ప్రవేశ పెట్టటానికి చక్కటి [illegible] త్వరగా కలుగు [illegible]

'యు. పి. యస్. సి. పోటీ పరీక్షలు అఖిల భారత స్థాయిలో ఈ కొత్త పద్ధతి ప్రకారం యెలా జరుగుతాయి అనే విషయంలో ఒక సందేహం కలుగుతోంది.

పరీక్షలకు వెళ్ళే విద్యార్థులు ప్రాంతీయ భాషల్లో పేపర్లు వ్రాయటానికి అవకాశం కలుగుతుంది. ఒకే సబ్జక్టుమీద పద్నాలుగు భారతీయ భాషల్లోనూ పేపర్లు రాయబడతాయి. అప్పుడు దిద్దే అధికారులు యెలా దిద్దుతారు? మొత్తం ఉత్తీర్ణులైన వారిలో అఖిల భారత స్థాయిలో శ్రేణిని (రాంక్) యెలా నిర్ణయిస్తారు?

పేపర్లు దిద్దే అధికార్లకు పద్నాలుగు భాషల్లోనూ ప్రవేశం వుండాలా?

లేకపోతే—

ఏ భాషకు ఆ భాషను విడివిడిగా తీసుకుని, పదవులను భాషలవారీగా కేటాయిస్తారా?

అటువంటప్పుడు, అఖిల భారత స్థాయిలో పోటీకి పెట్టిన పదవులను ఇచ్చేటప్పుడు భాషలవారీగా కేటాయించటం రాజ్యాంగానికి విరుద్ధం కాదా?

పైగా పదవుల కేటాయింపు కోటా పద్ధతిని జరగకూడదని వర్కింగ్ కమిటీ తీర్మానించింది.

భాషా సమస్యకు సూచించిన పరిష్కార మార్గం స్థూలంగా బాగున్నట్లు అనిపించినా సూక్ష్మంగా చూస్తే కొత్త అవాంతరాలకు దారి తీయగలదని అనిపిస్తోంది.

—అనంతం.

నవ్వాలీ నవ్వాలీ

● అవాళ నవంబరు 14 వ తేదీ. నెహ్రూగారి పుట్టినరోజు. ఆయన పొద్దున్న చాలసేపు ఢిల్లీ బాలబాలికలతో కాలక్షేపం చేశారు. పిల్లలంతా వెళ్ళిపోయాక నెహ్రూగారు సెక్రటరీతో "ఇవాళొక కుర్రా డేం చేశాడో తెలుసా ?" అన్నారు.

"ఏం చేశాడు ?"

"నన్ను వెక్కిరించాడు."

సెక్రటరీ నిర్ఘాంతపోయి "ఎవడా కొంటె వెధవ?" అన్నాడు.

"అప్పుడు నే నేం చేశానో తెలుసా ?"

"ఏం చేశారు ?"

"మళ్ళీ వెక్కిరించాను" అన్నారు నెహ్రూగారు.

● కొత్తచిత్రం విడుదలైన సినిమాహాలు దగ్గిర అరమైలు పొడుగున క్యూ వుంది. ఆట మొదలెట్టడానికి ఇంక అయిదు నిమిషాలే టైముంది. ఒక పల్లెటూరివాడు హడావిడిగా పరుగెత్తుకొచ్చి టిక్కెట్టిమ్మన్నాడు. కౌంటర్‌లో కూర్చున్న గుమాస్తా క్యూలో చివర నిలబడమన్నాడు. పల్లెటూరతను క్యూ చివరదాకా వెళ్ళి మళ్ళీ హడావిడిగా పరుగెత్తు కొచ్చాడు.

"ఇందాక చెప్పాను గదటయ్యా క్యూ చివర నుంచోమని" అన్నాడు గుమస్తా.

"అక్క డెవరో ఇదివరకే నుంచున్నారయ్యా బాబూ ! టిక్కెట్టియ్యి" అన్నాడు పల్లెటూరతను.

● రాము : "పరగడుపున నువ్వెన్ని ఇడ్లీలు తినగలవ్ ?"
సోము : "ఆరు."
రాము : "ఉహు. ఒకటికంటె ఎక్కువ తినలేవు."
సోము : "ఎందుకని ?"
రాము : "ఒకటి తిన్నాక ఇంకా పరగడుపు ఎల్లా అవుతుంది ?"

మనసు సాగరం

అరవింద

చెట్టు ఎక్కి జామకాయలు కోస్తున్నాడు క్రిష్ణ.

"ఆ పై కొమ్మకి చూడరా. ఎంత పచ్చగా ఉందో. ఆ, కొయ్యి. అది నాకే." అని క్రిందనుంచి కేకలు పెడుతోంది ఇందిర.

"ఇది నాకు. నీ కోసం ఇంకొకటి దాచాలే. అది నీ కిస్తాను ఇందిరక్కా" అన్నాడు క్రిష్ణ.

"ఉహు అదేమీ సాగదు. ఇస్తావా, నన్ను చెట్టెక్కమన్నావా?" అంది చెట్టుమీద కాలువేస్తూ ఇందిర. చెల్లెలు పరిగెత్తుకుని వచ్చింది అక్కడికి.

"అక్కా, అన్నయ్య ఇంకా చాలామంది వచ్చేశారే." అంది ఆయాసపడుతూ హడావిడిగా చెప్తూ.

"ఇంకా ఎవరు వచ్చారే" అంది ఇందిర జామకాయ సంగతి మరిచి, చెట్టుమీద నుంచి కాలుతీస్తూ.

"ఆ, నీకు పెళ్ళివారొచ్చారు పద, పద" అన్నాడు చెట్టుమీదనుంచి తను కూడా దిగుతూ అన్నయ్యని చూడాలనే ఉత్సాహంతో క్రిష్ణ.

"వస్తే రానీ నాకేం భయమా!" అంటూ లోపలికి వెళ్ళింది ఇందిర. అప్పుడే ఊరు నుంచి వచ్చిన అన్నయ్య శంకర్, అతని స్నేహితులిద్దరు, కుర్చీలలో కూర్చుని ఇందిర తండ్రి ప్రసాదరావుగారితో సంభాషణలో పడ్డారు వాళ్ళందరూ ఉన్నారని ఇందిర అక్కడికి హాలులోకి వెళ్ళలేదు. కిటికీ కర్టెన్ పక్కగా చూస్తే అందరూ కనిపిస్తున్నారు. అన్నయ్య స్నేహితుడు ఒకతను నల్లగా, అదే, చామనఛాయ అంటారు ఆ రంగులో ఉన్నాడు. ప్రక్కనే ఉన్న ఆ రెండవ అతడు తెల్లగా ఉన్నాడు. "

పేమటి, అందంగా ఉన్నాడు జుట్టు కూడా అందంగా ఉంది డ్రెస్సు కూడా బాగుంది మంచి స్టయిల్‌గా ఉన్నాడు నవ్వుతుంటే ఎంత బాగు న్నాడు! అనుకుంది ఇందిర. అక్కడ నుంచి పక్కగదిలోకి వెళ్ళింది. ఎదురుగా టేబుల్ మీద ఉన్న అద్దం ఇందిరను పిలిచింది. జడ ముందుకు వేసుకుని కొసలు అల్లుకుంటూ ఓరగా చూసుకుంది తనను తనకేం, చక్కగా ఉంటుంది అందరూ అంటారు జమునలాగ ఉంటుందని. శారద తెల్లగా ఉంటుందని మిస్ కాలేజ్ అంటారు కానీ తనకున్న ఆకర్షణ, అందం ఆ అమ్మాయి మొహంలో ఎక్కడ ఉన్నాయ్! తను అంత తెలుపు కాదంతే.

'అన్నయ్యావాళ్ళకి కాఫీ యిచ్చి రావే ఇందూ' అమ్మ పిలిచింది వంటింట్లోంచి. తన ఆలోచనల్ని అక్కడ వదిలి, నాలుగు కప్పుల్ని ట్రేలో వుంచి తీసుకు వెళ్ళి బల్ల మీద పెట్టింది ఇందిర. ముందుకు పడిన జడ చివరలను మెలిపెడుతూ 'ట్రెయిన్ లేటయినట్లుందే' అంది అన్నయ్యతో.

'ఆఁ, అరగంట లేటు' అని, 'మా చెల్లెలు, ఇందిర' అని స్నేహితులకి పరిచయం చేశాడు.

'బి ఎస్‌సి. రెండవయేడు ఇంది' అని ప్రసాదరావుగారు అన్నారు.

ఇందిర గర్వంగా చూసింది, తెల్లగావున్న యువకుడివైపు.

'ఏ గ్రూపు?' అన్నాడతడు. —

అతనికి జవాబు చెప్పి 'ఇతను మాధవరావు. మంచి స్పోర్ట్స్‌మన్. ఫొటోగ్రఫీ హాబీ. ఇతను రామకృష్ణ. చిన్నప్పట్నించీకూడా ఫస్టువారు. లె కాలేజి ఫస్టు, యూనివర్సిటీ ఫస్టూను. మంచి మెరిట్‌తో ప్యాసయ్యాడు పుస్తకాలు తెగ చదివేస్తుంటాడు' అన్నాడు శంకర్.

'నన్ను అంత పుస్తకాల మనిషిని చెయ్యకురా. నాకూ మామూలు ప్రపంచం అంటే ఆసక్తి వుంది' అన్నాడు రామకృష్ణ నవ్వుతూ.

'ఆ. వాడికి సంగీతమంటే ఇష్టం. కొన్నాళ్ళు వయొలిన్ కూడా వెలగబెట్టాడు. అయినా మగవాళ్ళకి సంగీతం ఏమిటి?' అని మాధవరావ్ నవ్వుతుంటే అతడి వైపుచూసి అతడి నవ్వుతో నవ్వు కలిపింది ఇందిర.

మీరు నవ్వుకుంటే నాకేం, నవ్వుకోండి, అన్నట్లు కూర్చున్నాడు రామకృష్ణ.

'అదేమిటిరా, సంగీతానికి, శాస్త్రానికి ఆడ, మగ ఏమిటి? ప్రసిద్ధ గాయకులు చాలామంది మగవాళ్ళు కాదూ' అని శంకర్ అంటుంటే 'అది కాదోయ్. మనవంటి మామూలు వాళ్ళ సంగతి. ఉద్యోగం చేసే మగవాడు పాటలు పాడటం, వంట వండటం, సంసారం చేస్తూ పిల్లలున్న గృహిణి యుద్ధం తర్ఫీదు పొందటం, సంఘసేవకి బయలు దేరటం ఎట్లా ఉంటాయి!' అని నవ్వాడు మాధవ

రావ్. మళ్ళీ నవ్వింది ఇందిర అతడి వైపు చూసి.

'ఇందూ!' ఇంతలోకి వాళ్ళమ్మ వంటింట్లోంచి పిలిచింది అయిష్టంగానే అక్కడ నుంచి వెళ్ళింది ఇందిర.

సాయంత్రం మాధవరావ్ అందరికీ ఫోటోలు తీశాడు. ఇందిర ఒక్కతే న్చునితీయించుకుంది జడ ముందుకి వేసుకుంది. ఒక చేతికి వాచి, రెండవ చేతికి నాలుగు బంగారు గాజులు. స్క్వేర్ నెక్ జాకెట్‌లోనుంచి ఒంటిపేట గొలుసు అందంగా అమరి కనిపిస్తోంది. చక్కటి ప్రింటెడ్ చీర, ప్లెయిన్ కలర్ చోళీ ధరించింది. కోలగా బొట్టు పెట్టుకుంది.

'ఫోటో బాగా రావాలి. పెళ్ళి చూపులకి పంపిస్తాము' అన్నాడు శంకర్ మాధవరావుతో.

'ఫోటో బాగా రాకపోవడమనేది మన దగ్గర ఎప్పుడూ లేదు. ఉన్నది ఉన్నట్లుగా వస్తుంది. నేను తీసే యాంగిల్‌లో ఇంకా లేనిఅందం కూడా వస్తుంది అసలు మనిషి బాగుంటే భయం ఎందుకూ' అన్నాడు మాధవరావు తయారయి నిలబడిన ఇందిరని చూస్తూ. ఇందిర నవ్వింది.

'చాలా బాగుంది. అట్లాగే ఉండండి' అన్నాడు మాధవరావ్. ఇందిర గుండె ఝల్లుమంది. చాలా బాగుంది తన నవ్వు అతడికి చాలా బాగుంది అనుకుంది. ఇంతవరకూ ఖాళీగా ఉన్న ఆమె హృదయంమీద మాధవరావ్ ముద్ర పడింది

'ఈ ఏడాదితో ఇందు చదువు అయిపోతుంది. ఈ లోగా దీనికి మంచి సంబంధం చూడాలి. నీ స్నేహితుల్లో ఎవరినైనా వెతుకు. చెల్లెలికి మంచి మొగుణ్ణి తేవటం నీ బాధ్యతే. అంత యూనివర్సిటీలో నీకు తెలిసిన వాళ్ళు ఎంతోమంది వుంటారు' అంది తల్లి శంకర్‌తో. అందరూ భోజనాలు చేస్తున్నారు.

'ఆ వుద్దేశంతో నేనమ్మా వాళ్ళిద్దరినీ యిక్కడ ఆపింది' అన్నాడు శంకర్.

'ఆ తెల్లగా వున్నతనా మాధవరావ్! మనిషి బాగున్నాడు. తల్లీ దండ్రీ వున్నారా? ఆస్తి వుందా?' తల్లి ప్రశ్నిస్తోంది.

'ఆ. వాడు లెక్చరర్ అవుతాడు. వాడి కింకేమీ చదవాలని లేదు. వాడి తండ్రి కాలేజి ప్రెసిడెంటు వీడికి వుద్యోగం వెంటనే దొరుకుతుంది. ఉన్న వూరు. వీడే పెద్ద కొడుకు. వాడిది వద్దించిన విస్తరి రామకృష్ణా వాళ్ళిద్దరు అన్నదమ్ములు. తండ్రిలేడు. చెప్పుకోదగ్గ ఆస్తిలేదు. ఇతనికి బాగా చదవాలన్నీ, ఫారిన్ వెళ్ళాలని పట్టుదల. అన్నదమ్ము లిద్దరూ చాలా ప్రేమగా అభిమానంగా ఉంటారు. అన్నగారు [illegible] గు. అతనూ కష్టపడి చదివి [illegible] వచ్చాడు. భాగ్యగు[illegible] [illegible]

రేట్. ఎక్కువ ఆస్తి లేదు కానీ మంచి చదువు, సంస్కారం వున్న కుటుంబం.'

'నీ అభిప్రాయం ఏమిటి? ఇద్దరిలో ఇందుని ఎవరికి అడిగితే బాగుంటుం దంటావ్?' ప్రసాదరావ్ గారు కొడుకుని ప్రశ్నించారు.

'నా అభిప్రాయానికేం! ఇందుకి నచ్చాలి. మీ అందరికీ నచ్చాలి. నన్నడిగితే రామకృష్ణ అంటాను.' అన్నాడు శంకర్.

అన్నం తింటూ మాటలు వింటున్న ఇందిర, అన్నం తినటం ఆపి 'ఆ కోతి మొహమా!' అంది. శంకర్ చురుకుగా చెల్లెలివైపు చూశాడు కొంచెం దెబ్బతిన్నట్టుగా కూడా ఉందతని మొహం. పిల్లలిద్దరూ గొల్లుమని నవ్వారు. తల్లికి, ప్రసాదరావ్ గారికి కూడా నవ్వు నిలిచింది పెదవుల మీద.

'వాడిదేమీ కోతి మొహం కాదు. కాస్త నలుపతే. వాడి మొహంలో ఎంత కళ, తెలివితేటలు ఉన్నాయ్. నువ్వు సరిగ్గా చూసి ఉండవు. ఆ మాట కొస్తే నీదే గుర్రం మొహం.' అన్నాడు శంకర్ ఇందిరతో. ఇంకొక సందర్భంలో అయితే 'నీ కుందేలు మొహం' అని ఉండేదే ఇందిర. కానీ తన పెళ్ళిని గురించిన మాటలని కాబోలు మౌనం వహించి విననట్లు అన్నం తినటం మొదలు పెట్టింది.

'మాధవరావ్‌కైనా ఏమీ తక్కువ లేదు. మనిషి అందంగా ఉంటాడు. కానీ వ్యక్తిగతంగా చూస్తే రామకృష్ణ ఎక్కువనిపిస్తుంది నాకు. మనిషికి ఆలోచన, నెమ్మది కూడా ఉన్నాయి. తోటి వాళ్ళు సుఖపడాలంటే ఇవి కూడా చూడాలి కదా!' అన్నాడు.

కొడుకిట్లాగ చెప్తున్నాడు. కూతురి మనసు రెండవ వాడిమీద పడింది. ఏమిటి చెయ్యటమా అని ఆలోచనలో పడ్డారు ప్రసాదరావ్ గారు.

తర్వాత భార్య ఆలోచన చెప్పింది.

'మాధవరావే అన్ని విధాలా యోగ్యుడు. తండ్రి డబ్బున్నవాడు. ఊళ్ళో పేరు పలుకుబడి కలవాడు. ఇతనూ చదువుకున్నాడు. ఉద్యోగం వుంది. అందంగా వుంటాడు. ఇవన్నీ కనిపిస్తుండగా, ఎప్పుడో ఫాన్ వెడతాడని, ఆస్తిపాస్తి లేనివాడి కెందుకడగటం! తల్లిదండ్రులూ, సిరిసంపదలూ వున్న ముచ్చట వుంటుందా చదువు-సంస్కారాలు వుంటే మాత్రం. మాధవరావుకే అడగండి' అందావిడ.

ప్రసాదరావ్‌గారు మా అమ్మాయిని వచ్చి చూసుకోవలసిందని మాధవరావు తండ్రికి వుత్తరం రాశారు వెంటనే జవాబు వచ్చింది.

'మా అబ్బాయి మీ అమ్మాయి ఇందిరను చూశాడు కదా. వాడికి పిల్ల నచ్చలేదుట' అని ప్రసాదరావు గారు ఏమీ మాట్లాడలేదు. అంతా మన మంచికే అనుకున్నారేమో!

ఇందిర తెల్లబోయింది. శంకర్ ఆ వుత్తరం తీసుకుని ఇందిరదగ్గరకు వెళ్ళి 'అయిందా పరాభవం! నీ పొగరణిగిందా. ఆ మాధవ్‌గాడికి నువ్వు నచ్చలేదుట. ఇప్పుడైనా రామకృష్ణని...' అంటుంటే.

'నచ్చకపోతే పోనీ. చస్తే ఆ కోతి మొహాన్ని మాత్రం చేసుకోను' అని ఉక్రోషంతో, అవమానకన్నీళ్ళతో అక్కడనుంచి పారిపోయింది ఇందు.

ఇందిర అమాయకత్వానికి నవ్వు, జాలి కలిగాయి. వెళ్ళిపోతున్న చెల్లెల్ని ఆమె నిరాశపడిన మనసునూ తెలుచుకుని శంకర్‌కి ప్రేమ కెరటంలా పొంగింది.

'పిచ్చి ఇందు. ఏమీ తెలియదు. రామకృష్ణ ఒప్పుకుంటే ఇందు సుఖపడుతుంది. రామకృష్ణ ఎంత తెలివైన వాడు, ఎంత మంచివాడు! ఇందు కేమి తెలుసు!' అనుకున్నాడు శంకర్.

● ● ●

ఆ మాట అంతకముందే వింది ఇందు. అతడికి తను నచ్చలేదు. ఆమె గుండెల్లో విమానం కూలనంత అలజడి రేగింది. తన కది పరాభవం. మాధవరావ్ అందంమీద మోజు పోయింది. అసహ్యం పుట్టింది. అతడిపైన ఉన్న సదభిప్రాయం పోయింది. ద్వేషం పెరిగింది. తిండి సహించటం లేదు. ఏం చెయ్యాలి! అతడు కనిపించడు కదా, ఎట్లా ప్రతీకారం చెయ్యాలి! తోచటంలేదు. మనసుకి విశ్రాంతి లేదు. ఆలోచనలకి అంతులేదు. రెండవ రోజు రాత్రి పడుకున్నది లేచి కూర్చుని ఉత్తరం రాసింది.

మాధవరావ్‌కి,

మీకు నేను నచ్చలేదని తెలిసింది. మీకు మీరు చాలా అందంగా ఉంటారని గర్వం. ఆ గర్వంలో ఒక ఆడపిల్ల మనసు నొప్పిస్తున్నానని తెలుసుకోలేక పోయారు. అయినా నేను బాధ పడటం లేదు. తలుచుకుంటే మీ కంటె అందగాడినే పెళ్ళి చేసుకోగలను. మీరైనా ఎంతటి అందగత్తెను చేసుకుంటారో చూస్తాను.

ఇందిర.

ఉత్తరం రాశాక ఇందిరకి నిద్ర పట్టింది. మరునాడు పొద్దున్న లేవగానే అన్నయ్య డైరీలో వెతికి ఎడ్రస్ రాసి ఉత్తరం పోస్టుచేయించింది అప్పుడు మనసు శాంతించింది.

● భర్త: 'ఏమోయ్, ఇంకా ఎంతసేపు నీ సింగారం? సినిమా టైమైపోతోంది.'

భార్య: 'గంటనించీ చెబుతున్నా, ఇదిగో వచ్చేస్తున్నానని. ఎందుకలా అరుస్తారు?'

మాధవరావ్ దగ్గరనుంచి జవాబేమీ రాలేదు. ఇందిర ఎదురుచూడలేదు కూడా. ఆ వుత్తరం అతడి కందితే చాలు అనుకుంది.

రిసెర్చి స్కాలర్‌షిప్ వచ్చింది రామక్రిష్ణకి. శంకర్ కోరికమీదట యూనివర్సిటీకి వెడుతూ ప్రసాదరావుగారింట్లో ఒకరోజు ఉన్నాడు. శంకర్ తల్లినీ తండ్రిని ఒప్పించాడు. రామక్రిష్ణనికూడా అడిగాడు. అతడు నవ్వి "నా కిష్టమే. ఇందిరకూడా యిష్టపడాలిగా" అన్నాడు.

ఇందిరకి యీ తంతు తెలియదు. ఆ సాయంత్రం శంకర్ సినిమాకి బయలు దేరదీశాడు. తను తయారయి వచ్చింది మొదలుకుని రామక్రిష్ణ మాటిమాటికీ తనవైపు చూస్తూండటం గమనించింది ఇందిర.

"ఎందుకట్లాగ చూస్తాడు. ఏదో విమర్శగా చూస్తున్నట్లు! ఇప్పుడతడిని ఎవరూ వరించబోవటం లేదు" అనుకుంది మనసులో. వినుక్కుంది కూడాను. తను అతడిని ఆకర్షిస్తోంది అనుకుని గర్వం కూడా కలిగింది. మాధవరావ్‌నచ్చలేదంటే నేం! ఇంకా తెలివైన వాళ్ళని, చాలామందినే ఆకర్షించగలను అనుకుంది. ఇంటికి వచ్చి పడుకునేలోగా తనలో దెబ్బతిన్న అహం తిరిగి వచ్చింది. పాపం రామక్రిష్ణ! అని నవ్వుకుంది, అతడు తనవైపు చూడటం గుర్తు వచ్చి.

● ● ●

మరునాడు తెల్లవారకుండానే ఇందిరని లేపేశాడుశంకర్. బద్ధకంగా లేస్తూ.

"ఏమిటీ తొందర! ఇంకా తెల్లవారినట్లు కూడా లేదు" అంది ఇందిర.

"నువ్వు లేచిరా! తెల్లవారలేదు. కానీ బయట ఎంత బాగుందో చూడు. నేనూ రామకృష్ణా వరండాలో కూర్చున్నాము. అతను పాట పాడతాడు" అన్నాడు. ఇందిర నవ్వింది.

"ఇదేం పెళ్ళి చూపులా! అతను పాడటమేమిటి! నా కక్కరలేదు" అంది.

"నువ్వు ఉత్తమొద్దువి. కొంచెం సేపు ఆ ప్రకృతి సౌందర్యాన్ని, ఆ గాన మాధుర్యాన్ని అనుభవించటానికి హృదయంలేదు.హృదయంతో పాడగలవాళ్ళు ఎంతమంది ఉంటారని! అనుభవించటానికి అదృష్టం ఉండాలి. ఆడవాళ్ళకి మంచి అభిరుచులు ఉంటాయంటారు. నీ కంటె నేనే నయం"

"పద నీ సాధింపు నేను భరించలేను. నీ కేమో అతడు నచ్చాడు. నాకు రుద్దాలని నీ తాపత్రయం. వింటే నా సొమ్మేం పోయిందిలే. పద."

ఇందిర వెళ్ళి వరండాలో మూడవ కుర్చీలో కూర్చుంది.

"ఇంకా మీకు మత్తు వదిలినట్లు లేదు" అన్నాడు రామక్రిష్ణ.

"ఉహు" అంది ఇందిర.



"నేను మెయిల్‌కి వెడుతున్నాను" అన్నాడతడు.

"ఉ" అంది మళ్ళీ.

ఇంకా వెలుగు రాలేదు. ఆకాశంలో నక్షత్రాలు మెరుస్తున్నాయి. గాలిలో చిరుచలి ఉంది. ప్రశాంతంగా నిశ్శబ్దంగా ఉంది. అక్కడ కూర్చున్నాక ఇందిరకు బద్ధకం వదిలిపోయింది.

"ఒక పాట పాడు" అన్నాడు శంకర్.

"ఇప్పుడేమిటి!" అన్నాడు రామక్రిష్ణ.

"ఏమీ లేదు. నా కోరిక. ఈ వేళలో వినాలని ఉంది. ఇందును కూడా అందుకే లేపుకు వచ్చాను." అన్నాడు శంకర్. రామక్రిష్ణ ఇందిర వైపు చూశాడు. ఇందిర నవ్వింది. కొంచెంసేపాగి ఒక అష్టపది పాడాడు రామక్రిష్ణ.

"బాల మురళీకృష్ణలాగ పాడారు" అంది ఇందిర.

'మీకు సంగీతం అంటే ఆసక్తి ఉందా ?' అడిగాడు రామక్రిష్ణ.

'వినటం వరకే. చాలా బాగా పాడితే ఇష్టంగా వింటాను' అంది ఇందిర.

శంకర్ లోపలికి వెళ్ళాడు. కొంచెంసేపు ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు.

'మీ వాళ్ళ అభిప్రాయం తెలిసింది. నాకు అంగీకారమే. కాని నాకు మీ అభిప్రాయం కూడా తెలుసుకోవాలని ఉంది. మీకేమీ అభ్యంతరం లేదుకదూ. పూర్తిగా ఇష్టమే కదూ' అన్నాడు రామక్రిష్ణ సన్నగొంతుతో మెల్లగా. నిద్రలో ఎవరో లేపినట్లు ఉలికి పడింది మనసులో. కళ్ళు వెడల్పు చేసి చూసింది ఇందిర. తనకు తెలియకుండా ఇంట్లో ఏదో ప్రయత్నం జరుగుతోంది. తనపెళ్ళి ఆలోచన చేస్తున్నారు. తనను ఎవరూ అడగలేదు. కానీ వాళ్ళ అంగీకారం తెలియకుండా ఇతనెట్లా అడుగుతాడు! అమ్మమీద, నాన్నమీద, అన్నయ్యమీద చెప్పలేని కోపం పొంగుకువచ్చింది. కన్నీళ్ళువచ్చాయి.

'నాకా విషయమేమీ తెలియదు. నాకు మీమీద ఏ అభిప్రాయమూ లేదు. అన్నయ్య పాట వినమంటే ఊరికే వచ్చాను. అంతే. నాకంత కంటే సంబంధం లేదు. ఇష్టంలేదు. క్షమించండి' అని లేచిపోయింది అక్కడనుంచి. శంకర్ వచ్చేటప్పటికి అక్కడ ఇందిర లేదు. కుర్చీలో వెనక్కివాలి రామక్రిష్ణ మౌనంగా ఉన్నాడు. అతడి పెదవులమీద సన్నటి నవ్వు ఉంది. శంకర్‌కి ఏమీ అర్థం కాలేదు. అప్పటికి తెల్లవారింది. ముఖాలు కడుక్కొని కాఫీ త్రాగి స్టేషన్‌కి వెళ్ళి పోయారు.

● ● ●

'మీ ఇందిరకి ఇష్టంలేనిదే నేను ఒప్పుకోలేను. తనకు ఇష్టమేనని ఇందిర వ్రాస్తే వివాహానికి నా అభ్యంతరం లేదు. నాకు ఇష్టమే.' అని రామక్రిష్ణదగ్గరనుంచి వుత్తరం వచ్చింది శంకర్‌కి. ఒకసారి శంకర్ ఇందిరదగ్గరకు వెళ్ళి 'ఏమిటి నీ అభిప్రాయం? మాధవరావు గురించి ఆలోచిస్తున్నావా ? అది జరిగేసంగతి కాదు. అతడి పెళ్ళి నిశ్చయమై పోయింది' అన్నాడు.

ఇందిరకి ఒళ్ళు మండిపోయింది.

'మీ యిష్టంవచ్చినట్లు చేసుకోండి. ఆ మాధవరావు పేరుమాత్రం నా దగ్గర ఎత్తకు. నచ్చలేదన్న వాడి కోసం ఏడిచేవాళ్ళెవరూ లేరిక్కడ' అంది.

అదీ మంచిదే అనుకున్నాడు శంకర్. వెంటనే రామక్రిష్ణకి వుత్తరం రాశాడు. 'మా అందరికీ యిష్టమే, పెళ్ళి నిశ్చయం చేసుకుందా'మని. దానికి రామక్రిష్ణదగ్గరనుంచి వచ్చిన జవాబది—

ఇందిర కిష్టంలేదని అతడి కెవరు చెప్పారు? ఇందిరే చెప్పిందా? అతడికి చిరాకు వేసింది. ఇందిరదగ్గరకు వెళ్ళి వుత్తరం చూపించి 'నీ కిష్టం లేదని నువ్వు చెప్పావా?' అనడిగాడు.

'నా ఇష్టంతో ఏం పని అన్నయ్యా నా కిష్టమేనని రాసిస్తా. ఆ పెన్ను ఇయ్యి' అంది ఇందిర. ఒక క్షణంసేపు తను తొందరపడి చెల్లెల్ని బలవంతం చేస్తున్నానేమో అనిపించింది శంకర్‌కి.

'అది కాదు ఇందూ. నీ మంచి చెడ్డలు మేము ఆలోచించమూ! నువ్వు సుఖపడాలని కోరుకునేవంతా. రామక్రిష్ణ సంగతి నాకు బాగా తెలుసు. నీకు తెలియదు. అందుకే నేను ఇంత గట్టిగా, బలవంతమని నీ వనుకున్నా పట్టుదల వహించటం. నువ్వు కన్నీళ్ళు పెడితే మాత్రం నే నీ పని చెయ్యలేను.' అన్నాడు. అర్ద్రమౌతున్న కళ్ళు తుడుచుకుంది ఇందిర.

'ఔను. నాకు తెలియదన్నయ్యా. నువ్వు, నాన్న కంటె నా మంచిని కోరేవాళ్ళెవరు! నా కంటె ఎక్కువగా నా మంచిని గురించి ఆలోచించగలిగిన వాళ్ళు మీరే. ఏమిటో అతడిమీద నాకు ఏ అభిప్రాయమూ కలగలేదంతే. అతడు మంచివాడు, ఎన్నతగిన వాడయి ఉండవచ్చు. నీకు తెలుసు కదా. నేను అతనికే వ్రాస్తాను అన్నయ్యా' అంది.

మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి అని అన్నప్పుడే ఇందిరకి అనుమానం కలిగింది. ఈ పెళ్ళి అయ్యేట్లు ఉంది అని. తనకి ఇష్టంలేని పెళ్ళి చేస్తున్నారని బాధ కలిగింది. అన్నయ్యవచ్చి రామక్రిష్ణ ఉత్తరం చూపిస్తుంటే ఏమిటీ బలవంతమని కోపం వచ్చింది. ఏమిటీ రామక్రిష్ణ — వదలిపెట్టడు. త కిష్టమేనని రాసివ్వాలట! ఎందుకు రాసివ్వాలి? ఇష్టం లేదని చెప్తే ఊరుకోకూడదూ. ఇష్టమేనని అన్నయ్య చెప్తే ఒప్పుకోకూడదా. కోపంతో చిరాకుతో తను రాసిస్తానంది కానీ అన్నయ్య అనునయం విన్నాక తనమనసు మారిపోయింది. నిజంగా తను తన మంచి తెలుసుకోలేకపోయి ఉండవచ్చు. రామక్రిష్ణ ఎన్నుకుని స్వంతం చేసుకోతగినవ్యక్తి కాబోలు. లేకపోతే అన్నయ్య ఎందుకట్లాగ చెప్తాడు. బలవంతం చేస్తాడు అనుకుంది చెల్లెలి మొహం ప్రశాంతంగా ఉండటం చూసి తృప్తిపడ్డాడు శంకర్.

'మీరు అడిగినప్పుడు నేను ఎదురు చూడక పోవటం వలన ఏదో సమాధానం చెప్పాను. అప్పటికి నేనేమీ ఆలోచించుకోలేదు. ఇప్పుడు ఆలోచించి నిర్ణయించుకున్నాను. నాకు ఇష్టమే — ఇందిర' అనిరాసి ఎడ్రస్ రాసిఉన్న కవరులో పెట్టి శంకర్‌కి ఇచ్చింది. శంకర్ సంతోషంగా నవ్వాడు. ఇందిర సిగ్గుపడింది.

ఉత్తరం రాశాక తరచూ గుర్తు వస్తున్నాడు రామక్రిష్ణ — ఇందిరకి. నిజమే, అన్నయ్య అన్నట్లు అతని ముఖంలో కాంతి అకర్షణా ఉన్నాయి. అనుకుంది. ఆ నాడు అతను చూసిన

చూపులు గుర్తువచ్చాయి. అతడికి తనంటే ఇష్టంఉంది. ఇందిరకి తృప్తి కలిగింది. అతడంటే కోరికకూడా కలిగి తనలోనే నవ్వుకుంది. అతడిని కోతి మొహం అంది. అతడినే పెళ్ళి చేసుకోబోతోంది. మొత్తానికి ఇష్టం లేదని చెప్పినా అతడు మాత్రం తనను వదలలేదు. ఇష్టమేనని చెప్పించుకుని మరీ పెళ్ళిచేసుకుంటు న్నాడు. అదీ అతనిలో ఒక అధిక్యతేనేమో! అర్థం చేసుకోవటం అంటే ఇదేనేమో! తనూ జీవితంతో సమాధాన పడుతోంది. అట్లా పడక తప్పదు కాబోలు అనుకుంది ఇందిర.

ఆ వేసంగిలో ఇందిరకు పెళ్ళి అయింది రామక్రిష్ణతో. బి. ఎస్సి. కూడా పూర్తయింది.

● ● ●

"నేనంటే ఇష్టం లేదన్నావుగా. ఎట్లా పెళ్ళి చేసుకున్నావు నన్ను" రామక్రిష్ణ ఇందిరను అడిగాడు.

"ఇంకా మీకు జవాబులు చెప్పుకోవాలా? ఇష్టమేనని రాసిచ్చాను కదా" అంది ఇందిర నవ్వుతూ.

"ఔను, నాకు నమ్మకం లేదు. నువ్వు బలవంతంగా ఈ పెళ్ళి చేసుకున్నావనే నాకు అనుమానం."

"ఏం. మీ రెందుకు నమ్మకపోవాలి! నమ్మనప్పుడు పెళ్ళి ఎందుకు చేసుకోవాలి!" అంది ఇందిర. ఆమె మొహంలో మార్పుల్ని చూస్తూ,

"నువ్వు వాడికి రాసిన ఉత్తరాన్ని మాధవ నాకు చూపించాడు. వాడికి తెలియదు మనిద్దరికీ పెళ్ళి మాటలు జరుగుతున్నాయని. పెళ్ళి అవుతుందనీ అన్నాడు."

"అయితే మీకు తెలిసే పెళ్ళికి ఒప్పుకున్నారా? అయినా ఉత్తరం రాస్తే తప్పా!"

"అట్లాగ ఉత్తరం రాయకూడదు. నేను ఒప్పుకున్నానంటే నాకు ముందర నుంచీ ఇష్టమే. ఈ అమ్మాయిని పెళ్ళిచేసుకుంటే బాగుంటుంది అనుకున్నాను. చేసుకున్నాను. ఉత్తరం రాయకూడదు కానీ, ఇందు చాలా మంచిపిల్లని నాకు తెలుసు."

"మీకు రాయవచ్చేం, ఉత్తరం" అంది ఇందు కొంచెం ఎత్తిపొడుపుగా.

"ఆ నాకు రాయవచ్చు. నేను ఎట్లాగూ పెళ్ళి చేసుకుంటున్నాను కదా!"

"మరిఅంతా అయ్యాక అనుమానా లెందుకు!"

"అనుమానాలు కాదు ఇందూ. నువ్వు అందమైన పిల్లవి. అందంగా ఉంటానని అనుకుంటావు. నిజమే. నాకు అందంలేదు. అట్లాగని అంద వికారినని అంటే నేనూ ఒప్పుకోను. కానీ నాలోని అనురాగమంతా నీ కోసమే. నీకివాళ అర్థం కాకపోవచ్చు కానీ, ఏదో ఒక రోజున తప్పకుండా నీకు తెలుస్తుంది."

"మీరూ తెలుసుకోండి. నేను అందమైనదానిననే అనుకుంటాను. అందంకోసం ఆరాటపడతాను కూడాను. కానీ నా మనసులో మాత్రం ఎవరికీ ఆరాధనలేదు. ఎప్పటికైనా ఎవరైనా నా మనసులో నిలిస్తే అది మీరే అవుతారు. లేదా అది ఖాళీగానే వుంటుంది" అంది.

రామక్రిష్ణ ఆమెని దగ్గరగా తీసుకుని "నాకు తెలుసు ఇందూ" అన్నాడు.

ఇందిర మనసూ కళ్ళూ కూడా ఆర్ద్రాలయ్యాయి. అప్పుడు అతడు అందంగా వుండడనిపించలేదు. అతని కళ్ళు చిన్నవనిపించలేదు. అతడు నల్లగా వుంటాడనిపించలేదు. అతడు తన భర్త. తన ప్రేమకి ఆధారం. తనను అతని సర్వంగా భావించేవాడు. తామిద్దరివీ ఒకటే సుఖ దుఃఖాలు!

● ● ●

"నీకు చదువుకోవాలని వుంటే ఎమ్మెస్సీలో జేరు" అన్నాడు రామక్రిష్ణ.

యూనివర్సిటీలో చేరింది ఇందిర. నాలుగునెలలు గడిచాయి. ఇందిరకి ఒంట్లో బాగుండేదికాదు. మనసు కూడా చిరాకుగా వుండేది. క్లాసులకు వెళ్ళబుద్ధి వేసేదికాదు. ఒంటరిగా కూర్చుని ఆలోచిస్తుండేది. రామక్రిష్ణ వర్క్ చేసుకోవటంలో చాలా శ్రద్ధగా ఉండేవాడు. అతడు చాలా నియమబద్ధంగా ఉంటాడు దినచర్యలో. ఇందు అంటే ఎప్పుడూ అపేక్ష. ఎప్పుడూ ఒకమాట అనటం కానీ, కోపం తెచ్చుకోవటం కానీ జరగలేదు. చదువుమీద శ్రద్ధ లేదని మాత్రం హెచ్చరిస్తూండేవాడు.

"నాకింకేమి చదువు!" అనుకునేది విరక్తిగా ఇందిర. తనకి ఆరో

ఒకాయనకు చెయ్యి వాచింది. డాక్టరుగారు పన్నెండు గంటలసేపు మరుగుతున్న నీటిలో చేతిని నానెయ్యమన్నారు. తగ్గకపోగా ఒళ్ళంతా వాచింది. ఇంటి పని మనిషి వచ్చి ఇంతకంటె చన్నీళ్ళు నయం అంది. చన్నీళ్ళలో ముంచి వుంచితే వాపు తగ్గింది.



ఆయన డాక్టరు దగ్గరికెళ్ళి "ఏం డాక్టరువయ్యా నువ్వు? నీ కంటె మా పనిమనిషి నయం. నువ్వేమో వేణ్ణీళ్ళన్నావ్. ఒళ్ళంతా ఉబ్బింది. అదేమో చన్నీళ్ళంది. వాపు తీసింది" అని కోపంగా అన్నాడు.

డాక్టరు "అరె. తమాషాగా వుందే. మా ఇంటి పని మనిషి మరుగుతున్న నీళ్ళలో ముంచమని చెప్పిందిస్మండీ" అన్నాడు.

గ్యం బాగుండలేదు. కారణమేమిటో తెలుసు ఇందిరకి. త్వరలోనే తన కొక పాపాయి! ఇక తనకు చదువేమిటి!

ఎందుకీ అసంతృప్తి? తన మనసుకి అలా చంచలంగా నిలకడ లేదు. ఎందుకీ చాంచల్యం? రామకృష్ణ అంటే ఎంత మమకారం ఏర్పడినా ఏమి మనసి అతడిని చేసుకున్నాను అనే ప్రశ్న మధ్య మధ్యలో ఆమెకి కలుగుతూనే ఉండేది. అందం లేదు, ఎక్కువ డబ్బు లేదు. సమృద్ధికి కలిసిన సరదాలూ లేవు, ఏమిటీ జీవితం!

అతడి చదువు, ఆసక్తి అతడివి. అతడికి తన మీద అచంచలమైన ప్రేమ ఉంది. అతడిదెంత దృఢమయిన మనసు! తన మనసులో ఎంత బలహీనత! అతడిలో మంచి, తను రాగంతో చూసి, ఒప్పుకుని పెళ్ళి చేసుకునీ కూడా అసంతృప్తితో బాధపడటం బలహీనత కాదా! మాధవరావు అంటే ఒకప్పుడు తను ఇష్టపడినట్టు కూడా అతడికి తెలుసు. తెలుసుకునక తనచేత ఇష్టమేనని చెప్పించుకుని మరీ పెళ్ళి చేసుకున్నాడు. తిరిగి ఆ విషయాన్ని ఎప్పుడూ గుర్తుచేసుకోలేదు. మరి అతడెంత మంచివాడు!

"నేనే బలహీనురాలిని" అనుకునేది ఇందిర. కానీ, పెళ్ళి చేసుకోవటంలో తొందరపడ్డానేమో? ఈ లోకంలో మాధవరావు, రామకృష్ణ తప్ప యింకెవరూ లేరా? అమ్మా వాళ్ళు నాకింకా మంచి సంబంధం తీసుకురాగలరు. ఎందుకంతతొందర! నాకు మిగిలిందేమిటి? ఈ చదువు ఎట్లాగూ సాగదు. ఇంక మామూలుగా సంసారం, పిల్లలు, సమస్యలు, తాపత్రయాలు. నా జీవితానికి యిదే అర్థమా!" అనుకుని తీరని అసంతృప్తితో బాధపడుతుండేది.

రామకృష్ణ దగ్గర వున్నంతసేపూ యీ ఆలోచనలు దగ్గరకు వచ్చేవి కావు. అతడి సాన్నిధ్యంలో అసంతృప్తిని తాత్కాలికంగా మర్చిపోయేది. అప్పుడప్పుడు ఇటువంటి వాడిని పొంది అసంతృప్తి పడటమేమిటని తనను తనే నిందించుకునేది. ఈ అవస్థలో కొన్ని దినాలు గడిచాయి.

● ● ●

ఆ సంవత్సరం ఆఖరున బాగా చదవలేదని పరీక్షలకి వెళ్ళలేదు ఇందిర.

"ఇంక నాలుగేళ్ళదాకా మనకి మళ్ళీ పాపాయి వద్దు. ఈలోగా నువ్వు ఎమ్మెస్సీ పూర్తిచేద్దువుగాని. వంట్లో బాగుండక పోతే నువ్వు మాత్రం ఎట్లాగ చదువుతావు! పరీక్షలకి వెళ్ళలేదని బాధపడకు" అన్నాడు రామకృష్ణ ఇందిరను ఓదారుస్తూ. ఇందిర నవ్వుకుంది. అసలు ఇందుకే చదువు ధ్యాస పూర్తిగా పోయింది. ఆ వేసవి కాలంలో ఇందిరకి కొడుకు పుట్టాడు. వాడు నల్లగానే ఉంటాడు అన్నారంతాను.

"వీడు కోతి మొహమేనే ఇందిరక్కా" అన్నాడు కృష్ణ. అందరూ నవ్వారు. ఏమైనా అనుకుంటారు అనుకోకుండా హాస్యాలు చేసుకోవటం ఆ ఇంట్లో అలవాటే. ఎవరూ నొచ్చుకోవటం కూడా అలవాటు లేదు. ఇందిర మొదట నవ్వేసింది కానీ, తరవాత ఆమాట మనసులో నిలిచిపోయింది. పసివాడిని చూస్తుంటే "కోతి మొహం" అనే మాటే అనిపించేది. అది తను అన్నమాటే కానీ తమ్ముడు అంటే తనకు బాధవేసింది. బావగారి పోలిక అని వాడు చెప్పటం! అవును. ఆఖరికి తను కోతి ముఖం అన్నవాడినే తను పెళ్ళి చేసుకుంది. పోనీ తన పిల్లవాడైనా అందంగా ఉండకూడదూ. పోలికలు ఎక్కడికి పోతాయి! అందంగా ఉండటం, అందం అనుభవించటమూ కూడా అదృష్టమే.

"నాకు ఏ అదృష్టమూ లేదు. వీడు నాకు ముద్దుగా రావటం లేదు" అనుకుంది పురిటిలో ఉండగా ఇందిర. ఇంటికొచ్చాక అసంతృప్తి ఎక్కువయింది. తరవాతకూడా ఎక్కువ ముద్దు చేసేది కాదు, పిల్లవాణ్ణి.

రామకృష్ణకి మాత్రం వాడంటే చాలా ముద్దు.

"నీ లాగే ఉంటాడని మీకు ముద్దు" అని నవ్వేది ఇందిర.

"నీకు ముద్దులేదా?" అని అతడు అడిగితే,

"అందంగా ఉంటే కానీ నాకు ముద్దురారు" అంది ఇందిర.

అతను నొచ్చుకున్నాడేమో నన్నీ, అనుకుంది ఇందిర. కానీ అతడేమీ అనలేదు. ఇందిర తనలోనే ఆశ్చర్యపడింది. అసలు అతడికి ఫీలింగ్స్ అనేవి లేవా? ఉండి మనసులో బాధపడతాడా? ఇందు ఏమున్నా ఫర్వాలేదనుకుంటాడా? అనుకునేది.

మళ్ళీ "అతనిది చాలా సున్నితమైన మనసు. అటువంటి ఎందుకన్నాను! తప్పకుండా బాధపడే వుంటాడు." అనుకుని బాధపడేది.

"ఐనా ఇప్పుడింక నాకా అతిశయం ఎందుకు?" అనికూడా అనుకునేది.

ఐనా రోజులు గడుస్తున్నకొద్దీ అసంతృప్తి ఎక్కువవుతూనే వుంది. తనకి ఏదైనా ఆధిక్యం వుండాలనే ఆరాటమూ కలుగసాగింది. అతడికి అందము లేదు, డబ్బు లేదు, సరదాలూ లేవు కానీ, అతడు చాలా తెలివైనవాడు. కాని యీ చదువు నెవరు గౌరవిస్తారు, గుర్తిస్తారు! అతడు ఫారిన్ వెళ్ళేవాళ్ళలా స్టేట్స్‌కి వెళ్ళాలి. అప్పుడు అతని గొప్ప అతని

● ఫ్యాక్టరీని తనిఖీ చేయటానికి వచ్చిన ఇన్‌స్పెక్టర్ యజమానితో:

"మీ ఫ్యాక్టరీలో ఎంతమంది వుంటారు పనిచేసేవాళ్ళు?"

యజమాని: "సగంమంది వుంటారండి."

భార్యగా తన అధికక్యం! అవును రామ్మక్రిష్ణ అమెరికా వెళ్ళాలి. అత డికి ఆ అవకాశం ఎప్పుడు వస్తుంది? అది ఇందిరలో పెద్దకోరికైకూర్చుంది.

రామ్మక్రిష్ణకి డాక్టరేట్ వచ్చింది. ఆ సంగతి చెప్పినప్పుడు రామ్మక్రిష్ణ ఎదురు చూసినంతఆనందం ఇందిరలో కనిపించలేదు అతడికి.

"నీకు సంతోషంగా లేదూ" అన్నా డతడు.

"నా సంతోషాని కేంగానీ మీకిది ఒక లెఖ్ఖా! మీ తెలివి తేటలకి, ఆసక్తికి, మీరు అమెరికా వెళ్ళి పేరు పొందవలసిన వారు." అంది ఇందిర, అతడు ఒక నిముషం ఊరుకుని.

"ఆరోజూ వస్తుందిలే, ఇందూ" అన్నాడు.

కానీ ఇందిరకి ఆరోజు ఎన్నటికో అనిపించింది. తన అసంతృప్తి ఎట్లా తీరుతుందో ఆమెకే అర్థం అయ్యేది కాదు. తనకేదో అన్యాయం జరిగిం దని బాధ. అతడికి దూరంగా ఉండా లనే ఆలోచన వెంటాడేది. చివరికి నిశ్చయించుకుంది పుట్టింటికి వెళ్ళి అక్కడ ఉద్యోగం చెయ్యాలని. అక్క డకు వెళ్ళి రామక్రిష్ణకి ఉత్తరం రాసింది.

"ఏమిటో నాకు మనసు నిలకడ పోయింది. కొన్నాళ్ళు అందరికీ దూరంగావుండాలనిపిస్తోంది. ఇక్కడ వూరికేవుంటే తోచదు. ఇక్కడ నేను చదువుకున్న స్కూల్లో ఖాళీ వచ్చింది టీచర్‌కి. హెడ్‌మిస్ట్రెస్ వుద్యోగం యిస్తానంది, నాలుగునెలలు కుంప రరీగా. చేరుతున్నాను ... ..."

భార్య ఏ పరిస్థితుల్లో భర్తకి

దూరంగా వుండాలని కోరుకుంటుంది, అకారణంగా! ఇంతుతనకి దూరంగా వుండాలని ఎందుకు కోరుకుంటోంది! అసంతృప్తేకదూ.

"నాకు అందంలేకపోవటం ఇందుని యింకా బాధిస్తోందా? నా మనస్సు, మమత ఇందు చిత్తచాంచల్యాన్ని అరి కట్టలేకపోయాయా?" అనుకున్నాడు రామ్మక్రిష్ణ.

● ● ●

ఇందిర వుద్యోగంలో చేరి రెండు నెలలు గడిచాయి.

"రెండు నెలలు ఎట్లాగడిచాయో! ఏమిటీ బ్రతుకు! నా మీద నాకే కోపం. రామ్మక్రిష్ణ మంచివాడు" అను కునేది. అతనిమీద జాలి కలిగేది కానీ, అతడి దగ్గరకు వెళ్ళాలను కునేది కాదు. అసంతృప్తి స్థానంలో ఒకరకమైన కాఠిన్యం స్థావరం ఏర్ప రచుకో మొదలు పెట్టింది ఆమెలో. ఒకరోజు రామక్రిష్ణ దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది ఇందిరకి — అతడు అమెరికా వెడుతున్నట్లు, స్కాలర్ షిప్ వచ్చినట్లు. ఆమెలో పేరుకున్న కాఠిన్యం ఏమయిందో! అతడు దూరమైపోతాడని, వెంటనే బయలు దేరి అతడి దగ్గరకు వెళ్ళింది.

"మళ్ళీ నేను వచ్చేటప్పటికి నువ్వు చాలా పెద్దవాడివయి పోతావురా బాబూ! నడుస్తావు, మాట్లాడతావు. నీకు అక్కడనుంచి ఏమేమికావాలో నాకు ఉత్తరాలు రాస్తావుకదూ" అని ఏడాది కొడుకును ఎత్తుకుని ముద్దు లాడాడు రామ్మక్రిష్ణ.

"ఏడాది ఉండాలా!" అడిగింది ఇందిర.

"ఏడాది అని వెడుతున్నాననుకో. అక్కడికి వెళ్ళాక ఇంకో రెండేళ్ళు ఉండచ్చు. పైకి రావాలంటే అక్కడ ఉంటేనే ఏదైనా చెయ్య గలుగుతాము."

ఇందిర కళ్ళలోనుంచి నీటిబొట్లు జారాయి.

"అదేమిటి ఇందూ" అన్నాడు రామ్మక్రిష్ణ.

"ఇప్పుడు మీరు వెళ్ళకపోతే నేం?" అంది ఇందిర.

అతడు నవ్వాడు.

"కాదు. వెళ్ళాలి ఇందూ. ఇది నా చిరకాల వాంఛ. అవకాశం వచ్చింది. అయినా ఇప్పుడు నాకొక పేరా, ప్రతిపత్తా! అమెరికా వెళ్ళి వచ్చానంటే నీకు మాత్రం తక్కువ గౌరవమా! ఫలానా ఫారిన్ రిటర్న్‌డ్ భార్య అంటారు. మంచి శాలరీకూడా వస్తుంది."

ఇంక అతడిని అర్థించలేదు.

అతడు నిజంగా చెపున్నాడో, తనను కించ పరుస్తున్నాడో! అనా అతడు తనను ఏమనినా తప్పులేదు. తను ఇనాళ్ళూ అతనిపట్ల అసంతృప్తి వహించినందుకు, దూరంగా వుండా లనుకుని వుద్యోగంలో చేరినందుకు తగిన శిక్ష యిది. తనమనసే చెప్తోంది

అతడిని విడిచి ఏడాది వుండటం ఎట్లా! తను కోరుకున్నదే! కానీ

ఇప్పుడా కోరిక నెరవేరటం తను సహించలేకపోతున్నది.

"కావాలని దూరంగా వెళ్ళి ఉద్యోగంలో చేరిన నేనేనా, ఇప్పుడు అతడు దూరమౌతున్నాడని బాధపడుతోంది" అనుకుంది ఇందిర. "నా మనసే నాకు తెలియదు" అనుకుంది కన్నీళ్ళతో.

అతడు ప్రయాణ సన్నాహాలలో తీరిక లేకుండా వున్నాడు.

"ఇప్పుడున్న ఉద్యోగం చాలు. మీరు వెళ్ళకపోతేనేం!" అంది ఇందిర.

"అది సంభవం కాదు ఇందూ. ఇప్పుడు దూరమవుతున్నామనే బాధలో నీవట్లా గింజుకుంటున్నావు కానీ, అక్కడనుంచి నేను తిరిగి వచ్చాక నీకు కలిగే సంతోషంలో ఇదంతా మరిచిపోతావు."

"నేను ఉండలేను." అంది ఇందిర.

అతడు నవ్వి "ఏం, నేను రానని భయమా. నేను తప్పక తిరిగి వస్తాను ఇందిరా, నీ మీద మమకారమే నన్ను క్షేమంగా ఇక్కడికి తీసుకు వస్తుంది. నువ్వు మాత్రం అనవసరపు విచారాలు పెట్టుకోకు. మళ్ళీ మీ వారు ఒక ప్రతిపత్తి ఉన్న వ్యక్తిగా తిరిగి వస్తారని, నీ ఆధిక్యం పెరుగుతుందని, మనం ఇప్పటికంటె సంతోషంగా, సుఖంగా ఉంటామని మాత్రమే అనుకుంటూ ఉండు. నీకే కష్టం ఉండదు." అన్నాడు రామక్రిష్ణ.

ఇందిర కన్నీళ్ళను మనసులోనే మింగింది.

"నాకు తెలుసు ఇందూ" అన్నాడతను ఒకసారి అవును అతడికి నా మనసంతా తెలుసు, నా ఆలోచనలన్నీ తెలుసు. 'రామక్రిష్ణ ఎంత మెత్తనివాడో అంత కఠినుడు కూడాను. అతడు వెళ్ళి తీరతాడు.' తన కన్నీళ్ళు ఇప్పుడు అతడిని ఆపలేవు మెత్తని మనసుతో ప్రేమించాడు కానీ తను దగ్గరగా వెళ్ళలేదు. అతడు కాఠిన్యం వహించి వెళ్ళిపోతున్నాడు తలచింది సాధించుకుని వస్తాడు.

"ఆ మాటకి వస్తే బాబుని నన్ను విడిచి వెడుతున్నందుకు అతడు నాకంటే ఎక్కువగానే బాధపడుతూ ఉంటాడు. అయినా అతడు దాన్ని సహించగలడు. అతడు పురుషుడు. ఉత్తముడైన వ్యక్తి కూడాను నేనే అతడికి తృప్తికరంగా ప్రవర్తించలేకపోయాను. నా అసంతృప్తి నెపధిని అధికం చేసుకున్నాను కాని, అతడిని అర్థం చేసుకుని కూడా అనుకూలంగా ఉండి ఆనందం పొందలేకపోయాను. అతడు కఠినంగా ఉండవలసినదే. నాకీ శిక్ష కావలసిందే. అతడు తిరిగి వచ్చేలోపల ఎన్ని కన్నీళ్ళు కార్చాలో! ఎంత వేదన సహించాలో!" అనుకుంది ఇందిర.

రామక్రిష్ణ వెళ్ళిపోయాడు. ఇందిర ఆ ఉద్యోగమే ఇంకొక ఏడాది చెయ్యటానికి అంగీకరించింది.

ఒక ఏడాది! రామక్రిష్ణ వెళ్ళిపోయాడు!

తమ ఇద్దరి మధ్యా సముద్రాలు, కొన్ని వేల మైళ్ళ భూమి, విమానాల ప్రయాణం! తను కోరుకున్నా అతడి దగ్గరకు వెళ్ళలేదు, అతడు రాడు.

తమ ఇద్దరి మధ్యా ఏడాది దూరం!

మనసూ సూరీడుకూ మధ్దెనుందేనా! మరిగి నా మనసు సాగరమాయె నన్నారు. ఇంతేనా ఈ సంద్రము! అనిపించింది తనలో మరిగిన వ్యథ ఇందిరకి.

చిన్న కళ్ళు అనుకున్న అతడి నేత్రాలు ఇప్పుడు ఆమె జీవన జ్యోతులు. అతడు ఆమె ఆనందానికి నిలయం అతడి పునరాగమనమే ఆమె ఏకైక నిరీక్షణ. ఆమె ఇంకెన్నడూ తనలో అసంతృప్తికి చోటివ్వదు. ఇంక ఆమె మనస్సులో చాంచల్యం లేదు పశ్చాత్తాపం, విరహం ఆమెను కడిగివేస్తున్నాయి. ఆమెకు మిగిలిన ఆలోచన ఒకటే— అతడు తిరిగి రావటం.

'రామక్రిష్ణ తప్పక తిరిగివస్తాడు! ఆ రోజు తప్పకుండా వస్తుంది. మళ్ళీ నాలో ఆనందం నెలకొంటుంది' అని తనకు తానే ధైర్యం చెప్పుకుంటూ వుంటుంది ఇందిర.

ఇష్టపడి వివాహం చేసుకోవటం, ఆ వ్యక్తికోసం బాధపడటం ప్రేమని పించుకుంటుంది. ఇష్టం లేకపోయినా పెళ్ళికి ఒప్పుకుంది. అతడిని ప్రేమించాలనే అనుకుంది. అతడి విలువ తెలుసుకుంది. మమకారం పెంచుకుంది. కానీ ఆ మనసులో చాంచల్యం! ఆ ప్రేమకి నిలకడ లేదు.


అతడంటే మమకారం — అసంతృప్తి కూడాను. ఈ రెంటి మధ్యా నలుగుతూ అతడికి దూరంగా వెళ్ళి ఉద్యోగంలో చేరింది కానీ అతడు తనకు దూరంగా వెళ్ళే సమయం ఆసన్నమయేటప్పటికి ఆమెలో మమకారం కట్టలు తెంచుకుంది — ఎందుకు? ఆమె ఎందుకు బాధపడాలి. ఆ బాధ ఏమనిపించుకుంటుంది? ప్రేమా! జాలా? పశ్చాత్తాపమా? ఆమె స్వభావమా?!


అతడు తిరిగి వస్తాడు.

ఆమె ఇప్పుడనుకుంటున్నట్లుగా ఇంక ఆమెలో ఎన్నడూ అసంతృప్తి ఉండదా? ఈ అనుభవాన్ని పురస్కరించుకుని ఆమెలో తృప్తి శాశ్వతంగా నెలకొంటుందా! లేక అతడు వచ్చాక ఆ సంతోషానికి, ఆ సుఖాలకు అలవాటు పడ్డాక తిరిగి ఆమెలో ఆ చాంచల్యం రేకెత్తుతూ ఉంటుందా మధ్యమధ్యన! ఇందిర సంగతి ఏమో కానీ...

మనసును నిగ్రహించని మానవ స్వభావం చంచలంగా ఉంటుంది. అశాంతిని రేకెత్తిస్తూంటుంది.

□□





వెనుకబడిన ప్రయాణీకుడు

ఏమోయ్! రామచంద్రా! పొద్దున్నే యిల్లా వచ్చావేం?'

ముకుందరావుగారి ప్రశ్నవింటూనే అదివఱకు యెంతగానో, ప్రాక్టీస్ చేసుకుని వచ్చిన ఆ రామచంద్రుడు, వులికిపడి 'ఔను ఎందుకొచ్చాను?' అని ప్రశ్నించుకున్నాడు. పరధ్యానపు సైనికుడు అంతఃపురంలో అడుగుపెట్టి నట్లుంది తనపని!

ఆ వచ్చిన మనిషి చెప్పే జవాబేమిటో -అసలతనక్కడే వున్నాడో లేడో తనకనవసర మన్నట్లు ఠీవిగా 'సిగరెట్' పీలుస్తున్నాడు ముకుందరావు.

వాళ్ళమ్మాయి కుమారి సువర్ణ శ్యామల ఇంగ్లీషు పేపరు చూసుకుంటూ, అతనికేసి ఒక్కసారిచూసి, మళ్ళీ చదువుకుంటోంది. వాళ్ళు కూర్చోమనలేదు. అతను కూర్చోలేదు. కూర్చోమని పలుకరించనందుకు అతనికేమీ కించగాలేదు. అది సహజంగానే వున్నటూ, వాళ్ళ హోదా తనానికి తగిన వాతావరణమైనట్లు అనిపిస్తోంది. పైగా వాళ్ళలా ముభావంగా వుండక మర్యాదచేస్తే తనే వేరు విధంగా పొరపడే అవకాశముంది. "డబ్బున్నవాళ్ళేగానీ, పాపం అమాయకులు"! అనే అర్థం రావచ్చు. లేక "బహుశా, వీళ్ళకూ నాతో యేదో అవసరమే వుంది. అందుకే యీ మర్యాద" అనే విచిత్రమైన వూహా, కలిగితే కలుగవచ్చు!

రామచంద్రరావు నవ్వుకున్నాడు. డబ్బున్నవారికీ - లేనివారికీ మధ్య యెంతటి మనస్పర్థలు, ఎంత విపరీతపు అభిప్రాయాలు! ఇంకోటిగూడా వుంది. తనిప్పుడు అప్పు అడగటానికొచ్చాడు. ఆయ నివ్వకపోతే వాడ్ని లుబ్ధుడుగా కనిపించటం, యిచ్చేస్తే "ఆ... కష్టించి సంపాదించిం దయితేకదూ?" అనే అసూయా పూరితమైన బుద్ధికూడా

తులసీకృష్ణ

మనిషి కృతజ్ఞతతోబాటు గర్వితమై వుంటుంది. ఈ అభిప్రాయాలు అందరికీ వర్తించే నిర్వచనాలని కాదు. కానీ తనకు మాత్రం పరిమితమైనవి. ఎందుకంటే యిప్పుడు చేతులు మారిన డబ్బు - మళ్ళీ రామచంద్రరావు యివ్వాడనికానీ, ముకుందరావు తీసుకుంటాడనికానీ, యిద్దరికీ అట్టే నమ్మకం లేదు కనుక.

మళ్ళీ ఒక్కసారి కళ్ళెత్తి, రామచంద్రుడికేసి చూసిందినువర్ణ శ్యామల ఆమె అతనికేమీ క్రొత్త కాదు చిన్నప్పట్నించీ పరిచితమైనదే! అయితే యీ అపూర్వమైన ప్రత్యేకత యౌవనం నేర్పిందో, డబ్బు నేర్పిందో అర్థం కాలేదు. గొప్ప సంపన్నమ సోన్నంత ఆకర్షణగా రామచంద్రుడు వీళ్ళకేసి. చూస్తూ వుండి పొయ్యాడు.

'నేనెందుకొచ్చానో అడిగినన్ను వేధించకండి! దయచేసి యింకా కొంచెంసేపు మిమ్మల్నిలాగే చూడనీండి' అంటున్నట్లున్నాయతని చూపులు.

'అరె! కూర్చోవా? ఏమిటోయ్?' అన్నాడు ముకుందరావు ఘంటాపథంగా. ఎదుటిమనిషి కూర్చొనే వున్నాడో, నిల్చునేవున్నాడో గుర్తించ గలడు ముకుందరావు. వాళ్ళమ్మాయి కొంచెం నవ్వబోయి, మళ్ళీ ఆ అందం అతను జ్ఞాపికుంచుకుంటాడన్న లబ్ధిత్వంతో నేమో మానేసింది. అతను కూర్చుని కొంచెంగా చిరునవ్వు నవ్వాడు. క్షణం గడిపి మళ్ళీ సర్దుకుని కూర్చున్నాడు. మళ్ళీ నవ్వాలా? వద్దా? అనే ఆలోచనలో పడిపోయాడు! ముకుందరావు సిగరెట్ పారేసి పచార్లు సాగిస్తూ నమ్రతగా లేచి నిల్చోబోయిన రామచంద్రుడిని భుజాలుపట్టుకుని కూలేసి ప్రారంభించాడు :

'విన్నావటోయ్! రామచంద్రుడూ? భక్తులయెదుట ప్రత్యక్షమైన దేవుడు, నీకేం వరం కావాలో చెప్పవోయ్ నాయనా? అని అడిగేడట! ఏం? ... ... అతగాడికేం కావాలో—ఇతగాడికి తెలీనా? అది కాదు విషయం. భక్తులనోట వారి కోర్కెను పలికించాలనే వుద్దేశ్యమే ముఖ్యమని ఒప్పుకుంటావా?— అట్లా పలికించటంలో ప్రయోజన మేమిటి? అంతే, దాని కొక గొప్ప ఆధ్యాత్మిక ప్రయోజన ముంది మన మంత దూరం వెళ్ళవలసిన అవసరం లేదనుకో... ...' రామచంద్రుడి ఒళ్ళు జల్లుమంది. సంతోషమో— భయమో, ఆయన సంభాషణ చాతుర్యానికి సాగి మ్రొక్కటమో, లేక ఆ ఉపమానాలలోని తన్ను గురించిన అహంకారం తలచుకుని, అసహ్యించుకుని కోపం ప్రదర్శించాలో— ఏది చూపెట్టాలో ఏమీ అర్థం కాకుండా పోయిందతనికి.

'ఊరకరారు మహాత్ములు'— అనిఅమ్మాయిగారు, 'నే రచింపబోవు ప్రబంధమ్మునకు కథాక్రమం బెట్టిదనిన' అనే ధోరణిలో కొంచెం తెంతోలిగించింది.

'అయితే మునీశ్వరు లేదో 'ఎత్తు' తోనే రాజదర్బారు కొచ్చాడంటావ్?' కొంచెం నవ్వుతూ అన్నాడు.

'సందేహమేలా? కేవలం 'కాఫీ' కోసం యింత శ్రమ పడతారనుకోము'—ఇద్దరూ నవ్వారు.

రామరామ! వీళ్ళిద్దరూ మహా క్రూరులు! కేవలం ధనవంతులమనే కారణంచేత ప్రపంచంలో అసంఖ్యాకంగా వున్న దౌర్భాగ్యుల్ని ఇంతలా హింసించటం భావ్యంకాదు.

'అయితే సెలవియ్యండి! మీ యాగంలో భాగం పంచుకుని, ఏదో మా తండ్రీ కూతుళ్ళ మింత 'పుణ్యం' సంపాదించుకుంటాము ... అన్నట్లు యాగం పేరేమిటో... ... ...'

'అదే నాన్నా! నే చెప్పలేదూ... అది వీళ్ళ వంశీకులంతా ఆచరిస్తోన్న మరో క్రతువు! దానిపేరు-ధనదహన యాగం'— ముకుందరావు పడి పడి నవ్వాడు.

రామచంద్రరావు కిక అక్కడుండటం అసాధ్యమైపోయింది, లేవటం దుస్సాధ్యమైంది! 'వీళ్ళనేమిటి డబ్బు డగటం? చస్తే అడగను'—మళ్ళీ అటువేపునించీ ఆలోచన చీకటిలా క్రమ్ముకొస్తోంది అవును. చస్తే అడగను. సరే... మరి బ్రతికివున్నాను కదూ?... ...ఇప్పుడు రోషం ప్రదర్శించినదాని ఫలితం, రెండ్రోజుల తర్వాత మళ్ళీ యిక్కడికే వచ్చి— వీళ్ళ అవమానబాణం గురి చెదరకుండా, తల అటూ యిటూ కదపక బుద్ధిగా కూర్చోటమే! భగవంతుడా! డబ్బుయొక్క మహత్యం నీ లీలల్ని గూడా మించిపోయిందిగదా! ఇంక ఎందుకయ్యా, కథల్లో—సినిమాల్లో 'డబ్బు పాపిష్టిది' అనే డైలాగులు మానుకోరు! దౌర్భాగ్యుల్ని వంచించటం తప్పితే దాంట్లో అర్థమేముంది?

హఠాత్తుగా ఏదో జ్ఞాపికొచ్చిన వాడిలా అన్నాడు ముకుందరావు.

'అమ్మాయ్! చూడు! సాధువుల కిట్టే కోపం తెప్పించకు! అది మన

- జోళ్ళషాపులోకి ఒకడు వెళ్ళి తన సైజుకంటె బాగా చిన్నసైజు బూట్లు చూపించి అవి యివ్వమన్నాడు.

'అవి మీకు బాగా యిరుకైపోతాయ్' అన్నాడు షాపువాడు.

'ఫరవాలేదు. నేను చాలా కష్టాల్లో వున్నాను. వ్యాపారం దివాళాలో వుంది. అప్పులవాళ్ళు పీడిస్తున్నారు. ఇద్దరాడపిల్లలు పెళ్ళి కెదిగి కూర్చున్నారు. మా ఆవిడకి నాలుగేళ్ళనుంచీ జబ్బు తగ్గడంలేదు. అందుకని రోజంతా యిరుకుబూట్లు తొడుక్కుని సాయంత్రం విప్పేస్తె వచ్చే సుఖమే నాకిహ మిగిలింది' అన్నాడతడు కళ్ళు తుడుచుకుంటూ.

లాంటివారికంత మంచిదికాదు. పైగా యితగాడి వంశం పూర్వ ఋషిసంప్రదాయంలోది. వీళ్ళ నాన్న నీకు తెలీదులే… …నాకు తెలుసు. ఆయనకి కొడుకై పుట్టడంవల్ల—ఇతగాడంటే నాకు ప్రేమ పెరిగి పోతోందేగాని, తరిగే వుపాయమేమీ తోచటంలేదు. ఇతడైనా ఎంతో మంచివాడు, ధనవంతుల అక్రమాల్నిగురించి కరపత్రాలు ప్రచురించి, ఉచితంగా పంచేయగలడు. తీసుకున్న అప్పు తీర్చాలన్న దిగులెన్నడూ పెట్టుకోడు—" నవ్వుతూనే నిష్క్రమించాడు ముకుందరావు.

అమ్మాయికూడా నవ్వుతూ నవ్వుతూనే విసుగు నటిస్తూఅంది. "చెప్పండి బాబూ! చప్పున. ఎంత?"

"వంద!… …"

"వందా?—ఏం?"

రామచంద్రరావు కర్థం కాలేదు.

"అంటే ఎగవెయ్యడానిక్కూడా ఓపిక కావాలా?"

"మీరలా నా నిజాయితీని 'కించ' పరచటమేమీ బావుండలేదు. మీ దగ్గర తీసుకున్న డబ్బంతా వ్రాసి వుంచుకున్నాను. ఇప్పటికి ఎనిమిదివందల యాభై అయింది…"

"అహా… … …పద్దులైతే వ్రాసి వుంచగలరు… … …కానీ తీర్చటమెలా?"

"లోకంలో బాకీలు చేస్తున్న వాళ్ళెలా తీరుస్తున్నారో నేనూ అదే విధంగా తీర్చగలను— సంపాదించగలను… …లేదా ఏదైనా అమ్మేసి తీర్చగలను!"

"సరే… …ఇప్పుడు నే నివ్వకపోతే… …ఏం చేస్తారూ?"

"ఎందుకివ్వరూ? ఇవ్వకపోతే యెలా? నేనూ — నా ప్రెస్‌లో పనివాళ్ళు -యింటద్దెలూ, నే చెయ్యబోయే సాహిత్యసేవా? ఇదంతా యేం కావాలి? అయినా నాకేమీ వుచితంగా అక్కర్లేదు. మీబాకీ తీర్చగలను…"

"ఆపండి! ఆపండి! ఆ పాట మీరు చాలాసార్లు పాడుతోండగా విన్నాను. వినగా - వినగా యిప్పుడది మొట్ట మొదటంత శ్రావ్యంగా వుండటంలేదు." పక్కుమని నవ్వింది.

అతడదేమీ గమనించినట్లులేదు. "ఇప్పుడేమైందంటే, ఒకతనికి హఠాత్తుగా అపత్కాలమొచ్చి పడింది. పాపం లేకపోతే నన్ను డబ్బడిగేవాడే కాదు. మరి యీటాయనకి యేదో అవసరమేవచ్చిపడింది లేకపోతే ఆయనా అడిగేవాడు కాదు మరి. మా చెల్లాయి పాపం! మీరు చూశారుగదా దాన్ని! అచ్చం మా అమ్మలాగే వుంటుంది. ఎంతో మోజుపడింది. లేకపోతే అచీరె కొనిపెట్టమనేదికాదు…"

"ఉండండి, నేను పూర్తి చేస్తాను. ఇంతకీ మీ దగ్గర డబ్బులేదు — ఉంటే మమ్మల్నడిగేవాళ్ళే కాదు… మా దగ్గర డబ్బుంది … లేకపోతే మేమిచ్చేవాళ్ళమే కాదు… సరి, యీ గేయం చాలా బావుంది.

ఏదేనా పత్రికకి పంపండి…" అంటూ 'బ్యాగ్' తీసి ఓ వందనోటువిసరేసింది. అందుకుంటూ అన్నాడతడు.

"ఇంతకీ మీరేమీ వుచితంగా…" పూర్తి చెయ్యకుండానే అమ్మాయి లోపలికెళ్ళిపోయింది.

ఈ విధంగా ప్రవేశమైన యీ ముగ్గుర్నీ ముగింపుదాకా లాక్కురావలసిన బాధ్యత నా మీదుంది గనుక, వినవలసిన భారం మీ మీదుంది గనుక, మీకూ - నాకూ సులభమైన దగ్గర మార్గమిలా ఆలోచించాను. చిత్తగించండి…

ఒకానొకనాడు ప్రశాంతమైన వుదయం. హృదయంనిండుగా, (సిగరెట్ పొగ) సంతోషం నిండుకున్నప్పుడు - కాఫీ తీసుకుని అమ్మాయి యెదురుగా వస్తోన్నప్పుడు - పూర్వస్మృతి వర్తమానంలోకి దుమికి అలలు లేవినప్పుడు - యిలా ఆలోచించాడు ముకుందరావు.

"అవును, ప్రభావతీ! అమ్మాయి శ్యామల పెద్దదయిపోయింది. ముమ్మూర్తులా నీలాగే వుందికూడా; నువ్వులేవు, 'అమ్మాయి పెళ్ళి సంగతి యేమాలోచించారు?' అని నన్నడిగేవాళ్ళెవరూ లేరు. కనుక ఈ క్షణం వఱకూ నాకీ సంగతి జ్ఞాపకమే రాలేదు. అయినా మంచిదే… ఇప్పటికైనా తెలుసుకున్నాను. తెలుసుకున్నాననటంకన్నా, నువ్వు చెప్తోంటే వింటున్నాననటంలోనే నిజముందేమో? వివాహాన్ని గురించిన నా అభిప్రాయం నీకు తెలుసు. అమ్మాయిని గురించి నాకు తెలుసు. కనుక మనకేమీ భయంలేదు. ఇంతేనా? తండ్రివైనందుకు నీ బాధ్యత! అని నిలదీస్తే నిలవటం కష్టమనుకో! అన్నట్లు చూడు … మీ పరమేశ్వరన్నయ్య కుమారుడు, రామచంద్రుడు యిప్పుడు మనకు దావులోనే వున్నాడు. మంచివాడు! అమ్మాయికెలా కనిపిస్తాడోకానీ; నాకు మాత్రం, అందంగానే కనిపిస్తోన్నాడు. అయితే సంపాదనేమీలేదు. పోనీ, మనం కావాలనుకుంటే మనదంతా అతనిదేకదా? అయినా మనమ్మాయి సువర్ణ శ్యామల కళ్ళకు తన భవిష్యత్తుకేసి స్పష్టంగా చూడగలశక్తివుందని నాకు నమ్మకముంది! అందుకనే ఏ చీకూ చింతా లేకుండా సిగరెట్లతో, షికార్లతో కాలం వెళ్ళబుచ్చుతున్నాను నేను.

మరొకనాడు సాయంకాలం.

అల్లసాని పెద్దన్నకు— 'ఏవిహంగముగన్న' — అన్నపద్యం మకుటానికి రూపం కల్పించిన మనోహరమైన సాయంకాలం! యువరక్తం బుక్కాపొడిగా, మన్మథుడు పూలబాణం ప్రయోగించి, జగత్తునంతా ముంచేసినట్లున్న వాతావరణంలో, చిరునవ్వుతో, చెక్కిట చేయిజేర్చి యిలా పాడుకుంది కుమారి సువర్ణ శ్యామల.

"బారా! రామచంద్రరావూ! నువ్వొట్టి వెర్రివాడివా? లేక మరీ మితిమీరిన సరసుడివా? అర్థం కాకుండా పోయింది. అర్థంకాని పరిస్థి

తుల్లోకి నెట్టడమే యౌవనంయొక్క ముఖ్యలక్షణమా ఏమి? అందంగా— యౌవనానికి స్వాగత పీఠంలా వున్నాను. ఒంటిగా—చనువుగా వున్నాను. ప్రేమ వెలిగే కళ్ళతో, పులకరిస్తే చేయిచాస్తే తక్షణం తీగెలా చుట్టివేయడానికి సిద్ధంగా వున్నాను. ఇది గ్రహించలేదా? లేక నిగ్రహం చూపెడుతున్నావా? ఇంకా ... ఇంకా... ...నా స్థాయి దిగజార్చాలనే నీచమైన అహంకారమా? లేక నాలోని యౌవనం నింపే రంగులకాంతి ప్రసారానికి వుపకరిస్తో—నిమిత్తమైన, అచేతనమైన 'కిటికీ'లాంటివాడివా? మా నాన్న గురించి నీకు తెలీదా? నన్ను రామచంద్రరావు కిచ్చి పెళ్ళి చెయ్యవయ్యా ... ... అంటే "అయం ముహూర్తం" అనగలదని, అర్థం కాలేదా? మరెందుకోయీ యీ జాప్యం? నీకేనా యీ పట్టుదల? సరే, ఎవరు జయిస్తారో కాచుకో!

అదే సాయంత్రం పరచిన పచ్చని—వెచ్చని శయ్యపై పడుకుని, అర్థంకాని నారికేళపాకాన్ని గూర్చి వ్యాఖ్యానం చేస్తోన్నాడు రామచంద్రరావు.

ధనికుల తత్త్వమేయింత! మీరు మాట్లాడే మాటల కన్నిటికీ అర్థం ఉండనవసరంలేదా? ఒక్క శ్యామల వంద శ్యామలల్లా కనపడుతుందేమిటి? ఇవ్వగూడనంతటి చనువు చూపిస్తుంది. మరుక్షణం వూహించనంతదూరం, త్రోసేస్తుంది. మందికి మారుపేరులా, ఆహానికి అవధిలా అగపడుతూంది. ఒక్కోసారి తన ఆహ్వానం కోసం కాచుకున్నట్టు నటిస్తుంది. మరోసారి తన నోటివెంట ప్రేమ విషయమెత్తకం తడవుగా, ఫెడీ—ఫెడీమని వాయించి, పీడ విరగడ చేసుకుంటుం దనిపిస్తుంది.

అసలు శ్యామలతో ప్రేమవిషయమెత్తుటమే కష్టం! మానవమాత్రుడికి సాధ్యమయ్యేలా తోచలేదు. మొన్న సంగతి మరీ చోద్యంగా వుంది.

"ఇన్ని సినిమాలు చూస్తున్నావు ... ఇన్ని కథలు చదువుతున్నావు ... ... కానీ, డబ్బు సంపాదించే అడ్డత్రోవ తెలిసికోలేకపోతున్నావుగదా అమాయకుడా?" అంది జాలిపడుతున్నట్లు. తన కర్థంకాలేదు.

"ఏముంది లక్షలకధికారి ముకుందరావుగారి కొక్కగానొక్క కుమార్తెను, నేను నిన్ను ప్రేమిస్తే, లేదా యేదో వయసులో వున్న దాన్ని, మోసంచేసి, వడిలో మోహనరాగం పాడేస్తే. బస్! నాన్నగారి ఆస్తి తమపేరిట ట్రాన్స్‌ఫర్". నవ్వుతోంది. నిజంగా అప్పట్లో ఆమె మీద యెన్నడూలేని అసహ్యం కలిగింది. ఛీ! ఛీ! యింకా యిల్లాంటి స్త్రీతో ప్రేమ విషయం మాట్లాడమే! ఆలోచిస్తే తనకూ - ఆమెకూ చాలా దూరమన్నట్లూ - నా దగ్గఱ యింకెన్నడైనా, ప్రేమసంగతి ప్రస్తావించేవు సుమా? అన్నభావము స్పష్టపడుతోంది. అయితే మనస్సు. దీని దుంపతెగా! యెప్పుడూ పీక్కు తినటమేనా దీనిపని?



ఎవరి నిర్ణయమెలావున్నా - కాల నిర్ణయం ముందుకు సాగటమే ననేది మనందరికి తెలిసిందే! రెండు నెలలుగా వాళ్ళ తాతగారి వూరు వెళ్ళివచ్చిన రామచంద్రరావు విన్నదప్పుడే... కుమారి సువర్ణ శ్యామలను శ్రీపాదమూర్తి బి. ఇ. గారి కిచ్చి చేస్తోన్న పెళ్ళి హడావిడి!

ఇంటి ముందు విశాలమైన పందిరి. పచ్చని మామిడాకుల తోరణాలు. ఒకవేపు 'లారీ'లతో యిసుక తోలుతున్నారు, పిల్లలంతా చెడు

గుడు ఆడుకుంటూ దారి ఇవ్వటమే లేదు. ముకుందరావుగారూ, మరో ముగ్గురు మనుషులూ, అటు వెడుతూ తనకేసి చూశారు.

"ఓహో! మా రామచంద్రుడొచ్చాడు! ఇక నాకు సగం భారం తీరింది. రావోయ్ రా!" అంటూ ఆహ్వానించాడు ముకుందరావు. రామచంద్రరావు అన్నీ చూస్తూ యింట్లోకి ప్రవేశించాడు. రేడియో రూంలో కూర్చుని, అద్దంలోకి చూసుకుంటున్న సువర్ణ శ్యామల వెనుతిరిగి చూసింది. రామచంద్రరావు ఆశ్చర్యపోయాడు! ఆమె అద్దంలో ముఖం చూసుకుంటున్న గుర్తులు లేవు. ఏదో తీవ్రంగా - శాంతంగా, ఆత్మకేసి పరిశీలిస్తోన్నట్లుగా తోస్తోంది ఎత్తుగా - పొత్తుగా, 'ఆర్చి'లా పూల మర్చుకుంది. విషాదమూ - సంతోషమూ రెండిటికీ అతీతమైన దేవతలా కనిపిస్తోంది. మఱచిపోయిన కాళిదాసుని శ్యామలాస్తుతిని జ్ఞప్తికి తెస్తోంది. అతన్ని ఆహ్వానించ లేదు. అసమ్మతి అసలే చూపించ లేదు. ఒకటి - రెండు, మూడు, నిమిషాలలాగే చూసి, కొంచెంగా నవ్వుతోంది, పూవు రేకులు ఒక్కొక్కటిగా విడుస్తోన్నట్లు.

"విన్నారుగా"

"విన్నాను"...

"మీ కానుకేమిటిమరి?"

"ఋణగ్రస్తుడిని ... అయినా నా శక్త్యానుసారం..."

"అది నేను వినదలుచుకున్నానని తెలియటంలా ..." చిరుకోపానికి కొంచెం నవ్వు జోడిస్తూ.

"నా స్వంత చేతుల్తో అక్షరాలు కూర్చి మీ పెళ్ళి పత్రికను నా ప్రెస్సు ద్వారా అచ్చు వేయించాలనుకున్నాను."

"కిరాయి... యే మాత్రం?"—

"ఉచితమే..."

"అబ్బ! అంత ఔదార్యమా. ఏ విధంగా వేస్తారో! చెప్పండి చూద్దాం!"

"కుమారి సువర్ణ శ్యామల, చి,సౌ, కుం... ..."


"అదేమిటి? తిట్టెయ్యడమా?"—


"ఉహూ... చిరంజీవి సౌభాగ్యవతి, కుంకుమ శోభిత కుమారి సువర్ణ శ్యామలను, శ్రీపాదమూర్తి బి. ఇ. గారికిచ్చి పెళ్ళి వైభవముగా జరుపబడును. ఏ తత్ శుభముహూర్తమునకు విచ్చేసి వధూవరుల నాశీర్వదించి మమ్మానందింప జేయుదురని ప్రార్థన..."


ఆమె అతడి కళ్ళకేసి చూస్తోంది. కళ్ళలోనించే, ఆత్మలోకి, వెళ్ళి - ఆత్మలోని చీకటి వాకిళ్ళు తెరుస్తోన్నట్లు! హఠాత్తుగా యిద్దరూ గట్టిగా నవ్వుకున్నారు. కళ్ళలో యేదో అపూర్వమైన తడిమంట వెలుగులు! ఆ వెలుగుల దారిలో నిల్చుని, వీడ్కోలు సందేశంలా యిలా అంది కుమారి సువర్ణ శ్యామల!

"ఏమయ్యా! రామచంద్రరావూ? నేనేమో ప్రయాణానికి సిద్ధమై సర్దుకుని కూచున్నాను. నువ్వేమో యిప్పుడిప్పుడు నడక నేర్చుకుంటున్నావు! ఎన్నో వేల మైళ్ళు నడవ్వలసిన ఈ ప్రయాణంలో తొందఱపడ్డానని, నిందవెయ్యక, మనస్ఫూర్తిగా ఆశీర్వదించి - పంపు మరీ..."

□□□







ఎవరు?

కథ పూర్తిచేసి తలెత్తి చూసేసరికి భరద్వాజ కుతూహలంగా చూస్తున్నాడు నావంక. నెంబర్ల ప్రకారం కథ రాసిన కాయితాలు బొత్తిపెట్టి, పెన్ కేప్ పెట్టి డ్రాయర్లో పడేశాను.

"ఏదీ, యిలా తే, చదివి చూస్తా" అన్నాడు భరద్వాజ్, అంతవరకూ నిశ్శబ్దంగా కూర్చున్నవాడల్లా. నేను ఒక్క క్షణం సంశయించాను. నాకు తెలుసు, ఏదో వంక పెడతాడు. అయినా తప్పదు. కోప మొస్తుంది చూపించకపోతే!. బొత్తిపెట్టిన కాయితాలకి పిన్ పెట్టి భరద్వాజ ముందుకు తోశాను. కథ చదవటం ప్రారంభించినప్పటి నుంచీ పూర్తి అయేవరకూ వాడి మొఖంలో మారుతున్న భావాలకేసి చూస్తూ కూర్చున్నాను.

"భానూ, యిదా నీ రచన. నువ్వు సృష్టించిన వ్యక్తులేనా వీళ్ళు" అన్నాడు భరద్వాజ కథ పూర్తిచేసి వ్యాఖ్యానానికి నాంది వాక్యం పలుకుతూ.

"ఉహుం, నేనొప్పుకోను భానూ. ఈ కథలో నువ్వు చెప్పిన వ్యక్తు లుండరసలు. నీకు లోకం మంచి చెడ్డలు ఎంత వరకూ తెలుసు? నీ కథలో ఆడవాళ్ళు తప్ప మొగ వాళ్ళంతా, చెడ్డవాళ్ళూ హృదయం లేని వాళ్ళేనా? నిజంచెప్పు భానూ మొగవాళ్ళని గురించి నీ అభిప్రాయంకూడా యిదేనా?" అన్నాడు భరద్వాజ. నాకు చిరాకనిపించింది. ఏమిటిది? అర్థంలేని సంభాషణ. నేను ఏదోరాస్తే దాన్ని గురించి, ఏకంగా నాఅభిప్రాయమే అడుగుతున్న భరద్వాజని గురించి ఏమనుకోవాలో తెలీలేదు.

"నువ్వు తప్పు అభిప్రాయ పడుతున్నావన్నయ్యా! నా వుద్దేశ్యం మగ వాళ్ళు చెడ్డవాళ్ళని కాదే! నిర్మల జీవితం చెప్పటం మాత్రమే!" అన్నాను నేను కొంచెం కోపంగానే.

"పిచ్చిపిల్లా! జీవితంలో ఏ వ్యక్తి కష్టాల్ని కోరుకోడుకదూ! ప్రశాంత మైన సంసారసుఖం కావాలనే వాంఛిస్తాడు ఏ వ్యక్తికీ తన బిడ్డల మీద ప్రేమ వుండదని పొరబడకు చెల్లాయ్. నీ కథలోని వ్యక్తులు బజార్నపోయే మామూలు మనుషులు కారు. సంఘానికి దూరంగా ఏదో చాలా దూరంగా మూల కూర్చుని బాధపడే వాళ్ళే. ఎంత రెండోపెళ్ళయినా రాంబాబు ప్రవర్తన చిత్రంగా లేదూ! సంస్కారం లేనివాళ్ళకు కూడా భార్య అంటే ఏ మూలో ప్రేమ వుంటుందే! అందునా నీ కథలోని వ్యక్తి సంస్కారవంతుడుకూడాను. నీకు తెలీదు. లోకంఅంటే ఏమిటి? అదీకాక కమలకి పదహారేళ్ళొచ్చేవరకూ నిర్మలకి తన కూతురని తెలీకుండా వుందా? పోనీ అది వదిలేద్దాం. కథ ఎండింగ్ లో చూడు. కమల తన కూతురని తెలిసి కూడా బిడ్డని ఎందుకంది? చేతనైతే అక్కడేదో సైకలాజికల్ ఎఫెక్టు తీసుకురా. కథలకి యింతకన్నా మంచి మేటర్ దొరకదా? సొసైటీలో ఎన్ని మంచి చెడ్డలు లేవూ? అవి విమర్శించరాదూ! నువ్వు కథ రాశావూ అంటే, నీ నుంచి సంఘం ఏదో వాంఛిస్తోం దన్నమాట. హ్యూమన్ సైకాలజీ ప్రతిబింబించేట్లు చెయ్యి భానూ... ...' అన్నాడు భరద్వాజ, నాకు ప్రశ్నవేసే టైము కూడా లేకుండా. నేను నివ్వెర పోయాను. నా కథలో యీ తప్పు లన్నీ వున్నమాట నిజమే కావచ్చు! కానీ అన్నయ్యలా భవిష్యత్తుని ఉజ్వలంగా వూహిస్తూ ఆనందించేవాళ్ళని నేనెక్కడా చూడలేదు.

'నేనంతకంటే ఒప్పుకోను. అటువంటి వ్యక్తులు లేరనకు, ఉన్నారు.

కె. త్రిపుర

ఉండి తీరాలి. ఉంటారు కూడాను. ప్రతివాడూ నీలాగే ఆలోచిస్తాడా?' అన్నాను.

'నాలాగే, ఆలోచిస్తారనుకుంటాను నేను' అన్నాడు అన్నయ్య నా వంక వింతగా చూసి నవ్వేస్తూ.

"నేనూ, ఎవరో ఒకర్ని దృష్టిలో పెట్టుకుని రాస్తాను. ఆ మాట నువ్వు మర్చిపోతున్నావ్ అన్నయ్యా'

'నీ కథలోని వ్యక్తులు లక్షకి కూడా ఒకళ్ళుండరు...' అన్నయ్య మాట పూర్తి కాక మునుపే, కాయితాలు చేతిలోకి తీసుకున్నాను.

విసుగ్గా అనిపిస్తోంది. చింపెయ్యాలనిపించింది.

అన్నయ్య చటుక్కున కుర్చీలో నుంచి లేచి వచ్చి నా చేతిలోని కాయితాలు తీసుకున్నాడు. 'చింపుదామని అనుకుంటున్నావా? ఒద్దు' అన్నాడు పేజీలు తిరగేస్తూ.

'ఇలాటివాళ్ళు వుండరంటావా?' అన్నాను నేను. లోపల అనుమానం పీకుతున్నా. ఎలాగయినా అన్నయ్య చేత వుంటారనిపించాలని నా విశ్వ ప్రయత్నం.

'ఉంటారా? ఉండరా? అనేది ప్రశ్న కాదసలు. ఉండవచ్చు. కానీ అటువంటి వాళ్ళని నువ్వు ఎంతదాకా ఎరుగున్నావూ? నిష్పాక్షికంగా విమర్శించగల జ్ఞానం నీకుందా? ఏ పాత్రమీదో ప్రీతికొద్దీ అవతల వాళ్ళని నిర్లక్ష్యం చెయ్యనూ వచ్చుగదా! అది మాత్రమే నే నడుగుతున్నది.' అన్నాడు అన్నయ్య. నేను మౌనంగా వూరుకోవటం కన్నా గత్యంతరం లేదు. ఎవరో ఎవర్ని గురించో అనుకున్న నాలుగు మాటల ఆధారంగా కథ రాసి కొండంత ఆత్మ విశ్వాసాన్ని పెంచుకోవటం నా తప్పే. అయినా అన్నయ్య చెప్పింది కూడా నిజమే మరి! నా అహం దెబ్బతింటుంది అన్నయ్య మాట ఒప్పుకుంటే అని నా బాధ. భార్యని ప్రేమించని భర్తలూ, పిల్లల్ని ప్రేమించని తండ్రులూ వుండరని అన్నయ్య కెందు కంత దృఢమైన అభిప్రాయం?

● ● ●

ఒకో సంఘటన ఎందుకు జరుగుతుందో అర్థంగాని ప్రశ్నగానే వుండిపోతుంది.

ఈవేళ సరిగ్గా అలాటిదే జరిగింది. ఆదివారం కావటంవల్ల అన్నయ్య యింట్లోనే వుండిపోయాడు. ప్రొద్దున్న ఎవరో ఫ్రెండుకి చూపిస్తానంటూ నా కథ తీసుకెళ్ళి డ్రాయింగ్ రూమ్ లో కూర్చున్నాడు. అతనెవరో రచయిత అనే చెప్పాడుగానీ నే నాట్టే పట్టించుకోలేదు.

ప్రత్యక్షంగా అతనేమన్నాడో నేనైతే వినలేదుగాని, మధ్యాహ్నం తిరుబడిగా కాయితాలు చేతిలోకి తీసుకున్నప్పుడు మటుకూ తెల్లబోయాననే చెప్పాలి. నే రాసిన పేపర్లనిండా రెడ్ ఇంక్ తో అండర్ లైన్లూ రిమార్కులూ ... అతను పేరు పొందిన రచయిత, నేను మొదటిసారి కథ రాసినా మెచ్చుకోకపోయినా మరీ యింత అధ్వాన్నంగా ప్రవర్తిస్తాడని నే ననుకోలేదు.

ఆకాశం గది కిటికీలోనుంచి దూరంగా తెరిపిగా కనిపిస్తోంది. కిటికీ ప్రక్కగా వున్న లిల్లీ మొక్క పొడుగ్గా ఎదిగి రెండు తెల్లపూలు పూసి గాలికి అటూ యిటూ వూగుతోంది.

'నీ స్నేహితుడు చాలా మంచివాడు సుమా!' అందా మనుకున్న నాకు ప్రభాకరబాబు రాక అంత రాయం కలిగించింది.

ఆరడుగుల అందమైన పచ్చటి విగ్రహం ప్రభాకరం. అన్నయ్యతో పాటు ఫైనలియర్ ఎమ్. బి. చదువుతున్నాడు. ఇంటరు నుంచీ అన్నయ్యా అతనూ సహాధ్యాయులు. అన్నయ్య దృష్టిలో ప్రభాకర మొక బంగారు పిచ్చుక. నేను నవ్వుతూ అంటుంటాను '"బంగారు పంజరం కూడా వుందా?' అని. తమాషాగా తల తిప్పుతూ 'వున్నట్లే లెఖ్ఖ' అంటాడు అన్నయ్య. అతనిలో విలక్షణమైన విశేషాలేం కనిపించలేదు. హుందాగా మృదువుగా కదిలే అతనిలో భావాల కదలిక గమనించటం కష్టమే మరి!

అన్నయ్యకీ అతనికీ మధ్య అగాధాలు అడ్డం. వాటి అవతలి ఒడ్డు నొకళ్ళూ, యివతలి ఒడ్డు నొకళ్ళూ నిలబడి స్నేహ పూర్వకంగా చేతులు కలుపుకుని నిలబడగలరు.

'ఏవిటోయ్ విశేషాలు' అన్నాడు ప్రభాకరం లోపలి కొస్తూనే.

నేను నవ్వి లోపలికి వెళ్ళిపోయాను. నేను కాఫీతో తిరిగి వచ్చేసరికి 'అందుకన్నమాట చెల్లాయ్‌కి కోపం వచ్చింది' అంటున్నాడు ప్రభాకరం, నా వెనకనే. అన్నయ్య మామధ్య జరిగింది చెప్పి వుంటాడనేది నాకు తెలియందికాదు.

'చూడు భానూ ... ప్రభాకరమేదో మాంచి జడ్జిమెంటు చెప్తా

నన్నాడు, అందుకే నీ కథను రికమెండ్ చేశాను, అదీగాక నలుగురూ నిన్ను గుర్తించ వద్దూ...' అన్నయ్య నన్ను చూస్తూనే వుత్సాహంగా చెప్పాడు.

ప్రభాకరం కాఫీ సిప్ చేస్తూ నవ్వుతూ మా యిద్దరివంకా చూశాడు.

హాల్లోని గోడగడియారం నాలుగు కొట్టింది. ఆకాశంలో మబ్బులు దట్టంగా కమ్ముకుంటున్నాయి. కిటికీ అవతల రెండు చిన్న చిన్న పొడుగు ముక్కు పచ్చ పిట్టలు వుండి, వుండి లిల్లీ పువ్వులు అందుకోవాలని చూస్తున్నాయి. గదిలో కాలెండర్ అడుగున తారీఖుల కాగితాలు పల్చటి శబ్దం చేస్తున్నాయి. గదిలో పల్చటి చీకటితెర జారినట్లుగా వున్నది.

చేతులు కట్టుకుని బల్లమీద ముందుకు వంగి కూర్చున్నాడు కుర్చీలో ప్రభాకరం.

'నీ కింతకీ చెల్లాయ్ రాసిన కథ నచ్చలేదంటావ్' అన్నాడు ప్రభాకరం యింతసేపటికి మా ముగ్గురిలో తనే మాట్లాడుతూ.

'పోనీ నేనూ ఓ కథ చెప్పనా ?' అన్నాడు ప్రభాకరమే.

'హరి భగవాన్ ! అందరూ కథలు

చెప్పేవాళ్ళే. చెప్పు చెప్పు విందాం. ఏదో వర్షానికి కాస్త కాలక్షేపం' అన్నాడు అన్నయ్య. లేచి లైటువేస్తూ. బైట వర్షపు తుప్పర ప్రారంభమైంది. కిటికీలోని లిల్లీ మొక్కమీది పిట్టలు ఎగిరిపోయినట్లున్నాయి.

నా ప్రాణం వుసూరుమంది. ఏదో జడ్జిమెంటు గిడ్జిమెంటు అన్నవాడు తానే కథ చెప్పటానికి తయారయ్యాడు. చిత్రమే మరి !

ప్రభాకరం కథ చెప్పటం మొదలు పెట్టాడు. బైట వర్షం నిలబడి కురుస్తోంది. కిటికీ చువ్వల్లోంచి లైటు కాంతి బైటి వర్షపుధారలమీద పడి బంగారు తీగల్లాగ మెరుస్తున్నాయి వర్షపుధారలు.

● ● ●

దూరంగా కొండలమీద మబ్బు పట్టి చల్లగాలి వేస్తోంది. తోటలో రాజయ్య మొక్కలకు గొప్పులు త్రవ్వుతున్నాడు. విరగపూసిన గులాబీలు సువాసనలు వెదజల్లుతున్నాయి.

ప్రభాకరబాబు వరండాలో పేము కుర్చీలో కూర్చుని జారిపడుతున్న సన్నటి నీటి ధారలవంక చూస్తున్నాడు.

అత్తయ్యపోయి అప్పుడే యివాళ పదమూడో రోజు. చాలామంది చుట్టాలు పన్నెండో రోజే వెళ్ళిపోయారు. ఒకరిద్దరు మిగిలిన చుట్టాలు యీ వేళ ప్రొద్దుట వెళ్ళిపోయారు. ఈ పన్నెండు రోజుల సందడి ఒక్కసారి ఎగిరిపోయి నిశ్శబ్దం నిరుత్రమ్మినట్లుగా వుంది.

'అమ్మలాటి అత్తయ్య చనిపోయింది. ఏదో ఆవేదనగా అనిపిస్తోంది' అనుకున్నాడు ప్రభాకరం. నిన్న మొన్నటిదాకా అత్తయ్య గుండెల్లో తల దాచుకున్న తను... ఈ రోజు నిరాధారుడు. తల్చుకుంటే ప్రభాకరానికి చిత్రంగా అనిపిస్తోంది.

గేటులో పంకజలక్ష్మి కనిపించింది. ఆవిడ అత్తయ్య పేర జరుగుతున్న స్కూలు కార్యదర్శిని. 'ఏం పని మీద వచ్చిందో?' అనుకున్నాడు ప్రభాకరం.

'ప్రభాకరబాబూ, మావయ్య లేరా ?' అంటూ వరండా మెట్లెక్కి పైకి వచ్చింది.

'నమస్కారం పంకజమ్మగారూ! ఉన్నారు. రండి పిలుస్తాను.' అన్నాడు ప్రభాకరం లేచి నిలబడి. పంకజ లక్ష్మికి ఏభై ఏళ్ళుంటాయి. నిండుగా కప్పుకున్న ఖద్దరు చీర పమిటలో పచ్చగా గుమ్మటంలా వుంటుంది.

ప్రభాకరం లేచి వెళ్ళకుండానే విశ్వనాథంగారు వచ్చారు. నమస్కార ప్రతి నమస్కారాలయ్యాక పంకజలక్ష్మి ప్రారంభించింది :

'మొన్న నొకసారి వచ్చాను మిమ్మల్ని కలుసుకోవాలని. వీలుపడ లేదు. స్కూలుకు పట్టుగొమ్మలాటి వ్యక్తి, పది కాలాలపాటు బ్రతకదగ్గ వయసూ వున్న రాజ్యలక్ష్మిగారు పోవటం తీరని లోటు. పెద్ద కష్టమే కలిగింది వయసులో మీకు. క్రిందటి సారి ఆవిడా నేనూ కలిసినప్పుడు పేరు మార్చాలని వుందనీ, మీతో చెప్పి గట్టి ప్రయత్నం చేయిస్తాననీ......' పంకజలక్ష్మి మాట పూర్తికాక మునుపే,

విశ్వనాథంగారు లేచి నిలబడ్తూ 'నాకూ ఆ విషయమే చెప్పింది. ఊహుం, నా కిష్టం లేదమ్మా. ఎప్పటికీ రాజ్యలక్ష్మి పేరనే వుండాలి.' అంటూ చేతులు జోడించి నమస్కారంచేసి లోపలికి వెళ్ళిపోయారు.

ప్రభాకరం పంకజలక్ష్మి కేసి తిరిగి 'ఏ పేరని చెప్పిందండీ? అత్తయ్య' అన్నాడు.

'అన్నపూర్ణ అని కాబోలు. సరే! ఆ విషయమై ఆయన అభిప్రాయం తేలిపోయింది. ప్రభాకర్, మావయ్యని కనిపెట్టి వుండు. వస్తానోయ్' అన్నది పంకజలక్ష్మి లేచి వెళుతూ.

ప్రభాకరానికి చటుక్కున రాజ్యలక్ష్మి డైరీ గుర్తొచ్చింది.

ఆవిడ మరికొద్ది రోజుల్లో పోతుం దనగా ప్రభాకరాన్ని పిలిచి 'ప్రభా, నీకు వీలున్నప్పుడిది చదువు నాన్నా. ఇది నీ దగ్గరగాక మరొకరి దగ్గర భద్రంగా వుంటుందంటే నమ్మలేను' అన్నది. అప్పుడా డైరీని పుస్తకాల బీరువాలో పెట్టేశాడు. ఆ తరువాత ఆవిడ జబ్బూ, పోయిన హడావిడిలో మరిచిపోయాడు దానిమాట. ఇప్పు డెందుకో పంకజమ్మని చూస్తే డైరీ గుర్తొచ్చింది.

కొండలమీది మబ్బు విడిపోయి ఎండపొడ వస్తూంది. ప్రభాకరం తన గడిలో కూర్చుని అత్తయ్య డైరీ తెరిచాడు.

● ● ●

ఇది డైరీ కాదు. బహుశా ఏదీ కూడా కాక పోవచ్చు. ఇందులో నేనేదో మహా కష్టపడి పోయాననీ, సంసార సాగరం యీద లేననీ రాయ బోవటం లేదు. నా జీవితంలో ఒకే ఒక్క 'చిత్రమైన' సంఘటన జరిగింది. ఇది యిలా జరుగుతుందా? అన్న నా ఆలోచనలో జరిగిపోయిన సంఘటన తరుగు మెరుగుల్ని కాల గతి మార్చేసింది. అది పూర్తిగా మరిచి పోకముందే నాకు గుర్తున్న వరకూ రాసి, ఎప్పుడన్నా జీవితపు సంధ్య వెలుగులో నడిచి వచ్చిన దారి కేసి చూసుకుని ఆశ్చర్య పడటమో, ఆనంద పడటమో చెయ్యాలి. అందుకే రాస్తున్నాను.

* * *

నేను కాలేజీ నుంచి యింటికి వచ్చేటప్పటికి క్రింది హాల్లో ఎవరూ కనపించలేదు. పనిమనిషి సుబ్బులు సన్నజాజులు కోస్తోంది.

'సుబ్బులూ! అమ్మేదీ?' అన్నాను. అది వేలుపెట్టి పైకి చూపించింది. అమ్మ మేడమీద వుందన్నమాట. ఈ వేళ గంటముందే వచ్చాను కాలేజీ నుంచి. ఎక్కడికన్నా వెళ్ళాలి సరదాగా. నవ్వుకుంటూ మెట్లెక్కుతున్నాను.

గదిలో నాన్నా, అమ్మా మాట్లాడుతున్నారు. చివరి మెట్టుమీదే నిలిచి పోయాను.

'కడిగిన కాళ్ళు కడగటం, చేసిన దానమే చెయ్యటం ధర్మంకాదు. మనకైనా యిది మొదటి కార్యమే గదా! ఎంత చదువు, ఆస్తి వున్నా రెండోపెళ్ళి రెండోపెళ్ళే. నాకూతుర్ని చస్తే రెండో పెళ్ళి వాడికి యివ్వననే నా మాట. మీ ముందు అనవసరమే. అది నా కూతురేగాదు, మీ పిల్లకూడాను.' అమ్మ గొంతు దృఢంగా వినిపిస్తోంది.

'అతను వచ్చివెళ్ళాక, రాజు యిష్టాన్నికూడా సంప్రతించే చేద్దాం. ఐనా మరొకసారి ఆలోచించుతులసీ' నాన్నగారి గొంతు నచ్చచెప్పే ధోరణిలో మృదువుగా వినిపిస్తోంది. కొంత వరకు సంభాషణసారాంశం గ్రహించి మెట్లుదిగి హాల్లోకి వచ్చేశాను.

నా వెనకనే అమ్మా, నాన్నా కూడా వచ్చేశారు.



ఒక కోటీశ్వరుడు కుమార్తెతో పాటు ఓడలో ప్రయాణం చేస్తుంటే, కూతురు కాస్తా నీళ్ళలో పడింది. ఆయన గుండెలు బాదుకుంటూ 'నా కూతురోయ్. రక్షించండోయ్. రక్షించినవాడికి వెయ్యి రూపాయిలిస్తానోయ్' అని కేకలు పెట్టాడు. ఇంతలో నీళ్ళలో మరో చప్పుడైంది. అమ్మాయి దగ్గరగా ఇంకోమనిషి కనిపించాడు. బోటుదింపి ఇద్దర్నీ ఓడలోకి లాగారు. కోటీశ్వరుడు ఆ మనిషి దగ్గరికి పరిగెట్టుకెళ్ళి 'నాయనా! నా తల్లిని రక్షించావు. నీకు వెయ్యి రూపాయిలూ ఇచ్చి తీర్తాను,' అన్నాడు.

'నీ వెయ్యి రూపాయిలు అలా వుంచవయ్యా. నన్ను నీళ్ళలోకి తోసిన వెధవేడీ?' అన్నాడతడు.

'అప్పుడే వచ్చేశావా రాజా?' అన్నారు నాన్న నన్ను చూసి. తల వూపి అమ్మ వెనకనే లోపలికి వెళ్ళాను. అమ్మ చెప్పింది ఎవరో ఎం బి బి ఎస్. డాక్టరనీ, చాలా ఆస్తిపరులనీ, రెండో పెళ్ళని వివరాలు చెప్పింది.

ఆకుపచ్చంచు తెల్లసిల్కు చీర, తల్లో సన్నజాజులతో పెళ్ళి చూపులకు సిద్ధమయ్యాను. పెద్దచెల్లాయ్ నన్ను చూసి చూసి 'తెల్లగా జాజిమొగ్గలా వున్నావ్ రాజక్కా' అన్నది.

పెళ్ళిచూపులు ఆధునికంగా 'టీ'కి పిలిచిన పెద్దమనిషికి పరిచయం చేసినట్లు జరిగాయి. నాన్న నన్ను చూపించి 'మా పెద్దమ్మాయి, బి. ఏ. మొదటి సంవత్సరం. పేరు రాజ్యలక్ష్మి' అన్నారు. నేను నమస్కారం చేశాను. అతను నవ్వుతూ విష్ చేశాడు. నాన్న అతని వెనకనే వెళ్ళారు. అమ్మ నన్ను పిలిచి 'ఎంతయినా కాగి చల్లారిన పాలు, ఆలోచించు తల్లీ' అన్నది.

అరగంట తర్వాత నాన్న నన్ను పిలిచి 'రాజా! ఇష్టమేగదమ్మా?' అన్నారు. నేను అచేతనంగా తల వూపేను. అమ్మ చెప్పిన లాభనష్టాలు బేరీజువేసే స్థితిలో లేను. తెల్లటి బట్టల్లో అతని పచ్చటి విగ్రహమే మెదులుతోంది నా కళ్ళల్లో. ఏదో ఆకర్షణకి లొంగిపోయాను. అమ్మ ఎటువంటి వ్యతిరేకతా చూపలేదు ఆ తరువాత. పెళ్ళి జరిగిపోయింది.

* * *

శ్రావణమాసంలో కాబోలు కాపరానికి వచ్చేను. పదిపదిహేను రోజులు క్రొత్తదనంతో బాధపడ్డాను. ఇంటి మొత్తంమీద నేనూ, ఆయనా, భర్త పోయిన పెద్దాడబడుచు సావిత్రి, కొడుకు మూడేళ్ళ ప్రభాకరమూను. దొడ్లోపాకలో రాజయ్య, మాణిక్యం. ఇంటిపనులు చూసేది, రాజయ్య తోటపనులు చూసేవాడు.

చక్కటి మేడ, చుట్టూ అందమైన పూలతోట. సాయంత్రాలు తోటలో లైట్లు అందంగా వెలుగుతాయి. ఆ వెలుగులో పాలరాతి కృష్ణవిగ్రహపు మురళిలోనుంచి జారిపడే నీటిజల్లులు ప్రశాంతంగా చూస్తూ సాయంత్రాలు గడిపేదాన్ని.

ఒకరోజు మధ్యాహ్నం వింతోచక మేడమీది గదులు చూస్తున్నాను. దక్షిణంవేపు జార్ల వేసివున్న గది తలుపులు తీసుకువెళ్ళిన నన్ను ఆకర్షించింది అద్దాలబీరువాలోని రాధాకృష్ణుల విగ్రహం.

మధురమైన కృష్ణుని మురళీగానం వింటూ రాధ అరమూసిన కళ్ళతో లోకాన్ని అతని భుజాలమీదుగా తన్మయత్వంతో తిలకిస్తున్నట్లు, తెల్లటి గోవు రాధకి తీసిపోని తన్మయత్వంతో రక్షణగా వారిద్దర్నీ చుట్టి నిలబడుతూ వున్నది. రుక్మిణీదేవి శ్రీకృష్ణుని వర్ణిస్తూ నీ మేఘశ్యామల దేహానికి, మెడలోని గురివింద పూల మాలకి, ఎఱ్ఱటి పెదవుల మీద అంటిన రాధ నల్లని కాటుకకీ సరిపోయిం' దన్నదని అమ్మమ్మ చెప్పింది గుర్తొచ్చి ఏదో ఆలోచిస్తూ

అలా ఎంతసేపు నిల్చున్నానో నాకు తెలీదు.

'అంత బాగుందా ఆ విగ్రహం' అన్నారాయన నా భుజాలమీద చేతులు వేసి. నేను 'ఔ'నన్నట్లు తల వూపేను.

'అదక్కడి నుంచి తియ్యటానికి వీల్లేదు రాజా' అన్నారాయన నవ్వొదిలేస్తూ.

'టేబుల్ మీద పెట్టుకుంటే ఎంత బాగుంటుందీ' అన్నాను. ఆయన నా మాటకు మరి సమాధానం చెప్పకుండా గదిలోకి వెళ్ళిపోయారు. నా మతి వదిలిపోయింది. విస్తుపోయి నిలబడ్డాను.

* * *

ఆ వేళ పదిగంటలకి లేడీ డాక్టరు వచ్చింది. సావిత్రి నా గదిలోకి వచ్చింది. ఆయన డిస్పెన్సరీకి వెళ్ళిపోయారు.

'రాజ్యలక్ష్మీ, డాక్టరు వచ్చింది. వెళ్ళి పరీక్ష చేయించుకోమ్మా' అన్నది సావిత్రి.

'ఎవరి కోసం?' అన్నాను నేను తెల్లబోయి.

'నీ కోసమే' అన్నదావిడ.

'ఎవరు పిలిపించారు?' నా మరొక ప్రశ్న.

'నేనే పిలిపించాను. ఇహ ప్రశ్నలు వెయ్యటం ఆపి వెళ్ళు' అన్నదావిడ ఒక్క క్షణం నన్ను పరిశీలనగా చూసి. నేను మాట్లాడకుండా ఆవిడ వెనకనే వెళ్ళాను.

'మూడో నెల వెళ్ళిపోతుంది. మీకు మేనల్లుడో మేనగోడలో సావిత్రమ్మగారూ!' అన్నది లేడీ డాక్టరు నవ్వుతూ. సావిత్రి ఎటువంటి భావ ప్రకటనా చేయలేదు.

రాత్రి వెన్నెట్లో కూర్చున్నప్పుడు ఆయన అడిగారు. దొడ్లో పాకలో రాజయ్య తమ్ముడు పిల్లనగ్రోవి సాధన చేస్తున్నాడు.

'అక్కయ్య చెప్పింది, నీకు మూడో నెలటగదూ! చిత్రమే! అన్నపూర్ణకి లేని అదృష్టం నీకు పట్టింది రాజా. అదృష్టవంతురాలివి. సంతోషం.' అన్నారాయన లేచి వెళుతూ. అన్నపూర్ణ ఆయన మొదటి భార్య. రాజయ్య తమ్ముడి పిల్లనగ్రోవి అపశ్రుతి పలుకుతోంది.

చెప్పలేని ఆవేదన క్రమ్ముకొచ్చింది. ఇంత సంతోషమైన వార్తకి నిస్సారమైన ఓదార్పా? ఊహుఁ!! కుర్చీ చేతిమీద చేతులు పెట్టి అమాయకంగా నా వంక చూస్తున్న ప్రభాకరం కనిపించాడు. చప్పున గుండెలకి హత్తుకున్నాను.

* * *

నా రెండో ఆడబిడ్డ శైలజ కూడా

● సాధారణంగా పిడుగు ఒకసారి పడ్డచోట మళ్ళీ పడదంటారు. దానికి తెలుసు దండగని.

గర్భిణితో వుంది. పురిటికి పుట్టింటి కొచ్చింది. పసుపు కుంకుమ యివ్వటానికి వచ్చిన అమ్మతో హడావుడేం చెయ్యొద్దని ఆయన సావిత్రిచేత చెప్పించారు.

'పురిటికి పంపించటం అన్నయ్యకిష్టంలేదు. అదీగాక శైలుక్కడ నెల్లేగదా! మీరు మరో విధంగా భావించకండి అత్తయ్యగారూ!' అన్నది సావిత్రి అమ్మతో. అన్నిటికీ అమ్మ ముభావంగా వూరుకున్నట్లు కనిపించింది.

శైలజ చేత, నెమలి పింఛం రంగు పట్టుచీర వెండి పళ్ళెంలో పెట్టి పంపించారు. నిజానికది నాకు నచ్చలేదు. ఈ యింట నాకు గల ప్రత్యేకతేమిటో తెలుసుకోలేక పోతున్నాను. కిటికీ తెరలు మార్చటం దగ్గర్నుంచీ ఏదో నియమబద్ధంగా, నా ప్రమేయమేం లేకుండా జరిగిపోయే యీ యింటి పద్ధతుల వెనక ఏదో అదృశ్య హస్తం వుంది. అది నా భర్త మొదటి భార్య అన్నపూర్ణది కావచ్చు.

టైఫాయిడ్‌లో పురుడొచ్చింది. కళ్ళు తెరిచి చూసేసరికి ఆదుర్దాగా చూసే ప్రభాకరం పసి ముఖమే కనిపించింది. నాలుగు రోజుల తరువాత ఒళ్ళు తెలిసిన నాకు ఖాళీ వుయ్యాల చూసి పరిస్థితి గ్రహించటానికి ఎక్కువసేపు పట్టలేదు. నాకూ శైలజకీ ఒకటి రెండు గంటల తేడాగా పురుడొచ్చిందని, శైలజకి ఆడపిల్లనీ, నాకుపుట్టిన మగపిల్లాడు పోయాడనీ చెప్పారు. అమ్మ మటుకూ ముభావంగా వుండిపోయింది. శైలజ కూతురికి ముద్దుగా రాధికని నామకరణం చేశారు.

నాలుగేళ్ళ తర్వాత కాబోలు నేను పండక్కి వెళ్ళినప్పుడు అమ్మ 'వానలేని వరదా పిల్లల్లేని...... ' ఏదో సామెత చెప్పినట్లు, తోకపీకుడల్లే ప్రభాకర మెందుకే? మళ్ళీ నెలన్నా తప్పలేదు. అందులో మొగుడు డాక్టరుకూడాను...... ' అమ్మ నవ్వుతూ అంటున్నా అందులోని వ్యంగ్యం అర్థం చేసుకోలేనా నేను.

ఒకసారి యిదేవిషయం నేను కదిపినప్పుడు, 'తండ్రిలేని బిడ్డ ప్రభాకరం, తల్లివుండీ లేనివాడై, నీ వాడుగానే పెరుగుతున్నాడుగదా రాజూ!' అన్నారాయన. వెన్నెలలాటి ఆయన చిరునవ్వులో కరిగిపోవటం తప్ప నేనేం చెయ్యగలనూ?

* * *

పదహారేళ్ళతర్వాత మాట శైలజ పిల్లలతో పండక్కొచ్చింది. పెద్దది రాధికతర్వాత మరి యిద్దరు మొగపిల్లలూ, ఇద్దరాడపిల్లలూను. శైలజ పిల్లలూ, ప్రభాకరం అంతా నన్ను బలవంతంచేసి సినిమాకి తీసుకెళ్ళారు. శైలజ రానన్నది. సావిత్రి ఎప్పుడూ బైటికి రాదు. వారేదో సీరియస్ కేసుందని హాస్పిటల్ కెళ్ళిపోయారు.

సినిమా మరో గంటకి విడిచిపెడతారనగా విపరీతమైన తలపోటు వచ్చింది. నేనొక్కత్తెనే రిక్షామీద యింటికి వచ్చేశాను. లోటలో లైట్లు వెలగటల్లేదు. వరండాలో తక్కువ కాంతి బల్బుముందు, పనిమనిషి మాణిక్యం, శైలజ కూతుర్ని ఒళ్ళో పెట్టుకుని ఏదో బొమ్మలపుస్తకం తిరగేస్తోంది. సావిత్రి లోపల ఎక్కడో వున్నట్లుంది. పైనకూడా చీకటిగానే వుంది. నేను మెట్లెక్కి పైకి వెళ్ళేటప్పటికి శైలజ గొంతు వినిపిస్తోంది.

నేను చటుక్కున ఆగిపోయాను. నా పేరే వినిపిస్తోంది.

'రాజ్యలక్ష్మికి పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చెయ్యమంటే చేశాననే చెప్పింది డాక్టరు సుభద్ర. నీ యిష్టప్రకారమే చెయ్యవలసి వచ్చిందని చెప్పింది. అప్పట్లో రాధికని నాకూతురుగా చెప్పమంటే, నీ మొహం చూసి జాలిపడి తొందరపడి వప్పుకున్నాను. తప్పకుండా యింకా పిల్లలు పుడతారు, తప్పేముందని సర్దుకోబోయాను. ఏళ్ళు గడుస్తున్న కొద్దీ, నాకు భయం, బాధా కలుగుతున్నాయి. వదిన మొహం చూసినప్పుడల్లా. చెప్పెయ్యాలనిపిస్తుంది. కానీ. నీ కిచ్చిన మాటకోసం కట్టుబడి పోయాను. ఓ అమ్మగన్న బిడ్డని యీ యింటి కోడలుగా తెచ్చి ఎందుకింత అన్యాయం చేశావన్నయ్యా? నిజంచెప్పు. నీకు వంశాంకురం కావాలని ఎప్పుడూ అనిపించలేదా?

'అన్నయ్యలోని బలహీనతని క్షమించు చెల్లాయ్, నీకు నేను సమాధానం చెప్పలేను' అన్న అన్నగారి వంక శైలజ జాలిగా చూస్తోందో, కోపంగా చూస్తోందో నాకు అవగాహన కాలేదు. టేబుల్ లైటు వెలుగులో అపరాధిలా కూర్చున్న ఆయన్ని మరొకసారిచూసి నిశ్శబ్దంగా వచ్చేశాను.

గుండెల్లో విపరీతమైన పోటు. నా మనసు రాధికచుట్టూ వలయాలుగా తిరుగుతోంది. పరిపూర్ణమైన తల్లిదండ్రుల ప్రేమను పొందవలసిన రాధికా వంచితురాలు? భర్త ప్రేమకు విలువకట్ట సాధ్యం కాదని భ్రమసిపోయిన నేనా వంచితురాల్ని?

● ● ●

ప్రభాకరం డైరీ చదవటం పూర్తయింది. విసురుగా డైరీ పుచ్చుకొని మావయ్య గదిలోకి నడిచాడు ప్రభాకరం.

'మావయ్యా, ఇది చదువు' అన్నాడు ప్రభాకరం, డైరీ బల్లమీద పెడుతూ, ఎటువంటి ఆవేశచిహ్నాలు కనుపించనీకుండా.

● ఒకడు : ఈ వశంగా లాటరీలో లక్ష రూపాయలొస్తే బట్టలకొట్టు తెరిచేస్తాను.

మరొకడు : లక్ష రూపాయిలు దేనికోయ్. మారుతాళాలుంటే ఈ రాత్రే తెరిచెయ్యొచ్చు.

—యన్నార్‌స్వామి, ధర్మపూర్.

మావయ్య ఒక్కసారి (క్రొత్త) ప్రభాకరం వంక చూసి,

"ఇలా వచ్చి కూర్చో ప్రభా!" అన్నాడు. మంత్ర ముగ్ధుడిలా వెళ్ళి కూర్చున్నాడు ప్రభాకరం.

"నేనూ చదివాను ప్రభా!" అన్నాడు మావయ్య డైరీ చేతిలోకి తీసుకుని.

ప్రభాకరం స్తబ్ధుగా వుండి పోయాడు.


"అత్తయ్య చెప్పినట్లు, యిద మిత్థంగా ఎవరికి వంచన జరిగిందో చెప్పను. నాది ఒకరకమైన మన స్తత్వ మనుకుంటాను. అన్నపూర్ణ పిల్లల కోసం కలవరించి చనిపోయింది. ఈ యిల్లు అన్నపూర్ణ యిష్ట ప్రకారం కట్టిందే! నే నెంత దురదృష్ట వంతుణ్ణో, డాక్టరయి వుండీ, అన్నపూర్ణని రక్షించలేక పోయాను. అప్పట్లో నా ధ్యేయం అన్నపూర్ణకి లేని అదృష్టం రాజ్యలక్ష్మికి పట్టకూడదనే! ఆమెను నేను చేసుకోవటమే ఆమె అదృష్టం. నాకేం లేదు? నేను నా వెర్రినీ, దురదృష్టాన్ని పూడ్చుకోలేను. కాని ప్రభా ఎంతటి సత్యాన్నయినా కాలమే నిరూపిస్తుంది. రాజ్యలక్ష్మి అనురాగం నన్ను చకితుణ్ణి చేసింది ప్రభా, ఎప్పుడన్నా నిజం చెప్పేద్దా మనుకునేవాణ్ణి. కాని, కాని, ఏదో అదృశ్య శక్తి నన్ను నిశ్శబ్దంగా వుండి పోయేటట్లు చేసేది."

నిశ్చలంగా వున్న మావయ్య చూపుల్లోని అనురాగపు వెల్లువను ప్రభాకరం విస్మయంగా చూస్తూ వుండిపోయాడు.

● ● ●

ప్రభాకరం కథ చెప్పటం అయిపోయింది. నిలబడి కురుస్తున్న వర్షం కూడా ఆగిపోయింది. ప్రభాకరం మెల్లగా ప్రారంభించాడు. "భరద్వాజ్! నీ ముందు పుట్టి పెరిగిన చెల్లాయ్ రాసిన కథని నమ్మలేక పోవటానికి కారణం, ఒకే హెరిడిటీతో, ఒకే ఎన్విరాన్మెంట్‌లో పుట్టి పెరగటమే. అనుభవం తక్కువనీ, అదీగాక పెద్దవాడివిగా ఆమె భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కథని త్రోసిపారేశావ్. ఒప్పుకోవటానికి నీకు భయం. కథలోని వ్యక్తులను నిజజీవితంలో వూహిస్తే ఆమె సాంసారిక సుఖానికి ప్రతిబంధకం కావచ్చు. అదే నీ భయం. హెరిడిటీకి, ఎన్విరాన్మెంట్‌కి అందని ఏదో శక్తి మనుషుల్ని మానసికంగా మారిపోయేటట్లు చేస్తోంది. చెల్లాయ్ వూహ అందుకే నిజమైంది. నీలాంటి అన్నయ్య చేతిలో ఆమె వూహాలు రాణించవచ్చు. వస్తానిహ" ప్రభాకరం మెల్లిగా లేచి మెట్లుదిగి వెళ్ళిపోయాడు. అన్నయ్యా, నేనూ అచేతనంగా అతని వెనకనే నడిచి వీధి గుమ్మందాకా వెళ్ళాం. మున్సిపాలిటీ లైట్ల వెలుగులో చితచితలాడుతున్న తారు రోడ్డుమీద నడిచి వెళుతున్న తెల్లటిబట్టల్లోని ప్రభాకరం మసకమసగ్గా కనిపిస్తూ దూరమయ్యాడు.

□□□





హాస్యవల్లి

రాజకీయాలు, ఎలక్షన్లు, పదవులు, బిరుదులు, ఇత్యాది వ్యామోహాల్లో తల దూర్చకుండా, వంశ పారంపర్యంగా వస్తున్న కుటుంబ గౌరవం, సిరి సంపదలు పేరు ప్రతిష్ఠలు నిలుపుకుంటూ వున్న ఎక్స్ జమిందారుల్లో చంద్రశేఖర్రావుగారొకరు. ఆయన జీవిత లక్ష్యమల్లా, చనిపోయిన తన భార్యకి తాను చేసిన వాగ్దానం ప్రకారం తన యిద్దరు కూతుళ్ళను పెంచి ప్రయోజకులను చెయ్యడం. పెద్ద కూతురు పద్మ వయస్సు ఇరవై రెండు, మెడికల్ కాలేజీలో ఫైనలియర్ కొచ్చింది. రెండో అమ్మాయి శశికి పన్నెండేళ్ళు. కాన్వెంట్‌లో చదువుకుంటోంది. చంద్రశేఖర్రావుగారి స్వగ్రామం ధర్మాపురం; పిల్లల చదువులకోసం వాల్తేరు అప్‌లాండ్స్‌లో మకాం పెట్టారు.

కొత్త సీరియల్

అది జూన్ నెల. మెడికల్ కాలేజీ యింకా తెరవలేదు. అందుచేత తన ఆప్త మిత్రులు, తోటి మెడికల్ కాలేజీ విద్యార్థులు అయిన వేణు, కవి, రఘు, లిల్లీలతోటి శశిని వెంటబెట్టుకుని, తనకారులో, అరకులోయ 'మాచ్‌కండ్ ప్రోజెక్ట్' సందర్శించడానికి పద్మ బయలుదేరింది.

పద్మకి యీనలుగురూచాలా ప్రాణస్నేహితులు. నలుగురివీ నాల్గురకాల మనస్తత్వాలు. పద్మకి ముఖ్యంగా వేణు అంటే చాలా అభిమానం. అతను కాలేజీ విద్యార్థి సంఘం సెక్రటరీ. అతనిలో సహజమైన పట్టుదల, విద్యాకాంక్ష, స్నేహపాత్రత వున్నాయి. కాలేజీలో అందరూ అతన్నొక ఆదర్శ విద్యార్థిగా పరిగణిస్తారు.

రఘు, వేణూకి ప్రియమిత్రుడు. రఘు ఎప్పుడూ వేణూ అడుగుజాడల్లో మెలుగుతూవుంటాడు. చాలా సరదా అయినవాడు. స్థూలకాయం, కాస్త తిండిపోతు తనం, మెత్తని హృదయం, మొరకైన మాటలు. వీటిమూలంగా రఘు ఎక్కడవుంటే అక్కడ వేళాకోళాలు, అల్లరితోటి సందడిగా వుంటుంది. ఈ విధంగా పద్మకి ఆప్తుడు.

కవి అసలు పేరు శ్రీరామచంద్రమూర్తి. అతన్నికికవిత్వమంటేమంచి అభిరుచి. ఆంధ్రవైద్యకళాశాలసాహితీసమితికి కార్యదర్శి. అందుచేత 'కవి' అన్న పేరు సార్థకనామమైపోయింది. జీవిత మొక పెద్ద వినోదయాత్ర అనే వేదాంతి. ఆశా నిరాశలకి అతీతుడు. ఎప్పుడూ సరదాగా వుంటాడు.

లిల్లీ చాలా తెలివైనది, చురుకైనది. నిష్కల్మషమైన మనస్సు. దాపరికం లేకుండా కుండ బద్దలుకొట్టినట్టు సూటిగా సమాధానం యివ్వడం అలవాటు. మంచికీ, చెడ్డకీ ముందుకొచ్చి కలగచేసుకొనే స్వభావం. పద్మకి యీ నలుగురూ అంటే ఎంత ప్రాణమో, ఆ నలుగురికీ కూడా పద్మ అంటే అంత అభిమానమూనూ.

విందులు, వినోదాలు, వింతలు, అరకు లోయలో, ఇవే వీళ్ళకి రెండు రోజులుగా దిన చర్య. కార్లో తిరిగి వచ్చేస్తూంటే వాల్తేరు నలభై మైళ్ళు దూర ముందనగా టైరు బ'స్ట్ అయి కారాగిపోయింది. అప్పటికప్పుడే చీకటి పడుతూ, పడుతూ వుంది.

'సోదరీ సోదరులారా! రథం దిగండి. రఘూ! నా బంగారు తండ్రీ దిగరా! నువ్వేపక్క కూర్చుంటే ఆ పక్క టైరే బరస్ట్ అయిపోతుంది. వెళ్ళేటప్పుడు అటు కూర్చున్నావు. అటు టైరు పోయింది. సరే యిప్పుడు యిటు' అంటూ కారు దిగాడు వేణు.

'రఘూగార్ని మధ్యన కూర్చో బెట్టుకోవాల్సింది' అంది శశి ఆలోచన ఆలస్యంగా తట్టినందుకు విచారిస్తూ.

'అప్పుడు కారు కమాన్ కట్టలు విరిగుండేవి' అంది పద్మ పోయిన టైరు కేసి చూస్తూ, విచారిస్తూ.

'చచ్చాం! స్పేర్‌టైర్‌కూడాలేదే! శకున ఫలం ఊరికే పోతుందా? గుమ్మం దిగుతుంటే ఈ కవిగాడు ఎదురయ్యాడు.' అంటూ రఘు పుట్టెడు దుఃఖంతో కారులోంచి దిగడాని కుపక్రమించాడు.

'చాల్లే! సామాన్యుడివా, గున్నేనుగులాంటివాడివి. మధ్యన నా శకునం ఏం చేసింది. అయినా నిన్నోలారీమీద పడేయించి తీసుకు రావల్సింది. కటకటా! ఈ నట్టడివిలో మాకెట్టి యిక్కట్లు కలుగనున్నవో కదా!' అంటూ కవి దిగమాత్రం చేసే దేమిటన్నట్టుగా కార్లో నేకూర్చున్నాడు.

'నాయనా, కవీ! నీపీక పీచు

బి. వి. రమణారావు

మిఠాయిలాగ నలిపెయ్యమంటావా, నోరు మూసుకు దిగుతావా' అంటూ కళ్ళెర్ర చేశాడు రఘు.

'రఘూ అన్నమాట కొన్సెయ్యి దానికి వీల్లేదు. మనం తిరిగొచ్చేటప్పుడుకూడా కారుకి ఎదురొచ్చి పేల్చాడు కవి. ఎందుకైనా మంచిది ఇంకమీదట అయినా యీ కవిని తీసుకురావటం మానెయ్యాలి' అంది లిల్లీ రఘూని వెనకేసుకొస్తూ.

'ఇంకమీదట సంగతి తర్వాత ఆలోచిద్దాం. ఇప్పటిసంగతి చూడండి' అన్నాడు వేణు

'ఇక్కడ దగ్గర్లో ఏమైనా... ...'

'ఆఁ!... ...శ్మశానం వుంది.' కవి పూర్తిచేశాడు పద్మ అర్ధోక్తిని.

'ఐతే మిస్టర్ శకునపక్షీ! ఈ కారు మన మధ్యన పడేసుకుని యీ రాత్రంతా యిక్కడ శవజాగారం చేద్దామంటావా?' లిల్లీ కవిని అడిగింది.

'రాత్రి తెల్లవారూ అక్కర్లేదు అర్ధరాత్రివరకు చస్తే. తర్వాత మన చుట్టూ యిక్కడ చిరతపులులు జాగారం చేస్తాయి' అన్నాడు వేణు.

'ఇక్కడ నిజంగా చిరతపులులుంటాయా?' అడిగింది శశి అమాయకంగా.

'ఉన్నా అవి రఘూ వుండగా మన వరకూ రావు' ధైర్యం చెప్పాడు కవి.

'నాకు చిరతపులులు సయించవు' అన్నాడు రఘు తిండి ధోరణిలో వరాగ్గా.

అంతలోనే వేణు ఓ బాటసారిని కలుసుకు మాట్లాడి, తిరిగి వచ్చి 'సరే పదండి తోసేద్దాం' అన్నాడు.

'ఎంత దూరమని తోస్తాం. ఇంకా నలభై మైళ్ళుంది.'

'రెండు ఫర్లాంగుల దూరంలో డాక్టరు శ్రీదేవి నడుపుతున్న 'కాశీనాద్ వైద్య సదనం' వుందట. ఆవిడకి కారు కూడా వుందట. అక్కడికి చేరామంటే ఆవిడ ఏదో విధంగా సాయం చేస్తుంది'

'సరే నడుం బిగించండి నారీమణులు! సమాన హక్కులంటూ గింజుకుని ఉపన్యాసాలివ్వడం కాదు. ముందర సమానంగా కారు తొయ్యండి' అంటూ ఉద్బోధించాడు కవి

శశిని 'స్టీరింగ్ వీల్' దగ్గరకూర్చోపెట్టి, అందరూ కారు తోసుకుంటూ నెమ్మదిగా 'కాశీనాథ్ వైద్యసదనం' అనే అర్ధ వలయాకారంగల బోర్డు వున్న హాస్పటల్ ఆవరణ చేరారు. డాక్టర్ శ్రీదేవి కారు డ్రైవర్ ఎదురొచ్చి వీళ్ళను తప్పుకోమని, మరో యిద్దరు హాస్పిటల్ నౌకర్ల సహాయంతో షెడ్ వైపు తీసుకుపోయాడు.

వీళ్ళు ప్రవేశించేటప్పటికి, వెయిటింగ్ రూంలో, వెండి పిడివేసిన పొన్నుకర్ర చేత్తో పట్టుకుని, బొద్దు మీసాలు సవరించుకుంటూ ఒక పెద్ద మనిషి కూర్చున్నాడు. వీళ్ళనిచూసి సవినయంగా లేచి నిలబడి 'ఇలా దయచేసి కూర్చోండి. డాక్టర్‌గారు ఆపరేషన్ చేస్తున్నారు' అన్నాడు. ఆయనలో పల్లెటూరుకు సహజమైన మర్యాద, సంస్కారం, సంపన్న గృహస్థుని గాంభీర్యం ప్రతిబింబిస్తూ వున్నాయి. ఇవి వేణుని ఆకర్షించాయి. అందరిని ఆయనకి పరిచయం చేసి, ఆయన్ని మాటల్లోకి దింపాడు.

'ఈ విధంగా అయినా మీరంతా ఇక్కడికి రావడం చాలా సంతోషం.'

'మేమనవలసిన మాట మీరన్నారు. డాక్టర్ శ్రీదేవిగారి సంఘసేవని గూర్చి వినడమేకాని, వారిని చూసే అవకాశం యీనాడే మాకు కలిగింది. తమదీ వూరేనాండి' అన్నాడు వేణు.

'చిత్తం'

'డాక్టర్‌గారి దర్శనంకోసం వచ్చారనుకుంటాను.'

'ప్రత్యేక కారణం ఏమీలేదండి. దేవుడిగుడికి వెళ్ళినా వెళ్ళకపోయినా వీలయినప్పుడల్లా డాక్టర్‌గారి దర్శనం చేసుకోవడం యీ వూరి రైతాంగానికంతా రివాజు.'

'ఆ కనబడే శిలావిగ్రహ మెవరిదండి?' ఆవరణలోనున్న చలవరాతి విగ్రహంకేసి చూపెడుతూ అడిగేడు.

'డాక్టర్ కాశీనాథ్‌గారిది. ఆయనే శ్రీదేవిగారి భర్త. ఈ హాస్పటల్ నెలకొల్పింది వారే. గత ప్రపంచ యుద్ధంలో మేజర్‌గా పని చేసి 1952 లో మరణించారు. ఆయన మరణానంతరం యావదాస్తి వినియోగించి డాక్టర్ శ్రీదేవిగారు ఈ హాస్పటల్ నడుపుతున్నారు.'

'ఇక్కడే వుంటూ వైద్యం చేయించుకోడానికెంతమందికి వసతి వుంది?'

'ఎనభైమందికి వుందండి. దైవకృప వల్ల పంటలు చల్లగా వుంటే ఈ యేడు మరో యిరవైమందికి సరిపోయేలాగ ఒకవార్డు కట్టించాలని ఈ చుట్టుపక్కల ఐదారుగ్రామాల రైతులకి పట్టుదలగావుంది.'

'రోజుకు ఎంతమంది మందుకు వస్తారు'

'కనీసం మూడువందల మంది. అయితే మీరింత ఆరా తీస్తున్నారు కదా, మీరేం వుద్యోగం చేస్తున్నారో చెప్పారుకాదు.'

'ఇంకా ఉద్యోగం లేదండి.

● ఒకడు : 'నాకు నూరేళ్ళు ముప్ఫైరోజులు బతకాలని కోరికగా వుంది.'

ఇంకొకడు : 'పైన ఆ ముప్ఫైరోజు లెందుకూ?'

మొదటివాడు : 'ఆ నూరేళ్ళుబతికి హఠాత్తుగా చచ్చిపోతే బావుండదు, చూడు.'

...మే మందరం మెడికల్ కాలేజీ విద్యార్థులం."

"సరే మీ రంతా కాబోయే డాక్టర్లన్నమాట. అందుకే యింత విపులంగా అన్ని విషయాలూ అడిగారు. ఇంతకీ మీ పెద్ద ఆస్పత్రి ముందు యిదెంత మాత్రం లెండి."

"సంస్థయొక్క వైశాల్యం కాదు ప్రధానం. అది ప్రజల సొమ్ముతో ప్రజలకోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న సంస్థ ఈ హాస్పిటల్ ఒక్క వ్యక్తి యొక్క ఆత్మ విశ్వాసం, సేవా దీక్షలకి చిహ్నం."

"వయస్సులో చిన్నవారైనా దొడ్డ మాట శలవిచ్చారు."

అప్పుడే డాక్టర్ శ్రీదేవి ప్రవేశించింది. అందరూ సవినయంగా నిలబడి నమస్కరించారు. ఆమె వయస్సు నలభై ఐదు సంవత్సరాలుంటాయి. నెరుస్తూనెరుస్తూన్న జుట్టు, విశాలమైన నుదురు. ఎంతో జీవితానుభవాన్ని వ్యక్తపరిచే ముఖవర్చస్సు సహజమైన చిరునవ్వుతో అందర్నీ కుశల ప్రశ్నలు వేస్తూ పరిచయం చేసుకుంది. అతిథు లందరికీ ఆవిడపట్ల పూజ్యభావం ఏర్పడింది.

"మీ కొచ్చిన ప్రమాద మేమీ లేదు. మా డ్రైవర్ చాలా గట్టివాడు. స్పేర్ టైర్లు, ట్యూబులు కూడా వున్నాయి. లేకపోతే నా కారుమీద మిమ్మల్నందర్నీ పంపిస్తాను రండి, హాస్పిటల్ చూద్దురుగాని" అంటూ అందర్నీ లేవదీసింది.

"అయితే డాక్టర్‌గారూ! ఒక్క మనవి. పట్నంనుంచి యింత మంచి అతిథులు మనవూరొస్తే భోజనం చెయ్యకుండా వెళ్ళిపోనీయడం మన గ్రామానికే చిన్నతనం. రెండుగంటల సేపు ఆపండి. ఏర్పాట్లు చేసి కబురంపుతాను" అంటూ పల్లెటూరి పెద్దమనిషి సమాధానం కోసం చూడకుండా చరచరా బయటికెళ్ళిపోయాడు.

పద్మా, వేణూ ఏక కంఠంతో అదంతా అనవసరమైన శ్రమఅని, అయన్ని వారించమని శ్రీదేవిని అర్థించారు. అయితే "రాఘవరావుగారింట్లో భోజనమంటే మీ కేమిటో తెలియదు. ఆయన ఈ హాస్పిటల్ ధర్మకర్తలలో ఒకరు. ఆయనయింట్లో భోజనం చెయ్యకుండా మీరు వెళ్ళిపోతే ఎంత బాధపడతాడో మీకు తెలీదు. ఇంతకూ మీరొచ్చిన సందర్భంలో నాకు కూడా విందుకెళ్ళే అవకాశం వచ్చింది." అని శ్రీదేవి అనగానే మారు మాటాడకుండా వూరుకున్నారు. రాత్రి భోజనం సమస్యయి పోతుందేమోనని భయపడ్డ రఘూకి మాత్రం మొహం సంతోషంతో చేటంతయింది.

"బ్రదర్! ఇందాకా నీ శకునాన్ని గురించి తిట్టాను. అది మరిచిపో." అని కవితో రహస్యంగా అన్నాడు.

ఒకొక్క వార్డులో ఇరవై మంచా లున్నాయి. ఆరోగ్య శాస్త్ర రీత్యా రోగులకు కావలసిన పరికరాదులు, సదుపాయాలు ఏర్పాటు చేయబడి వున్నాయి రోగుల మన్ననలు, నమస్కారాలు అందుకుంటూ శ్రీదేవి ఆ రోగుల వ్యాధులకి మూలం, చికిత్సా విధానం మొదలయిన విషయాలు యీ విద్యార్థి బృందానికి చెబుతూ వుండగా ఎంతో ఉత్సాహంతో అన్ని వార్డులు చూశారు. ఒక్క వ్యక్తి శక్తివంచన లేకుండా పరిశ్రమిస్తూ చేస్తూన్న వైద్య సేవ చూసిన తర్వాత ఆ విద్యార్థి బృందంలో ఒక నూతన చైతన్యం కలిగింది. ముఖ్యంగా ఆనందావేశాలతో వేణు హృదయం స్పందించింది.

అందరు తిరిగి వెయిటింగ్ రూమ్‌లోకి వచ్చేటప్పటికి మరి కొందరు శ్రీదేవికోసం వచ్చి వుండటం చూసి వేణు మిత్రులందరిని బయటకి రమ్మని పిలిచాడు. కారుకూడా సిద్ధం చేశాడు డ్రైవర్. పద్మ డ్రైవర్‌కి పది రూపాయలు బహుమతి యిచ్చింది.

"ఇక్కడ మన అవసరానికి మనం వచ్చి ఈ సాయంత్రం యిక్కడ సరదాగా గడిపేసి, చాలా సంతోషమంటూ చేతులూపుగుంటూ చక్కాపోవటం ధర్మంకాదు" అన్నాడు వేణు.

"చచ్చాం! వీడికేదో పుట్టింది దుర్బుద్ధి." అన్నాడు కవి ఏ చందాలకో దారితీస్తున్నాడని గ్రహించి.

"డాక్టర్ శ్రీదేవి చేసే స్వార్థత్యాగంలో యిప్పుడు మనం చెయ్యబోయేది సహస్రాంశం కూడా వుండదు ఆవిడ సేవాదీక్షకి అభినందన చిహ్నంగా కొద్దిగా విరాళాన్ని ఈ వైద్య సదనానికిద్దాం." వేణు తన వుద్దేశాన్ని బయటపెట్టాడు.

"తప్పకుండా యిద్దాం" అందిలిల్లీ.

"నిజానికి మంచి పనులకోసం యిలా డబ్బు ఖర్చుపెట్టే అవకాశాలు తక్కువ. ఇదిగో యిది నా వంతు" అంటూ రెండు జతల బంగారు గాజులు చేతినించి తీసి యిచ్చింది పద్మ.

"నా తాహతు మీ అందరికీ తెలిసిందే. నేను పదిరూపాయలిస్తున్నాను" అంటూ వేణు జేబులోంచి నోటు తీశాడు.

"ఇందులో తాహతేమిట్రా? అందరం తలో పదియిద్దాం" అన్నాడు కవి.

"నా వంతు యిరవై" రఘూ అందిచ్చాడు.

● ఒక సైంటిస్టు: "నేను ఒక కొత్తరకం యాసిడ్‌గురించి పరిశోధన చేస్తున్నాను. అది దేన్నైనా సరే యిట్టే కరిగించేస్తుంది."

ఇంకో సైంటిస్టు: "దాన్ని మరి దేంట్లోపోసి వుంచుతారు"?

'నా వంతు ముప్పై. నా దగ్గర వున్నదంతే' అంటూ లిల్లీ పర్సు తీసింది.

'సరే మొత్తం అరవై అయిందింతవరకు. మిగిలిన నలభై మన కవి భర్తీ చేస్తాడు. బ్రదర్! త్వరగా తియ్యి పర్సు' అంటూ చెయ్యి చాపాడు వేణు

'హరి జలగా!' అంటూ రెండడుగులు వెనక్కి వేశాడు కవి. రఘూ జబ్బ పట్టుకుని ఆపి 'ఇచ్చెయ్, ఇచ్చెయ్ ఆలస్యం చేస్తే రేట్లు పెంచెయ్య గలడు.' అని కవి పర్సు లాక్కొని, నలభై లెక్కపెట్టి ఇచ్చేశాడు.

డాక్టరు శ్రీదేవి మొదట నిరాకరించినా, తర్వాత వాళ్ళ ఔదార్యానికి సంతోషించి ఆ విరాళాన్ని తీసుకుంది. తర్వాత అందరూ కలసి రాఘవరావు యింటికి విందుకు వెళ్ళేరు.

2

విశాఖపట్నంలో అది వేణు యిల్లు.

చిన్న తనంలోనే వేణు తండ్రి మరణించడంవల్ల తల్లి గంగమ్మగారే వేణుని పెంచి పెద్దవాణ్ణి చేసింది. వాళ్ళకున్న ఆస్తల్లా యీ యిల్లు, పొలీనా దరిదాపు పదిహేను వందల రూపాయలు ఆదాయం వచ్చే భూవసతి. మేడమీద ఒక పడక గది, ఒక హాలూ సరసనే డాబా, క్రింద మూడు గదులు, వరండాతోటి యిల్లు చిన్నదైనా అందంగా వుంటుంది.

ఇంటి ముందున్న అవరణ చిన్నదే కాని, వేణు స్వహస్తాలతో నాటి పెంచిన చిన్న పూలతోట యింటికి మరింత అందాన్నిస్తూంది. వేణు రెండు గులాబీ అంట్లు అప్పుడే పాతి, మూడో దానికోసం పారతో పళ్ళెం తవ్వుతూ వుండగా ఏభయ్యో పడిలో వున్న ముసలి నౌకరు మాదన్న బిందెతో నీళ్ళు తీసుగొచ్చి పోశాడు. వేణు తవ్వుతుంటే పార కున్న పట్టుకొయ్య వదులయి, పార జారి వేణు కాలుమీదపడి బొటన వేలు మధ్యగా తెగి రక్తంచిమ్మింది. పారక్కడే పారేసి, మెట్లమీద చతికిలపడి మాదన్న తెచ్చిన నీళ్ళతో కాలు కడుక్కుంటూండగా, అదేసమయానికి రఘూ, కవి వచ్చారు.

'అదేమిట్రోయ్. కాలు పట్టుకు కూర్చున్నావు. తేలు కుట్టిందా?' అంటూ పరామర్శ చేసేడు రఘు.

'తేలుకాదు. పారకుట్టింది.'

'పార కుట్టడ మేమిట్రా, కరుస్తుంది కాని' అంటూ వ్యాకరణ దోషం సరి చేశాడు కవి.

'నే వొద్దని మొత్తుకుంటున్నా నామాట వింటేకదా! నే చేస్తాను బాబూ అంటే ఒద్దు పొమ్మన్నారు' అంటూ నొచ్చుకున్నాడు మాదన్న.

'ఇంతకీ లోతెంత?'

'అరంగుళం. రఘూ మేడమీద కెళ్ళి మందులపెట్టి పట్టుకురారా. కట్టుకట్టడం నేర్పుతాను' అన్నాడు వేణు.

'పొద్దున్నే యిందుకే వచ్చాననుకున్నావా?'

'రేపు నీకు మెడ విరిగితే నేన్నీకు వైద్యంచేసి యీ ఋణం తీర్చుకుంటాలేరా?'

'ఆహా! హా! చూశావురా కవీ! వీడి ప్రేమ.'

'తొరగా వెళ్ళి పట్టుకురండి రఘు బాబూ! లోన గంట మోగుతోంది. అమ్మగారి పూజయిపోయినట్టుంది ఈ రక్తం సూస్తే కంగారు పడతారు. అబ్బా! పెద్దదెబ్బ తగిలిందే. అయ్యయ్యో! చెబితే యినిపించుకోరు కదా' అంటూ దీర్ఘాలు తీశాడు మాదన్న.

'వెధవ దెబ్బ! అదో క లెక్కా! చూడు మాదన్నా నీ హృదయం నవనీతం లాంటిది, అందుకే అలా అనిపిస్తుంది' అని సర్ది చెప్పబోయేడు కవి.

'అనిపించడ మేందయ్యా, కనబడుతుంటే. మీతో మా చెడ్డ కవిత్వం మా లోకం వచ్చిపడిందే!' అంటూ మాదన్న ఎదురు తిరిగేటప్పటికి, కవి వెర్రిమొహం వెయ్యడం, వేణు బుద్ధొచ్చిందా అన్నట్టు కవి భుజం తట్టడం ఒకేసారి జరిగాయి.

మాదన్న ఏభయ్యో పడిలో వున్నా ఇంకా ఓపిగ్గా పని పాటలు చేస్తాడు. వేణు తండ్రి వూళ్ళో హైస్కూల్లో హెడ్ మాస్టరుగా వున్నప్పుడు మాదన్నకి స్కూల్లో నౌకరీ యిప్పించాడు. మొదట్నుంచి యీ కుటుంబమంటే అమిత భక్తి విశ్వాసా లున్నవాడు. ఇప్పుడు కూడా స్కూల్లో పని చేస్తున్నా, వీలయినప్పుడల్లా ఈ యింటి కొచ్చి చేతనయిన పనులు చేసిపెడుతూ వుండటం, దానికి ప్రతిఫలంగా వేణు పండక్కి, పబ్బానికి ఏదో ముట్టచెబుతూ వుండటం పరిపాటి. వేణుని చిన్నప్పట్నించి పెంచిన అభిమానం మూలంగా కళ్ళల్లో పెట్టుకు పూజిస్తూ వుంటాడు. గంగమ్మగారు కూడా మాదన్నని కేవలం ఒక నౌకరుగా కాకుండా ఎంతో అభిమానంతో ఆదరిస్తోంది. ఆవిడ వుదయం పూజ చేసిన తర్వాత యిచ్చే తులసితీర్థం, రాత్రి చదివి వినిపించే పురాణకథలు, మాదన్న పొద్దున్నా-రాత్రి యీ యింటికి తప్పనిసరిగా రావడానికి కారణాలు దానా దీనా మాదన్నకి యీ యింట్లో ఒక విధమైన స్వతంత్రం, ఆత్మీయత ఏర్పడ్డాయి. వేణు బంధు-మిత్రు లందరూ కూడా మాదన్నని గౌరవిస్తూవుండేవారు.

రఘు, వేణు కాలు కట్టుకట్టి ఏ. టి. సీరమ్ ఇన్‌జెక్షన్ యివ్వబోతూండగా తులసీతీర్థంతో వేణుతల్లి బైటికొచ్చి రఘూని, కవిని చూసి 'ఇంకేం! శలవురోజు లూరికేపోకుండా ఆలోచించటానికిలాగుంది పొద్దున్నే వచ్చేశారు. అయ్యో! అదేమిటి! కాలుకు కట్టేమిటి? ఆ యింకన్నేమిటి?' అంటూ నిస్తపోయింది.

'మీ పుత్రరత్నం, గర్భం గా

పోనీ తనకు పెళ్ళోత్సవం చేసిన సందర్భంలో చేతనయిన సేవ చేస్తున్నాం' అంటూ విశదీకరించాడు కవి.

గంగమ్మగారు మాదన్నకి తులసి తీర్థం ఇవ్వగానే 'ముందర అబ్బాయి గారి కివ్వండి. అసలు ఇది పుచ్చుకుంటే, ఆ ఇండీషన్లూ గట్రా అక్కర్లే లేదు' అన్నాడు మాదన్న.

'కరెక్ట్. ఔషధం జాహ్నవీ తోయం అన్నారు. అహాహా! జన్మ తరించింది. ఇంతవరకూ చేసిన పాపాలు యివ్వాళతో పోయినట్టే ఇక మీదటయినా కాస్త పుణ్యం ఎకౌంట్ ఓపెన్ చెయ్యాలి' అంటూ కవి తీర్థం పుచ్చుకున్నాడు.

'నువ్వు చేసిన పాపాలు 'నైట్రిక్ ఏసిడ్' తాగినా పోవురా బ్రదర్' అన్నాడు రఘూ, వేణుకు ఇంజక్షన్ చేస్తూ.

వేణూకి తీర్థం యిచ్చి, గంగమ్మగారు రఘుతో 'చేతులు మంచివి కానట్టున్నాయి. నోరు తెరు. తీర్థం పోస్తాను' అంది.

'దొడ్డమ్మగారూ, యీ మందులూ మాకులూ ముందరెట్టుకుని యిప్పుడా తీర్థం తీసుకుని అపవిత్రం చెయ్యలేను. కాళ్ళూ చేతులు కడుక్కుని తీసుకుంటా. ఈలోగా దాంట్లో కొంచెం నిమ్మకాయరసం, పంచదార వేసి వుంచండి' అంటూ మందులుపెట్టె సద్దడం మొదలెట్టాడు రఘు.

'పొద్దున్నే నిమ్మకాయరసం ఖర్మమేమిటి. కాఫీపెట్టి యిస్తాలే ముందరిది పుచ్చుకో' అని గంగమ్మగారన గానీ 'ఓ! అలాచెప్పరేం? అతిథ్యాన్ని కూడా అడ్డమెందుకూ? ఏకంగా అవుకారాతో పోసెయ్యండి' అంటూ రెండు గుక్కల్లో తాగేశాడు రఘు.

'బద్దూఖాన్, బోండాం, తిండి పోతా, పిప్పళ్ళ బస్తా, గున్నేనుగా, రోడ్‌రోలర్...' అంటూ మొదలెట్టిన సహస్రనామాలు, కారు హారన్ వినగానే ఆపేశాడు కవి. పద్మ లోపలికి వస్తూ కవిని, రఘుని చూసి 'పొద్దున్నే యిక్కడకు చేరారే కరటకదమనకు లిద్దరూ' అంటూ చేతిలో వున్న ఆహ్వాన పత్రికలు అందరికీ అందించింది.

'ఏమిటి! ఈ యేడు నీ పుట్టిన రోజుకి బ్రహ్మాండమైన ఏర్పాట్లు జరుపుతున్నావని విన్నాం' అడిగేడు కవి.

'ఆఁ...మామూలే.'

'ఎంతమందిని పిలుస్తున్నావు?'

'అంతా మూడు వందల మందుంటారేమో. అంతే.'

'దొడ్డమ్మగారూ... నాలుగోకప్పు కాలూకు మనిషికూడా వచ్చిందండోయ్' గట్టిగా కేకేశాడు రఘు.

'ఒద్దొద్దు. లేటయిపోతుంది. ఇంకా చాలా యిళ్ళకి వెళ్ళాలి' అంది పద్మ

ఇంతలోనే వేణు తల్లి ట్రేలో నాలుగు కప్పులు కాఫీ తీసుగొచ్చి 'కారు హారన్ వినగానే మరోకప్పు కలిపేను. రా పద్మా. ఏమిటి విశేషం' అంటూ అందరికీ యిచ్చింది.

అందరూ కాఫీ తీసుకుంటూ వుండగా 'మరిచి పోయాను వేణూ. పదిగంటల రైల్లో లలిత యివ్వాళొస్తుందికదా, కాలుకు దెబ్బ తగిలించుకు కూర్చున్నావు. స్టేషన్‌కెలా వెడతావు' అని జ్ఞాపకం చేసిందితల్లి.

'నే వెళ్ళలేను. కవిని, రఘుని బతిమాలి పంపిస్తాను' అన్నాడువేణు.

'ఈ ఉపకారం చేసినందుకు రేపు మాకు కలరావస్తే సేవచేసి ఋణం తీర్చుకుంటా వనుకుంటాను' అన్నాడు రఘు.

'పోనీ వెళ్ళామే అనుకో. ఆ అమ్మాయిని ఆనమాలు కట్టడమెలాగ' అన్నాడు కవి, తప్పించుకోడానికి మార్గం ఆలోచిస్తూ.

'పద్మ కూడా వస్తుందిగా' సలహా యిచ్చాడు రఘు.

'నేనూ ఎరగను ఆ అమ్మాయిని. ఇంతకీ యిద్దరు మొగాళ్ళున్నారు. ఓ ఆడదాన్ని స్టేషన్‌లో వెతికి పట్టుకోలేరూ?'

'ఆడదాన్నా! ఆడదాని బాబుని పట్టుకుంటాం, ఆనమాలు చెబితే సరి. ఇంతకీ ఆ అమ్మాయిని నీ పుట్టిన రోజు పండక్కి పిలవ్వా?' అంటూ ముందర కాళ్ళకి బంధం వేశాడు కవి.

'మైగాడ్. అవును మరిచి పోయాను. సరే సిద్ధంగా వుండండి. గంటలో మళ్ళీ వస్తాను.' అని పద్మ వెళ్ళిపోయింది.

వీళ్ళెవరూ లలిత నిదివరకు చూడలేదు. వేణుకూడా ఐదేళ్ళక్రితం చూశాడు. ఆ అమ్మాయి వేణు తల్లికి దూరపు బంధువు. చిన్నప్పుడే తల్లిదండ్రులు పోయారు. సహజంగా తెలివైనదీ, చురుకైనదీ, స్వతంత్ర భావాలుకలదీ అవడంచేత బంధువుల ఆదరణవల్ల స్కూల్‌ఫైనల్ పరీక్ష ప్యాసై నర్సు ట్రెయినింగ్‌కి వెళ్ళింది. గంగమ్మగారికి ఆ అమ్మాయంటే పంచప్రాణాలూనూ. మధ్య మధ్య డబ్బు పంపిస్తూ, తనే స్వయంగా వెళ్ళి లలితని అప్పుడప్పుడూ చూసి వస్తూ వుండేది. నిజానికి అజ్ఞాతంగా ఆ అమ్మాయినే వేణుకిచ్చి పెళ్ళి చెయ్యాలన్న కోరిక ఆమెలో లేకపోలేదు. అయితే వేణుతో యీ ప్రస్తావన ఎప్పుడూ చెయ్యలేదు. పైగా చదువు పూర్తయితే కాని పెళ్ళిమాట తలపెట్టినా ఒప్పుకోడనే ఆవిడ ఉద్దేశం. అయితే రెండేళ్ళుగా ఉద్యోగం చేసుకుంటున్న లలితని వేణూ పెళ్ళాడినా, యిద్దరూ ఉద్యోగరీత్యా కలిగే ఎడబాట్లతో సుఖపడరేమోనన్న అనుమానంతో తాత్కాలికంగా తన కోరికని ఉపహరించుకుంది. కాని దైవికంగా లలితకి విశాఖపట్నం బదిలీ అవడంతో మళ్ళీ ఆ కోరిక చిగిర్చింది.

3

అది విశాఖపట్నం రైల్వేస్టేషన్.

పద్మ స్టేషన్ బయటకారులో నిరీక్షిస్తూవుంది. కవి రఘూ ప్లాట్‌ఫారం

మీద వున్నారు. రైలు అప్పుడే వచ్చింది. విశాఖపట్నం ఆఖరిస్టేషన్ అవటంవల్ల ప్రయాణీకులందరూ దిగిపోతున్నారు కవీ. రఘూ లలితాన్వేషణ కుపక్రమించారు.

కంటికి చలవజోడు, చేతులో సంచితో వెనక్కాల కూలీ చేత పర్సువు, పెట్టె పట్టించుకుని వస్తున్న యువతిని కవి అడ్డగించాడు.

"క్షమించండి ..."

"క్షమించేను."

"అదికాదండీ ..."

"ఏదికాదు ?"

"నేనో అమ్మాయికోసం వెదుకుతున్నాను."

"శుభం కానివ్వండి."

"మీ పేరేమిటండి ?"

"మీ కెందుకండీ ?"

"ఆ అమ్మాయి మీరేమోనని ..."

"బాగుంది వరస. అయినా మీరు వెతుకుతున్న అమ్మాయిని నేను కాను."

"నేను వెతుకుతున్న అమ్మాయి పేరు లలిత"

"చాలా మంచిపేరు, మరింక దారి కడ్డం తప్పుకుంటారా. రైల్వే పోలీసుల్ని పిలవమంటారా."

"ఎందుకులెండి మీ కా శ్రమ"

"థేంక్స్."

వెళ్ళిపోతున్న అమ్మాయివేపు రుసరుస చూసి మళ్ళీ ముందుకువెళ్ళి వెతకడం మొదలెట్టాడు. ఈసారి కవి గంగమ్మగారి దగ్గర్నుంచి తెచ్చిన ఫొటో జేబులోంచి తీసి పరీక్షగా చూసి మళ్ళీ జేబులో పెట్టేసేడు. ఫొటోలో లలితకి అప్పటికి పన్నెండేళ్ళు. కొంచెం లావుగా, రెండు జడలు వేసుకుని పుస్తకాలసంచి చేతో పట్టుకుని వున్నప్పుడు తీసిన ఫొటో. అదే సమయంలో రెండు జడలు వేసుకున్న ఓ అమ్మాయి ఎదురయ్యింది. చేతులో థెర్మోస్‌ఫ్లాస్క్, చిన్న తోలుపెట్టి వున్నాయి. అయితే ఈ అమ్మాయే అయి వుండాలని "చూడండి ... మీపేరు ..." అని కవి అంటుండగానే, ఆ అమ్మాయి జబ్బ పట్టుకుని పక్కకి లాగి ఒక ముసలాయన ఎదురయ్యి "ఏంకావాలి" అంటూ దబాయించేటప్పటికి మళ్ళీ సంజాయిషీ చెప్పే ఓర్పులేక అక్కడనుంచి నడిచిపోయాడు. వెనకనుంచి ముసలాయన "రౌడీ వెధవ" అంటూ చేసిన దీవెన వినేటప్పటికి ఒళ్ళు మండింది కవికి. ఇంక ఈ ప్రయత్నం ఆపేద్దామనే నిర్ధారణ చేసుకుంటుండగా అప్పుడే ఓ పెట్లోంచి బయటకు తొంగిచూస్తూ "కూలీ కూలీ" అని కేకేస్తున్న యువతిమీద పడింది దృష్టి. ఆమె దగ్గరకెళ్ళి సవినయంగా "మీపేరేమిటండి" అని అడిగేడు.

ఆ అమ్మాయి లేని సిగ్గు తెచ్చుకుంటూ "నా పేరు చమకం ... మరి తమ నామాక్షరాలు ..." అంది. ఇంతలోకే ఆ అమ్మాయిని తప్పించుకుని ఐదారుగురు యువతులు ఫిడేలు, తబలా మొదలయినవి అందుకుని దిగడం చూసి కవి తోక ముడిచేడు మూడోసారి "ఎవడో ఆ నాయుడు బావ!" అంటూ అందులో ఓ యువతి కంఠం, తర్వాత కోరస్‌లో అందరూ నవ్వడంతో కవికి ముచ్చెమటలు పోశాయి.

అంతట్లో ఓ పెట్టెలోంచి పరువుమట్టు అందుకుంటూ రఘు కవిని కేకేశాడు. అది విని అటు వెళ్ళబోతుండగా ఒక యువతి "క్షమించండి. దయచేసి ... ... యూ యెడ్రస్ ... ..." అని ఏదో అడగబోయింది. అప్పటికే కవి సహనం సన్నగిల్లింది. పైగా రఘు లలితని పట్టుకున్నాడన్న అసూయతో ఆ యువతిని "గెటౌట్" అని కసిరేసి స్త్రీలవల్ల తనకి కలిగిన పరాభవంపై పగ సాధించేడు. ఆ అమ్మాయి "ధన్యోస్మి" అంటూ వెళ్ళిపోయింది.

కవి వెళ్ళేటప్పటికి రఘూ పెట్టె బేడా దింపి ఆ అమ్మాయిని పలకరిస్తున్నాడు.

"రైలు చాలా రష్‌గావుంది." సామాన్లతో బయటకి వస్తూండగా అడిగేడు.

"ఇంకా రాత్రి చూడవల్సింది మా పాట్లు"

"పాపం, రాత్రి మీకునిద్దరలేదనుకుంటాను."

"ఏదో అలాగే ఒకళ్ళమీద ఒకళ్ళు ఒరుగుతూజాగారం చేశాం. ఇంతకీ మీకు చాలా శ్రమయిచ్చాను. క్షమించాలి."

"ఆ మాత్రం చెయ్యకపోతే నేను స్టేషను కొచ్చిన ప్రయోజనమేముంది."

అందరూ స్టేషన్ బయటకొచ్చేరు. కవి సామాన్లు కారులో పెట్టిస్తూవుండగా, ఆ యువతి అడ్డువచ్చి "ఏయ్ మిష్టర్. ఏమిటీ చుట్టరికం ?" అంది.

రఘూ నవ్వుతూ "భయపడకండి, ఈ కారు వేణూ పంపిందే. మేమందరం వేణూ క్లాస్‌మేట్స్ ...ఎక్కండి" అని ధైర్యం చెప్పాడు, కూలీకి డబ్బులిస్తూ.



- "నేను మొన్న బజార్లో ఒక కొత్తరకం నల్లులమందు కొన్నాను. దాన్ని నీళ్ళలో కలిపి ఒక గిన్నెలో పోసి వుంచుకుంటాను. నల్లి కనబడగానే పట్టుకుని ఆ గిన్నెలో వేస్తాను. నల్లి వెంటనే చచ్చిపోతుంది.

"నేను నల్లి కనబడగానే కాల్తో రాస్తాను. వెంటనే చచ్చి పోతుంది."

"అవును." అలాగూ చెయ్యొచ్చు అనుకో.

'వేణూ ఎవరూ! ఈ కారేమిటీ! మీ రేదో పెద్దమనుషు లను కున్నాను' అంది ఆ అమ్మాయి కళ్ళెర్ర చేస్తూ.

'మీ పేరు లలిత కాదూ...' అన్నాడు రఘు అనుమానంగా.

'భేష్!' అంటూ రిక్షా ఎక్కిందా అమ్మాయి.

రఘు పోతున్న రిక్షావైపు నిర్ఘాంత పోయి చూసేడు. కవి, రఘు భుజం మీద చెయ్యివేసి 'అంతేరా బ్రదర్. అంతా మగ జన్మెత్తినందుకు శాస్తి సమాన హక్కులకోసం మనం పోరాడే రోజు లొస్తున్నాయి... ఇంతకీ కూలీకి ఎం తిచ్చావు బ్రదర్' అంటూ పరామర్శించాడు.

ఇదంతా చూసి నవ్వుతుంటూ పద్మ 'సరే యింక కారెక్కండి. మీ లాంటి చవటల్ని నమ్ముకుని స్టేషన్‌కి రావడం నాదే బుద్ధి తక్కువ. స్టేషన్ కొచ్చినందుకు ఏడుస్తూ యింటికి పోకుండా మా స్నేహితురా లొచ్చింది' అంటూ పద్మ పక్కనే కూర్చున్న మరో యువతికేసి చూపెట్టింది. 'నాన్ సెన్స్ మేం కాదు కదా. బ్రహ్మ రుద్రాదుల తరంకాదు' అన్నాడు కవి పళ్ళు కొరుక్కుంటూ కార్లో ఎక్కుతూ.

● ● ●

వేణూ యింటిముందుకారాగింది. హారన్ విని గంగమ్మగారు ఆత్రంగా వరండా మీద కొచ్చి నిలబడింది. ఒక్కపరుగులో పద్మకూడా వచ్చిన యువతి 'అత్తయ్యా' అంటూ ఆవిడ పాదాలకేసి వంగడం, 'వచ్చావా లలితా' అంటూ ఆ అమ్మాయిని అనురాగంతో ఆవిడ కౌగలించు కోడం చూసి, కవి రఘూ నిర్ఘాంత పోయారు.

'ఆడదాన్ని వెతకడాని కెళ్ళిన పెద్ద మనిషివి, ఆ అమ్మాయి దగ్గిరకొచ్చి, పలకరిస్తే 'గెటౌట్' అంటావా!' అంటూ మందలించింది కవిని పద్మ.

'మైగాడ్! ఈ అమ్మాయా! హాతోస్మి' అన్నాడు కవి.

'ఓరి చవటా ... పరేపద, ముందర సామాన్లు కార్లోంచి దింపు' అని పురమాయించాడు రఘు.

'ఇంతకీ నువ్వెలా గేలం వేశావు' అని అడిగాడు రఘు.

'ఏముంది. కవి దగ్గిర కొచ్చినట్టే, నా దగ్గరకొచ్చి ఎడ్రస్ చూపెట్టి రిక్షామీద వెళ్ళాలా - టాక్సీమీద వెళ్ళాలా అని అడిగింది. సరే కారెక్కమన్నాను. తర్వాత కవి అవతారాన్ని వర్ణించి, సంగతంతా చెప్పింది.

● ● ●

లలిత లోపల కొచ్చి 'బావ ఇంట్లో లేడా అత్తయ్యా' అనిఅడిగింది. 'ఇందాకట్నుంచీ కిందే వుండాలి, మేడమీద కెళ్ళాడేమో చూసొస్తా' నని గంగమ్మగారు మేడ మెట్లెక్కు తున్నది. వేణు కింద హాల్లోనే మూల నున్న పడక కుర్చీమీద పడుకుని, నిశ్శబ్దంగా పేపరు చదువుతున్నట్లు నటిస్తూ యిదంతా గమనిస్తూ వున్నాడు. మూల నుండటంచేతా, పేపరు అడ్డం వుండటంచేతా లలిత గమనించకుండా పెట్టి బెడ్డింగు హాల్లో సర్దుకుంటూ వుంది.

'జ్ఞాపకం వున్నానా లలితా' అంటూ పేపర్ చాటునుంచే పలక రించెడు వేణు.

త్రుళ్ళిపడి అటుచూసి 'ఓ ఇక్కడే వున్నావా. బావా కనబడలేదే?' అంది లలిత.

'నువ్వు చూస్తేకాదూ కనబడ టానికి'

'సరే పేపరు చాటు చేసుకుని మూల నక్కి వుంటే ఎలా చూడగలను ఇంతకీ మొత్తంమీద ఈ ఐదేళ్ళ లోనూ నువ్వాట్టే మార్లేదన్నమాట.'

'మొహం చూడకుండా చెప్పేస్తు న్నావే! ఇంతకీ నువ్వే మైనా మారావా?

'లేదు. ఇంకా అలాగే వున్నాను.

'ఏరికిణి, గొనూ ...'

'అహ.'

'రెండు జడలూ'

'అంతే'

'పుస్తకాలసంచీ'

'రైట్'

'అరెరె. ఈపాటికి పెద్దమనిషి.'

'థా ...'

'ఈపాటికి పెద్ద ... మనిషిగా ఎదిగేవనుకున్నా నంటున్నాను.'

'బాగానే అనుకున్నా నంటున్నావు కాని... అకాలికి కష్టేమిటి ?'

'నువ్వు డ్రెస్సింగ్ ఎంతబాగా చేస్తావో చూదామనే దెబ్బతగిలించుకున్నాను.'

'హాస్పటల్ కి రా చూద్దువుగాని.

గంగమ్మగారు కిందకి దిగొచ్చి 'గుమ్మంలో అడుగెట్టేవో లేదో హాస్పటలని కలవరిస్తున్నావు. అసలు నీకు వంట చెయ్యడం ఏపాటివచ్చునో చూస్తాను. లోపలికినడు' అని డబాయించింది.

4

పద్మకి జీవితంలో సమస్యలు లేవు. ఆగర్భ శ్రీమంతురాలు. చాలా గారాబంగా తండ్రి పెంచేడు. సహజంగా తెలివితేటలూ, పట్టుదల వుండటంవల్ల శ్రద్ధగా చదువుకుంటూ, పరీక్షలు ప్యాసవుతూ వచ్చింది. స్నేహితులన్నా, వినోద విహారాలన్నా అభిలాష ఎక్కువ. ఏదో అవకాశం పురస్కరించుకుని తరచు మిత్రులకు విందు చెయ్యడం సరదా. తను జమీందారు బిడ్డయినా గర్వం లేదు. అందరితోటీ కలిసి మెలిసి వుంటూ స్నేహితులందరి అభిమానం చూరగొంది. ఎంత కొత్త వాళ్ళతో అయినా క్షణంలో స్నేహం చేసుకోగల విశాల హృదయం. వేణూ యింటికి చుట్టంగా వొచ్చిన లలితకి చూస్తుండగా, రెండు రోజుల్లో ప్రాణ స్నేహితురాలవడమే కాకుండా, రెండు రోజుల్నుంచి తన యింట్లోనే అతిథిగా బంధించింది, పద్మ తన జన్మదినోత్సవ సందర్భంలో;

ఆరోజు సాయంత్రంపద్మయింటికి వెళ్ళడానికి వేణూ, రఘూ, కవి బస్ స్టేడ్ దగ్గిర బస్ కోసం అరగంటనుంచి నిరీక్షిస్తున్నారు. అప్పుడేబస్ వచ్చింది. కండక్టర్ ఒక సీటు వుందన్నాడు. ఇలా యిప్పటికిది రెండో సారి.

'బ్రదర్. ఇంక బస్ కోసం చూడటం లాభంలేదు. టాక్సీ దొరకదు. రిక్షా అయితే కనీసం ఈ ఎత్తు ఎక్కడానికి గంట పడుతుంది. అంచేత కద తొక్కుతూ పదం పాడుతూ, లెఫ్ట్ రైట్ లెఫ్ట్ రైటు గతనుకుంటూ' అన్నాడు కవి నిస్పృహతో.

వేణు కవిదగ్గర ఎర్రసిరా పెన్ అందుకుని, జేబురుమ్మాలుమీద ఆ సిరా విదిపి, 'రఘూ నువ్వు కొంచెం సాహసం చెయ్యాలి. కాస్తబాధ నటించు' అంటూనే ఆ జేబురుమ్మాలు రఘూ నోటి కడ్డంగా అదిమి పెట్టేడు. అప్పుడే ఓ కారు అటు వస్తూ వుంది. డ్రైవింగ్ చేసే పెద్దమనిషి తప్ప అందులో ఎవరూ లేరు. కవి ఆ కారు చెయ్యూపి ఆపు చేశాడు. ఆయన ఏమిటి సంగతన్నట్టుగా కవి కేసి చూసేడు.

'బస్ దిగుతూ మా వాడు పేవ్ మెంట్ మీద పడ్డాడండి.'

'అరెరె! పాపం రక్తం కారుతున్నట్టుందే! అల్ రైట్, త్వరగా ఎక్కండి. హాస్పటల్ లో దింపేసి వెడతాను.'

'అప్ లాండ్స్ కి వెడుతున్నట్టున్నారు.'

'అవును. అర్జెంట్ గా వెళ్ళాలి.'

'అయితే అప్ లాండ్స్ లో థర్డ్ టర్నింగ్ లో దింపెయ్యండి. అక్కడ డాక్టర్ ప్రసాద్ క్లినిక్ వుంది. ఆయన మాకు బాగా తెలుసు' అన్నాడు వేణు.

'వెరీగుడ్. నేనూ అటే వెడుతున్నాను. త్వరగా ఎక్కండి. పాపం: రక్తం గడ్డ కట్టిందా! అయినా అదేమిటో కాని నేను చూస్తూ వుంటాను కదా, మీ కాలేజ్ స్టూడెంట్లెప్పుడు బస్ ఎక్కేటప్పుడు, దిగేటప్పుడూ కూడా సర్కస్ ఫీట్లు చేస్తూ వుంటారయ్యా' అంటూ పాఠం వర్ణించడం మొదలెట్టాడా పెద్దమనిషి.

థర్డ్ టర్నింగ్ లో కారు ఆగ్గానే థాంక్స్ చెప్పి ముగ్గురూ డాక్టర్ ప్రసాద్ క్లినిక్ కి వెళ్ళారు. ప్రసాద్ వేణుకి మూడేళ్ళు సీనియర్. వీళ్ళందరికి స్నేహితుడు. అతనుకూడా పద్మయింటి కెళ్ళడానికి ఆయత్తమయి, వీళ్ళ రాక కోసమే ఎదురుచూస్తూ వున్నాడు.

వీళ్ళను చూడగానే 'మీ కేమయినా బుద్ధుందా లేదా! ఇంత ఆలస్యంగానారావడం? అరెరె! రఘుకి రక్తమేమిటి ? ఎవర్తేనా పళ్ళూడగొట్టిందా! త్వరగా లోపలికి తగులడండి, నోరు రిపేర్ చేస్తాను. పూర్ ఫెలో. ఇవ్వాళ డిన్నర్ లో సెంచరీ కొడతా డనుకున్నాను' అంటూ ఏకథాటిని ఉపన్యాస ధోరణిలో మాట్లాడుతూ డ్రెసింగ్ టేబుల్ దగ్గిరకి వెళ్ళి అన్నీ ఆయత్తం చెయ్యడం మొదలెట్టాడు. ప్రసాద్ ప్రాక్టీస్ పెట్టి రెండేళ్ళే అయినా మంచి ప్రాక్టీస్ సంపాదించేడు. ఎప్పుడూ సరదాగా నవ్వుతూ వుండటం అతని స్వభావం. అతన్ని చూస్తేనే సగం వ్యాధి కుదిరి పోతుందంటూ వుంటారు చుట్టు ప్రక్కలవాళ్ళు.

ప్రసాద్ గదిలో రఘుకి పరిచర్య చెయ్యడానికి అన్నీ సర్దుతూవుంటే హాల్లో రఘు సబ్బుతో మొహం కడుక్కుంటూ వుంటాడు. రఘూని రమ్మని కేకెయ్యగానే వేణు ఆ జేబురుమ్మాలు తీసుకుని నోటి కడ్డంగా పెట్టుకుని వెళ్ళి స్టూల్ మీద కూర్చున్నాడు. ఇది గమనించకుండా 'అంత పళ్ళూడేలాగా పేవ్ మెంట్ మీదెలా పడ్డావురా! అయితే పేవ్ మెంట్ బద్దలయిపోయి వుంటుంది.' అంటూ డెట్టాల్ లోషన్ లో ముంచిన దూది తీసుకుని వెనక్కి తిరిగి వేణూని చూచి నిర్ఘాంత పోయేడు. గుమ్మంలోంచి, అక్కడ ఫ్లాస్క్ లోవున్న కాఫీని చెరో గ్లాసులో అప్పుడే పోసుకుని తాగుతున్న కవీ రఘు గ్లాసులు ఒకదాని కొకటి తగిలింది 'టు ది హెల్త్ ఆఫ్ ది డాక్టర్ అండ్ ది పేషెంట్' అనడంతో, అందరూ

గొల్లుమనినవ్వుకుని బయలు దేరారు, డాక్టర్ ప్రసాద్ కారులో.

పద్మయిల్లు రకరకాల అలంకరణలతో కళకళ లాడుతూవుంది. వీధి ఆవరణంతా కార్లు నిండిపోయేయి. గుమ్మంలో లలితా, లిల్లీ వచ్చే అతిథులకి పువ్వులగుత్తులిస్తూ ఆహ్వానిస్తున్నారు. పద్మ కూడా మధ్యమధ్య బయటకొచ్చి అతిథుల అభినందనాలు ఆశీర్వచనాలు అందుకుంటూ, కూడా లోపలకెళ్ళి కూర్చో పెడుతూవుంది. ప్రసాద్, వేణు, రఘూ, కవి వచ్చి వాళ్ళుతెచ్చిన పుస్తకాలు బహుమానంగా పద్మకిచ్చారు. వీళ్ళని లోపలికి తీసుకువెళ్ళ బోతుంటే, మెడికల్ కాలేజీప్రిన్సిపాల్ డాక్టర్ఆనందరావు అప్పుడే కారుదిగి అందర్ని పలకరించి వేణూ ప్రసాద్‌ల భుజాలమీదఆప్యాయంగా చేతు లేసుకుని నడుస్తూ హాల్లోకి వచ్చేటప్పటికి, పద్మ తండ్రి చంద్రశేఖర్రావుగారు ఎదురొచ్చి, ముగ్గుర్నీ ఆహ్వానించాడు.

డాక్టర్ అనందరావు చంద్రశేఖర్రావుగారికి ప్రసాద్‌ని వేణుని పరిచయం చెయ్యగానే వేణూ విస్తుపోయేడు. ఆయన ఎవరో కాదు, వీళ్ళని కార్లో ఎక్కించుకొచ్చిన పెద్దమనిషి. వేణు పద్మ తండ్రి పేరు వినడమేకాని చూడలేదు. వేణుని పరిచయం చెయ్యబోతూ "ఇతను మన పద్మ క్లాస్‌మేట్. మరి ఈ యేడు గోల్డ్‌మెడల్ కూడా న్యాయంగా యితనికే రావాలి" అన్నాడు. చంద్రశేఖర్రావుగారు, మరోసారి వేణుకేసి తేరిపారి చూసి "ఇందాక నా కార్లో వచ్చిన వాళ్ళల్లో నువ్వు వున్నావు కదూ ?" అన్నాడు.

"ఉన్నానండి"

"పాపం మీ స్నేహితుడి కెలాగుంది ?"

"నిక్షేపంలా వున్నాడండి, విందుక్కూడా వచ్చేడు".

"అదేమిటయ్యా అలా అంటావు. అంత పెద్ద దెబ్బ తగిల్తే"

"క్షమించాలి. ఇదివరకు మీ పరిచయం కలగక పోవడంవల్ల జరిగిన పొరపాటిది. వాడి కసలు దెబ్బ తగల్లేదు."

"మరి ఆ రక్తమేమిటి ?

"ఎర్రసిరా. ఇక్కడకు రావడానికి ఆలస్యమై పోతుందని అలా ఎత్తువేశాం. క్షమించాలి."

ప్రిన్సిపాల్ అడిగిన మీదట వేణు జరిగిన సంగతంతా చెప్పాడు. "మా స్టూడెంట్లంటే ఏమనుకున్నారు. దేవాంతకులు. మరి మీకు టోపీ వేసి, మీ కార్లోనే యెక్కి, మీ యింటికే విందుకొచ్చేరు" అన్నాడు ప్రిన్సిపాలు వాళ్ళని సమర్థిస్తూ.

"గొప్ప ట్రెయినింగే ఇస్తున్నారు. వీళ్ళు స్టూడెంట్లా? బందిపోట్లా, పట్టపగలు నడిరోడ్డుమీద ఎంత నాటకమాడేరు." అన్నాడు చంద్రశేఖర్రావుగారు వేణు భుజం మీద చరుస్తూ.

"ఇందులో తప్పేముందండీ. మీ అమ్మాయి పుట్టిన రోజు సందర్భంలో ఒక చిన్న నాటకం ప్రదర్శించాం" అని వేణూ అనడంతో అందరూ నవ్వుకున్నారు.

5

లలిత నర్సులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హాస్టల్లో చేరింది. పగలు డ్యూటీ వున్నప్పుడు రాత్రి, రాత్రి డ్యూటీ వున్నప్పుడు పగలూ తీరిక చేసుకుని లలిత వేణూ యింటికి రావడం పరిపాటయ్యింది. శలవురోజు వస్తే ఇక్కడే వుండేది. ఈ రాకపోకల మూలంగా లలితా వేణుల సాన్నిహిత్యం ప్రణయంగామారడానికి కాస్తేరోజులు పట్టలేదు. గంగమ్మగారుకూడా ఈ పరిణామానికి సంతోషించింది. అయినా పెళ్ళి విషయం ప్రస్తావనకింకా వ్యవధి వుందన్న ఉద్దేశంతో ఆ విషయం వేణు దగ్గరకాని, లలిత దగ్గరకాని కదపలేదు. కాని వాళ్ళ ప్రేమానురాగాలు ఎలాంటి ఆవేశానికీ దారితియ్యకుండా వెయ్యి కళ్ళతో చూస్తూవుండేది.

ఆరోజు లలిత వేణూ యింట్లోనే వుంది. ఉదయం ఏడుగంటలయినా వేణు యింకా లేవలేదు. లలిత వేణుని లేపడానికి మేడమీదికెళ్ళింది. లలిత రావడం గమనించి గుర్రుపెట్టి నిద్రపోతున్నట్టు నటించేడు. బావా బావా అని పిలిచింది. తలుపు చప్పుడు చేసింది. గడియారం తిప్పి అలారం వేణుచెవిదగ్గర మోగించింది. తలకింద నుంచి తలగడలాగింది కాని వేణు కదలలేదు. మెదలలేదు. మరింత గుర్రుపెట్టడం మొదలెట్టాడు. అది దొంగనిద్రని గ్రహించి "బావా—టాటా. నే పోతున్నా" నంటూ వెనక్కి తిరిగి నాలుగడుగు లేసింది.

వెంటనే వేణు మెళుకువ నటించి ఓసారి ఒళ్ళు విరుచుకుని లలితకేసి చూసి "ఓ! లలితా గుడ్‌మార్నింగ్" అని గోడగడియారం అప్పుడే గంటలు కొడుతుంటే గంటలు తప్పు లెఖ్ఖెడుతూ "నాలుగూ, ఐదూ, ఆరు.. అబ్బా" అన్నాడు.

"ఆరుకాదు ఏడు."

"నువ్వే యేడు. అయినా యింత ఆలస్య మయ్యేవరకూ ఎందు కూరుకున్నావు. లేపెయ్యలేకపోయావా?"

"ఇందాకట్నుంచీ నే చేస్తున్న పనే అది. ఇంతకీ నిద్రపోయేవాళ్ళని లేపొచ్చుకాని మెళుకువగా వున్న వాళ్ళని లేపడం నా తరమా ?"

"ఊఁ ... అలాంటి వాళ్ళని లేపడానికీ మార్గా లున్నాయి."

"నాకు తెలీదు."

"అయితే సరే. నువ్వు లేపే వరకూ లేవను."

"సరే చూద్దాం... టా టా!"

లలిత మేడమెట్లు దిగుతూ వుండగా "ఏడయినా వాడింకా లేవలేదూ ...లలితా వాణ్ణి లేపెయ్యి" అని గంగమ్మగారు వేసిన కేక విని పించి మళ్ళీ వేణు గదిలోకి వచ్చింది. వేణు దుప్పటి పూర్తిగా కప్పేసుకు పడుకున్నాడు. దుప్పటి లాగేసే ప్రయత్నంలో కాళ్ళవేపు దుప్పటి

పట్టుకోబోగా లలిత చేతివేళ్ళు వేణు నోట్లో యిరుక్కున్నాయి. వేణు తల యిటు మార్చి పడుకుని వుంటాడు "అబ్బ... వుండు బావా" అని పట్టు విడిపించుకోడానికి ప్రయత్నిస్తుంటే వేణు లలిత చెయ్యి పట్టుకుని తనవైపు లాగేడు. లలిత నిస్సహాయంగా వేణుమీద వాలిపోయింది.

"చూడు లలితా ... నన్నో పులిని చూసినట్టు చూస్తావేం!"

"నువ్వు పులివి కావు కనకనా"

"అలా అయితే నువ్వు నర్స్‌గా వుండటానికే పనికిరావు"

"ఏం!"

"సరిగ్గా మాట్లాడనే మాట్లాడవు. ఎక్కడ పలకరిస్తానో అన్నట్లు తప్పించుకు తిరుగుతావు."


"పోనీ ఏం మాట్లాడమంటావ్!"

"నీ వయస్సులో యింకా ఏం మాట్లాడాలో నే చెబితేనేకాని తెలియదన్నమాట."

"ఏమిటో మొదట్నుంచీ అట్టే మాట్లాడే అలవాటు లేదు."


"అసలు నర్సులంటే ఉషారుగా చలాకీగా వుంటూ వుత్సాహమైన కబుర్లు కథలు చెబుతూ రోగులకి ధైర్యం చెబుతూ వుండాలి."

"ఇంతకీ అవన్నీ రోగులతోకదా! అది నా కలవాటేలే."



"నేనూ రోగినే. ఏం రోగం లేక పోతే నువ్వొచ్చి లేపే వరకూ ఎందుకు లేవలేక పోతున్నాను చెప్పు."

ఇంతలోనే గంగమ్మగారక్కడ కొచ్చి "ఇదేం రోగంరా. ఏడు గంటలయినా లేవడం మానేశావు" అంది.



"చూశావా లలితా. నాకు రోగంటు. నేను రోగినంటే నమ్మేవా!"

"సరే లేవండి రోగిగారూ" అంటూ వేణు జబ్బ పట్టుకుని లేవదీసింది. రోగిలాగ మూలుగుతూ, లలిత నడుం చుట్టూ చెయ్యివేసి లలితని ఆనుకుని నెమ్మదిగా అడుగు లేసుకుంటూ మెట్లు దిగాడు.

(సశేషం)





సయొనారా

ప్రేమించిన చక్కటి అమ్మాయి కళ్ళల్లోంచి కురిసే చిక్కటి వెలుగులాంటి వెన్నెల జాలు వానగా కురిపిస్తున్న పున్నమి చంద్రుణ్ని, ఆ అమ్మాయిని అదుపులో పెట్టడానికి ప్రయత్నించే ముసిలి తండ్రిలాగ, నల్లటి మేఘం వొకటి నిండా కప్పేసింది. అంచేత ఆకాశంలో చంద్రుడు షేడ్ చాటున టేబుల్ లైటులా వున్నాడు. చాలని చిరువెన్నెల పరుచుకున్న భూమిమీద పల్చని చీకటి మసగ్గా వ్యాపించివుంది.

ఇప్పుడు 'రామ క్రిష్ణా మిషన్ బీచ్'లో వెన్నెల పున్నమినాటిలా లేదు. జనం "అప్పుడే చీకటి పడిన శనివారంలా లేరు. "స్కాండల్ పాయింట్" దగ్గర వేడిప్రేమ జనించే సూచనలు కూడా లేవు. ఇవేం లేక పోయినా, అక్కడ మాత్రం దేశంలో దరిద్రమంత సముద్రం వుంది. దాని పక్కనే రెండు ముచ్చటైన పొడుగాటి జడలుకూడా వున్నాయి. అవి చీకటి సముద్రమంత నల్లగా వున్నాయి. ఆ జెళ్ళకి ఒక చివర తమాషాగా ముడి వేయబడిన రెండు సిల్కు రిబ్బన్లున్నాయి. మరో చివర తమాషాగా దిక్కులు చూస్తున్న ఒక తల వుంది. ఆ తలమీద వొత్తైన జుత్తు వుంది. ఆ జుత్తు మధ్యగా బీచ్ రోడ్డులా తిన్నటి పాపిట వుంది.

కె. వివేకానందమూర్తి

పాపిడి ప్రారంభమయిన చోటుకి దిగువగా విశాలమైన నుదురువుంది. ఆ నుదుటిమధ్య దిద్దుబాటు లేకుండా తీర్చిన తిలకం బొట్టు - కాస్త క్రిందుగా, ఎడాపెడా ఒకజత పెద్ద కళ్ళు వున్నాయి. అవి యిప్పుడు ఎడాపెడా చూస్తున్నాయి. అవి రేఖ అనే నాజూకు అమ్మాయివి. అందమైన రేఖకి-బారెడు కళ్ళకి బారెడు జెళ్ళకి తోడు అందమైన చెవులు, ముక్కు, పెదాలూ, చీరె, జాకెట్టూ కూడా వున్నాయి. మూసిన పెదాల మధ్యనున్న రేఖ నోరు యిప్పుడు సన్నటి సరళరేఖలా వుంది.

కాస్సేపటి క్రితమే నిరంజనం ఆమెని వొదిలి వెళ్ళాడు కాబట్టి యిప్పుడు రేఖ వొంటరిగా చంద్ర కాంతిలేని అవాళ్టి సముద్రంలా వుంది. పున్నమి చంద్రుడు మేఘం పరదానుండి వెలికి వస్తే—వెన్నెల్లో సముద్రాన్ని బీచ్‌ని చూసి యింటికి వెళ్ళే వుద్దేశంతో చాలాసేపు అలాగే అక్కడే నిలబడింది రేఖ. కాని చంద్రుడెంతకీ బైటికి రాకుండా వున్నాడు.

వల్చని చీకటి క్రమంగా దట్టమయి వూరంతా వొళ్ళు విరిచింది.

బీచ్‌లో రేఖ తప్ప మరి మనుషులేరు. ఆమె చేతినున్న వాచ్‌లో ముళ్ళున్నా లేనట్టే వున్నాయి. అందమైన అమ్మాయి కాబట్టి రేఖకి భయం వేస్తోంది. పదో నెంబరు చివరి బస్సు యిందాకే వెళ్ళిపోయింది. నిరంజనం తోడువచ్చి యింటికి దిగబెడతా నన్నాడు. కాని తను వెన్నెల చూశాక వెళ్ళాలనుకుంది. అందుకని తనొక్కతే వెళ్ళగలనంటూ ఏదో పనుందన్న నిరంజనానికి 'గుడ్‌నైట్' చెప్పేసింది. తీరా యింతసేపు చూసినా వెన్నెల రాలేదు. చీకటి పోలేదు.

ఇంతలో చినుకులు రాలడం ప్రారంభ మయింది.

కాస్సేపటికి సన్నటి వర్షం మొదలయింది.

ఈ వాతావరణంలో రేఖకి చలి కంటే భయం ఎక్కువగా వేస్తోంది. పండు వెన్నెల్లో మనోజ్ఞతకి యిరవై ఏళ్ళుగా అలవాటు పడిన రేఖకి వర్షపు చీకట్లో భయం యిదే తొలి అనుభవం.

ఆమె యిప్పుడు ఎడా పెడా చూడ్డం మానేసి, దూరంగా లాసన్సు బే వైపున్న రెడ్‌లైట్ హౌస్‌ని తదేకంగా చూస్తోంది.

విరిగిపడే కెరటాల ధ్వని ఆమెని జడిపిస్తోంది.

విసురుగా వీచే వానగాలి ఆమెను వణికిస్తోంది.

ఇంతలో—అట్నుంచి ఏదో కారు వొకటి యిటుగా వస్తూ ఆమె నిశ్చలమైన చూపుని తనవైపు మరల్చుకొంది. హఠాత్తుగా వర్షం తగ్గిపోయి, వెన్నెల వచ్చినంత తేలిక పడింది. రేఖ. తడిసిపోయే యిసుకలో గబాగబా నడిచి రోడ్డు అంచుకి వచ్చి నిలబడింది. హెడ్‌లైట్ కాంతి

మీద పడగానే కారు ఆపమన్నట్టు చెయ్యూపింది. క్షణంలో కారు ఆమె పక్కగావచ్చి ఆగింది ఆగిన వెంటనే డ్రైవింగ్ సీట్‌లో వున్న వొక్కవ్యక్తి చురుగ్గా మాట్లాడాడు.

'ఇది పదో నెంబరు బస్సుకాదు- అంబాసిడర్ కారు'

'ప్లీజ్! హాస్పిటల్ రోడ్డువరకూ కాస్త లిఫ్టిస్తారా?' రేఖ అతన్ని ప్రాధేయ పూర్వకంగా చూసింది. అతని కళ్ళు క్షణంపాటు ఆమెని పరిశీలనగా చూశాక, అతను మౌనంగా వంగి కారు తలుపుతీసి, కూర్చోమన్నట్టు తలవూపాడు. రేఖ 'థాంక్స్' చెప్పి ఫ్రంట్‌సీట్‌లో అతని పక్కన కూర్చుంది. అతను కారు స్టార్టు చేశాడు.

స్టీరింగుమీద దృఢంగా చేతులు మోపి రోడ్డువైపు తిన్నగా చూస్తున్నాడతను. కృతజ్ఞత నిండిన మనస్సుతో రేఖ తలపక్కకి తిప్పింది. అతని చెంపలు కనిపించాయి - వాటి బిగి పాతికేళ్ళ అతని వయస్సుని సుమారుగా సూచిస్తోంది.

అలాగే చూస్తూ అతను అడిగాడు— 'నర్సేనిటి మీరు?'

'కాదు. మెడికల్ స్టూడెంటుని-' చీరకొంగుతో తడిముఖాన్ని తుడుచుకుంటూ అంది రేఖ.

'ఏమిటి మీ పేరు?'

'రేఖ.'

'మీకు అందమేగాని ఆలోచన లేనట్టుంది.'

రేఖ మాట్లాడలేదు. చెవిరింగుల్ని నుదుటిమీది ముంగురుల్ని సరిచేసుకొంటోంది.

'నాకేం నచ్చలేదు- ఇలా రాత్రి పూట వొక్కరూ వర్షంలో జనంలేని బీచ్‌లో వొంటరిమగాడి కారాపి ఎక్కడం, ఎంత ధైర్యం! ఇందుకేనేమో ఆడవాళ్ళలో ధైర్యం బాగుండదని చెప్పేడు మావయ్య!'

ఆమె వణికింది. అతనామెకేసి చూశాడు.

'మీరు చలికి వణకలేదని నాకు తెలుసు. ధైర్యం బాగుండదన్నానని వొంట్లోకి భయం తెచ్చుకుంటున్నారులా వుంది. అయినా యిప్పుడు భయపడాల్సింది నేను. వర్షపు రాత్రి తొమ్మిది దాటాక వొంటరిగా పోయే వాడ్ని ఆపుచేసి కూడా పడ్డారు.'

- ఒకావిడ స్నేహితురాలితో:- 'అదేమిటమ్మా, మా పక్కింటావిడ అస్తమానం మొగుణ్ణి సాధిస్తూనే వుంటుంది! పోని ఇంట్లో ఏదో ఏడుస్తుందనుకోవచ్చు! ఊళ్ళో వాళ్ళందరి దగ్గరికి వెళ్ళి మొగుణ్ణి తిట్టి పోస్తుంది. తప్పుకాదూ? నేను చూడు; మా ఆయనంత చవట దద్దమ్మ ఇంకోడులేడు. అయినా బయటెక్కడన్నా ఆ మాట చెప్పుకుంటున్నానా?'

మీ రివ్వు దేమైనా చేస్తే నేనేం చెయ్యగలను?'

'క్షమించండి! అలా అర్థం చేసుకోకండి దయచేసి! ఇందాకటి వరకూ మా ఫ్రెండూ నేనూ కలిసి కబుర్లు చెప్పుకున్నాం. వెన్నెలవస్తే కాస్సేపు కూర్చుని పోవచ్చు గదా అని వొక్కతెనూ వుండిపోయాను. వెన్నెలకి బదులు వర్షం వచ్చింది.'

'అంత ఇష్టమా మీకు వెన్నెల?' రేఖ ముఖంవేపు చిరునవ్వుతో చూస్తూ అన్నాడు. బదులుగా ఆమె కళ్ళతో నవ్వి అవునన్నట్లు తల పంకించింది.

'ఎలా వుంటుందేమిటి మీకు వెన్నెల?'

అతని చిలిపితనం ఆమె నాకర్షించింది.

'అంటే?'

'చల్లగానా?—వేడిగానా?'

'చలీవేడీ ఏమిటీ? — హాయిగా వుంటుంది వెన్నెల.'

'అయితే మీకు వెన్నెల గురించి ఏమీ తెలియ దన్నమాట.'

'మీకు తెలుసేమిటి?'

'ఓ!—'

'అయితే చెప్పండి!'

'అందమైనఅమ్మాయిలతో వెన్నెల గురించి మాట్లాడకూడదు.'

'మాట్లాడితే—'

'మాట్లాడితే దాన్ని 'ప్రేమ' అంటారు—'

చటుక్కున ఆమె అతన్ని కోపంగా చూసింది. అతను గ్రహించాడు.

'కోప్పడకండి మరి. నా కారులో కూర్చున్నారు కనుక కాస్త ఫ్రీగా మాట్లాడుతున్నానంతే! మీకు ఇబ్బందిగా వుంటే—'

'వుంటే?—'

'కారు ఆపుచేస్తాను దిగిపోదురు గాని.'

ఈ జవాబుతో రేఖకి వుడుకుమోత్తనం వచ్చింది.

'అయితే ఆపండి దిగిపోతాను!'

వెంటనే అతను కారు ఆపు చేశాడు. ఇది వూహించని రేఖ తత్తరపడింది.

'ఆపాను, దిగిపోతారా?'

ఆమె సంశయిస్తూ అంది 'దిగిపోతాను'.

'కాదు. దిగి తడిసిపోతారు. పైన వున్నది వెన్నెలకాదు. వర్షం.'

'నే నెలాపోతే మీకేం? కారుందిగా మీకు. హాయిగా తడవకుండా వెళ్ళండి.'

'తడిస్తే చలేసి రొంపపడుతుంది. అలా వుడుక్కుంటే వేడెక్కరు.'

ఆమె తలుపు తెరవబోయింది.

'పే చెయ్యకుండా దిగిపోడం న్యాయంకాదు.'

ఆమె వులిక్కిపడింది. 'టాక్సీనా యిది. అయితే నేను దిగను. ఇంటి దగ్గరే డబ్బు అన్నీ పే చేస్తాను. టాక్సీ డ్రైవరు తన్ను అంతలోకువ కట్టి మాట్లాడతాడా అని కోపంతో తలించిపోతూ అంది రేఖ. అతను కారు కదలించాడు.

'పర్సు మరిచి పోయారేమిటి?'

'కాదు. ఏం మరచిపోయానో యింటిదగ్గరే చెబుతాను.'

'అదీ మరిచి పోయినట్టున్నారు. కాస్త జ్ఞాపకం చేసుకోండి - ఏం మరిచిపోయారు?'

'షటప్!'

'షటప్పా?'

'అతిగా మాట్లాడితే మీ యజమానితోచెప్పి పనిలోంచి డిస్మిస్ చేయిస్తాను.'

'అయితే చెప్పండి. నేనే దీనికి యజమానిని.'

'మిస్టర్! జాగర్త. డ్రైవింగ్ లైసెన్సు పీకించెయ్యగలను.'

'సారీ! నాకులేదు. మీరు పొరబడుతున్నారు. ఇది టాక్సీకాదు.'

'పే చెయ్యమనడానికి లేనిసిగ్గు టాక్సీఅని చెప్పుకుంటే వచ్చిందికాబోలు.'

'ఇది మీ రెండో పొరపాటు. నేను పే చెయ్యమన్నది డబ్బు కాదు థాంక్స్.'

అతని మాటకారితనం, చొరవ ఆమెకాశ్చర్యాన్ని కలిగించాయి. అతను పెదాలు విరిచి చిరునవ్వు తయారు చేయడం చూడగానే కోపమంతా పోయి ఆమెకు వెన్నెలంత హాయి కలిగింది.

నొచ్చుకుంటూ మెల్లగా అంది. 'సారీ! నాకు ఎలా బిహేవ్ చెయ్యాలో తెలీదు. ఏమీ అనుకోకండి!'

'ఇప్పుడేమీ అనుకోలేదుగానీ, యిందాక మాత్రం మీరు కారెక్కుప్పుడే అనుకున్నాను — మీకు 'బిహేవియర్' తెలియదని'

ఆమె ఆశ్చర్యంగా చూసింది అద్దంలోంచి వర్షం వెలిసిపోవడం కనబడింది.

'మీ పేరు తెలుసుకోవచ్చా?' అడిగింది.

'చిన్నా.'

'ముద్దు పేరా?'

'ఎవరికి?'

'మీ వాళ్ళకి.'

'మా వాళ్ళంటే?'

'అమ్మా, నాన్నా.'

'వాళ్ళు నాకు లేరు.'

'సారీ!' రేఖ మనస్సు చివుక్కుమంది.

కాస్సేపు యిద్దరి మధ్యా నిశ్శబ్దం నిలిచాక రేఖే మాట్లాడింది.

'ఏం చేస్తున్నారు మీరు?'

'కనిపించడంలా—డ్రైవ్ చేస్తున్నాను.'

'అది కాదండీ—వుద్యోగం!'

'వుద్యోగమా! అది చేస్తే ఇలా వొంటరి అమ్మాయిలకి లిఫ్ట్ లివ్వను. ప్రస్తుతం నేనూ మీ లాగే స్టూడెం

ముని. ఇక్కడే యమ్మెస్సీ చదువుతున్నాను."

"ఇంక ఆపేసెయండి!"

"చదువా! కారా?"

"కారేలెండి. అదుగో ఆ లాండ్రీ షాపు దగ్గర ఆపండి. మా యిల్లు వచ్చేసింది."

చిన్నా కారు ఆపాడు. రేఖ దిగి ఎంతో కృతజ్ఞతా భావంతో అంది. "వెరీ మెనీ థాంక్సండీ! వీలు చూసుకుని ఎప్పుడేనా వో సారి మా యింటికి రండి!"

"అలాగే వస్తానుసరి. గుడ్‌నైట్" అంటూ కారు స్టార్ట్ చేశాడు చీకట్లో అది టార్పెడోలా ముందుకి దూసుకుపోయింది సరదాలు వులకించిన మనస్సుతో రేఖ గేటు వైపు నడిచింది.

• • •

ఖాళీ చేసిన కప్పు టీపాయ్‌మీద పెడుతూ అన్నాడు చిన్నా- "చాలా బాగుంది!"

"కాఫీయేనా?" రేఖ అడిగింది.

"కాదు - యిలా కాఫీ త్రాగడం-" అన్నాడు సమాధానంగా కళ్ళతో నవ్వింది. ఇంకా సిప్ చేస్తున్న రేఖ. చిన్నా ఆమె పెదాల్నీ, కప్పు అంచుని అవి స్పృశించే తీరునీ, చూస్తున్నాడు. తనా కప్పుకి అంచునైతే ఎంత బాగుణ్ణు?- అని ఆలోచిస్తున్నాడు.

కాఫీ ముగించి లేచి రేఖ పిట్ట గోడవైపు నడుస్తూ అంది- "లేచిరండి! ఇక్కడ్నుంచి మంచి వ్యూ కనిపిస్తుంది" ఆలోచనమాని చిన్నాకూడా పిట్ట గోడవైపు నడిచాడు.

"చూశారా? సాయంత్రం వెలుగులో సముద్రం ఎంత బాగుందో?"

"చీకట్లో యింకా బాగుంటుంది."

"బలేవారే - చీకట్లో కనిపిస్తుందేవిటి?"

"కనిపించదు కాబట్టే బాగుంటుంది నాకు"

"అదేవిటి?"

"సముద్రమంటే నాకు భయం."

"మిమ్మల్ని చూస్తే నవ్వొస్తోంది!" పళ్ళు బిగిస్తే కళ్ళు నవ్వేయి.

"అవును పాపాయి ఏడుపుకీ ఆడదాని నవ్వుకీ వేళాపాళా వుండదుట"

రేఖ గలాగలా నవ్వి, అతన్ని పసివాడిలా చూసి అడిగింది - "అయితే తమకి సముద్రమంటే ఎందుకో భయం మరి?"

"మా నాన్నగారు సముద్రస్నానం చేస్తూ మునిగి చనిపోయారు." నిర్లిప్తంగా జవాబిచ్చాడు చిన్నా. దాంతో ఆమె హఠాత్తుగా నవ్వు మరిచిపోయింది, ఆశ్చర్యపోయింది. అతనికి దగ్గరగా వచ్చి జాలిగా అంది.

"సారీ చిన్నా!"

కాస్సేపు యిద్దరూ మౌనంగా వుండిపోయారు. తర్వాత అతను యిటుగా తిరిగిచూస్తూ మాట్లాడాడు-

"సముద్రంకంటే ఆ కొండమీద హాస్పిటల్ వ్యూ నాకు చాలా బాగుంది!"



"మీకు బాగానే వుంటుంది. రోజూ చదువుకోసం ఆ ఎత్తు ఎక్కి దిగలేక ఆయాసం వస్తుంది ఎలాంటి చోట కట్టారో చూడండి! ఇంకెక్కడా చోటు దొరకనట్టు—"

"దానికేం?—ఎత్తుగా, చక్కగా, కైలాసంలా వుంది. బాగా ఆలోచించే కట్టారు. ఒకవేళ ఎప్పుడేనా సముద్రం పొంగితే మా నాన్నగార్ని మింగినట్టు, అది రోగుల్ని మింగలేదు."

వాళ్ళని సముద్రం మింగదు;

...పని చేసేందుకు రోగాలున్నాయి వాళ్ళకి."

"తప్పు! డాక్టర్లున్నారు అనాలి."

"మీదే తప్పు!—వాళ్ళు మింగేది రోగుల్ని కాదు రోగాల్ని."

"మరి వాళ్ళని మింగేదెవరు?"

"ఓర్పు. కాని నేర్పుతో దాన్ని స్వాధీనం చేసుకుంటే మంచి డాక్టరయ్యే అవకాశం వుంది."

"అయితే మంచి డాక్టరయ్యే అర్హతకి వొక అదే లక్షణం సంపాదించాలన్నమాట."

ఈ మాటకి రేఖ తెలివిగా ఏదో బదులు చెప్పబోయేంతలో, చిన్నా తన చేతి వాచీ చూసుకుని త్వరపడ్డాడు. "నే వెంటనే యింటికి చేరాలి. మావయ్య ఎదురుచూస్తూ వుంటాడు - వస్తాను మరి" అంటూ కదలబోయాడు.

"ఇంకా ఏడేనా అవలేదు. అప్పుడే యింటికి వెళ్ళి ఏం చేస్తారు?"

"అలా కుదరదు. పంక్చువాలిటీ లేకపోతే మావయ్య వూరుకోడు. ఆయన కాలంతోపాటు నడుస్తాడు. ఇవాళ 6-45 కల్లా యిల్లు చేరకపోతే మావయ్య ప్రవర్తన ఎలా వుంటుందో నాకు తెలుసు."

"మీ మావయ్యంటే అంత భయం వుందా?"

"భయం కాదు-గౌరవం! భక్తి! ఆయనక్కూడా నేనంటే వల్లమాలిన అభిమానం. అందుకే సంసారాన్నంతా హైదరాబాదులోనే విడిచిపెట్టి, నాకోసం వొక్కడూ యింత దూరం వచ్చేసి, నాతోపాటే వుంటూ నన్ను చదివిస్తున్నాడిక్కడ. నిజంగా నాకు ప్రపంచంలో మనస్సుకు మావయ్యంత దగ్గరపడ్డ వ్యక్తి యింకెవ్వరూ లేరు. ఆలోచించిచూస్తే మావయ్యలో ఏదో ఒక తెలియని ఆకర్షణ వుందనిపిస్తుంది.

"చిత్రమైన మనిషిలా వున్నారే మీ మావయ్య!"

"అవును, నిజానికి మావయ్య చిత్రమైన మనిషి అని ఒప్పుకు తీరాలి. 'ఎస్టానమర్' పని చేసి రిటైరయిపోయినా ఆయనలో యింకా ఆ ఛాయలు మిగిలిపోయాయి. సూర్యుణ్ణి, నక్షత్రాల్ని పదేపదే గమనించి కాలాన్ని కాగితాలమీద పరుస్తాడు. ఎప్పుడూ ఏవో రకరకాల గీతలు గీస్తాడు. ఏవేవో మీటర్లని పరిశీలిస్తూ ఆలోచిస్తాడు. రోజా కాలంతో అలా కుస్తీ పడుతూ వుంటాడు. వొక్క మాటలో చెప్పాలంటే మావయ్యని 'కాలానికి బానిస' అనాల్సొస్తుంది. అసలు ఆయన కాలాన్ని కొలుస్తాడు గడియారాన్ని కాదు - భక్తుడిలా, ఆయనకు కాలమే 'దైవం' మావయ్య చర్యల్లో మరీ విచిత్రమనిపించే దొకటుంది - ప్రతి వుదయం ఆయన తన డ్రాయింగు రూములో టేబులుమీదున్న 'బిగ్ బెన్' టైంపీసుని అనురాగంతో ముద్దు పెట్టుకుంటాడు! భక్తితో ఆరాధిస్తాడు! అలాగని మావయ్యకి పిచ్చి వుందనుకునేరు. అసలు నన్నడిగితే మావయ్య కాలం అంశంతో పుట్టాడంటాను." మళ్ళీ చేతి వాచీ చూసుకున్నాడు. "మాటల్లో మరిచిపోయాను. ఇక క్షణం ఆలస్యంచేస్తే లాభంలేదు. వెళ్తానుమరి!" అతను కదిలాడు. "అన్నట్టు వచ్చే శనివారం సాయంత్రం అయిదింటికల్లా సిద్ధంగా వుండాలి మీరు. మా యింటికితీసుకు వెళ్ళి మావయ్యని మీకు పరిచయం చేస్తాను. మర్చిపోకండి! వస్తానూ!" అంటూ మెట్లుదిగాడు. రేఖ అతన్ని కారుదాకా సాగనంపింది. లోపలికి నడిచే రేఖ ముఖంలో కాంతిరేఖలు, హృదయంలో సంతోష రేఖలు పుజ్జ్వలంగా ప్రజ్జ్వరిల్లేయి.

విచిత్రమైన యీ పరిచయానికి, ఆమెలో అంబరమంత సంబరం కదిలింది. మంచిచెడ్డలు తెలియనివ్యక్తితో ఆమె యిలా కలుపుగోలు తనంతో మసలడం, మాట్లాడ్డం మొదలైనవి యిప్పటివరకూ సినిమాల్లోలాగ అనిపించినా - రేఖ విషయంలో మాత్రం యిది పరిమితి దాటడం కాదు. దుష్ప్రవర్తన అంతకన్నా కాదు. ఎందుకంటే రేఖ స్వతహాగా 'అతి మంచి అమ్మాయి. చెవులకి రింగులు పెడుతుంది. మంచి చీరె, జాకెట్టూ ధరిస్తుంది. పమిట సరిగ్గా వేసుకుంటుంది. కల్మషం లేకుండా అందరితోనూ సరదాగా కబుర్లాడుతుంది. చిన్నాకి లాగా ఎవరికేనా చనువిస్తుంది. కాఫీ కూడా ఇస్తుంది. నిరంజనానికయితే హృదయంకూడా యిచ్చింది. పైగా ఆమె ఒంటరిగా అక్కడికీ, యిక్కడికీ తిరగదు. సాధారణంగా నిరంజనం తోడు వుంటాడు. కాపోతే తెగ మాట్లాడేసే వొక దురలవాటు మాత్రం

- ఇద్దరు స్నేహితులు రెండేళ్ళ తరవాత కలుసుకున్నారు.

ఒకడు : "ఏమోయ్. ఈ మధ్య బాగా డబ్బు సంపాయిస్తున్నావుటగా?"

రెండోవాడు : "అవునోయ్. లాటరీలో డబ్బొచ్చింది. దాంతో వ్యాపారం మొదలెట్టాను."

మొదటివాడు : "అయినా, నీలో అట్టే మార్పు రాలేదే?"

రెండోవాడు : "రాకేం? ఇదివరకు నే నేది మాట్లాడినా వినే వాళ్ళకి చిరాగ్గా వుండేది. ఇప్పుడు నేను మాట్లాడితే చాలు, హాస్యమైపోతోంది. ఇదివరకు నేను నోటికొచ్చినట్టు పేలేవాణ్ణి. ఇప్పుడు నేను కుండ బద్దలు కొట్టినట్టు నిర్మొగమాటంగా మాట్లాడుతున్నాను."

రేఖకి వున్నదని నిరంజనం తరచూ అనుకుంటూ వుంటాడు.

రేఖ చదివే ఆ మెడికల్ కాలేజీలోనే నిరంజనం కూడా స్టూడెంటు. రేఖకి ప్రేమంటే ఎంత యిష్టమో, సరదా కబుర్లంటే అంత యిష్టం. కనుక ఆమె చిన్నాతో పరిచయాన్ని, నిరంజనంతో ప్రేమలాగా గట్టిగా పెంచుకోదలిచింది.

రేఖ గదిలోకి అడుగు పెట్టగానే, ఆమెకోసం ఎదురు చూపులు చూసి చూసి విసిగెత్తిపోయి ఈజీ ఛైర్‌లో అనీజీగా కూర్చున్న నిరంజనం కన్పించాడు. ఎదురుగ్గా గ్రీకు దేవతలా నిలబడివున్న రేఖని చూడగానే నిరంజనానికి ఎప్పటిలాగే మతిపోయింది. అప్పుడామె అమృతాంజనం రాసినట్టు నిరంజనం నుదుటిమీద తన చేతుల్తో ప్రేమగా నిమిరింది.

● ● ●

రెండ్రోజులకల్లా శనివారం సాయంత్రం రానే వచ్చింది. కాని, వస్తానన్న ప్రకారం చిన్నా రానేలేదు. తెగని నిరీక్షతో అవస్థ పడుతున్న రేఖ మాత్రం అతని రాక కోసం పడిగాపులు పడుతూ, బాల్కనీ పిట్టగోడ నానుకుని అలాగే వుండిపోయింది. కాని ఆ సాయంత్రం అలాగే వుండిపోలేదు. కాస్సేపటికి సాయంత్రాన్ని తంమేస్తూ చీకటి వచ్చింది. చీకటితో పాటు రేఖకి విసుగుదల వచ్చింది. అలా వచ్చిన విసుగుదల మూడ్రోజుల వరకూ పోలేదు. చివరకు మూడో రోజు సాయంత్రం విసుగుతో విసిగెత్తిపోయాక, ఆమె కంటికి దూరంగా రోడ్డుమీద తన యింటివేపుగా నడిచి వస్తున్న చిన్నా కనిపించాడు వెంటనే స్నేహంలో బలం శరీరమంతా పాకింది ఒక్క వుదుటున ఆమె మెట్లవేపు పరిగెట్టింది క్షణంలో మేడదిగి క్రిందికివచ్చి అతన్ని కారిడార్‌లో కలిసింది. తీరా అతనితో ఏదో మాట్లాడబోయేసరికి ఆమెకి కోపం జ్ఞాపకానికొచ్చింది. వెంటనే ముఖంలో లేని విముఖత తెచ్చిపెట్టుకుని వెనక్కి తిరిగి చకచకా మేడెక్కేసింది రేఖ చేష్టకి చిన్నా చిన్నగా నవ్వుకుని ఆమెను అనుసరించాడు.

పిట్టగోడ అంచుమీద మోచేతులు మోపి దూరంగా చీకటిలోకి చూస్తూ భావాల్ని దాచుకునే ప్రయత్నం చేస్తున్న రేఖ భుజం మీద చిన్నా చెయ్యి పడేసరికి గిరుక్కున తలతిప్పి అతని ముఖంలోకి కోపంగా చూసింది. చిన్నా ముఖం చిన్నబోయి వుంది. అతని రెండు కళ్ళు దీనంగా చూస్తున్నాయి. అతనిలో యిప్పుడు పాత గంభీరత లేదు. చీకటి మూలంగా యీ భావాల్ని ఆమె గుర్తించలేకపోయింది. "కారులో రాలేదేం ?" అని అడగాలని మనస్సులోవున్నా తనువంతా ప్రవహిస్తున్న కోపం రేఖని మరోలా మాట్లాడించింది.

"మీరు చెప్పిన శనివారంమూడు రోజుల క్రితమే వెళ్ళిపోయింది. కాఫీ

యీ పాటికి బాగా చల్లారిపోయి వుంటుంది. నేను రాదల్చుకోలేదు."

చిన్నా చిన్నబాధ నవ్వొకటి విసిరాడు. కాని అతని చుట్టూరా యింకా చీకటే కాబట్టి, అ నవ్వు కిప్పుడు ప్రయోజనం లేక పోయింది.

"క్షమంటే గౌరవం మీ మావయ్యకి, మీకే కాదు. నాకూ వుంది. నేను రాను."

"థాంక్స్ ! వస్తానంటారేమోనని భయపడ్డాను. నాకు శ్రమతప్పించారు"

అతను పిట్టగోడదారే జూకా మల్లెతీగె వేపు నడిచాడు. ఇప్పుడు లోపలి గదిలోంచి వచ్చే దీపపుకాంతి అతని ముఖంమీద పడింది. కట్టలు తెగిన కోపంతో విసురుగా బదులు చెప్పబోయిన రేఖ వొక్కసారిగా చిన్నా ముఖాన్ని దీపం వెలుగులో చూడగానే నివ్వెరబోయింది. సరదా, చురుకుదనం హరించిపోయిన చిన్నా ముఖంలో వున్న భావాల్ని సన్నసన్నగా గ్రహించగానే ఖిన్నురాలైంది. అలా కొత్తగా కనిపించే చిన్నా ముఖాన్ని చూసి తత్తరపడిన రేఖ మెల్లగా దగ్గరికివచ్చి అంది: "ఏం జరిగింది ?"

"అనుకున్నది జరగలేదు. మీకు నేనిప్పుడు చెప్పగలిగిందల్లా వొక్కటే; క్షమాపణ !"

"ఏమిటా జరగనిది ?"

"శనివారం సాయంత్రం మీరూ, నేనూ, మావయ్యా కలిసి కాఫీ త్రాగుతూ కబుర్లు చెప్పుకోవటం." వ్యగ్రంగా అన్నాడు.

"ఇంతకీ ఏం జరిగింది ?"

"మీకి రెండు ప్రశ్నలే వచ్చు ననుకుంటాను"

"ముందు జరిగిందేదో చెప్పండీ !—"

"రెండు రోజులుగా రాత్రీ, పగలూ కష్టపడి ఆలోచించినా, మీ యీ ప్రశ్నకి సమాధానాన్ని సిద్ధం చేసుకోలేక పోయాను — నేను చెప్పలేను." అతని గొంతు వణికింది.

"దయచేసి త్వరగా జరిగిన విషయం చెప్పండీ!" ఆమె ప్రార్థేయపడ్డంలో కూడా కంగారు వుంది.

అతను తలతిప్పి ఆమె కేసి చూశాడు.

"క్షైంపీసు పోయింది ఘోరం జరిగిపోయింది." అతనిలో కరిగిపోయిన గంభీరత అంతా కన్నీరై కట్టలుతెగి ప్రవహించింది.

చిన్నా బుజంమీదికి తల వార్చుకుని నిశ్శబ్దంగా లోలోపలే గుండె పగిలేలా ఏడుస్తున్నాడు. రేఖకి జరిగేదంతా అగమ్య గోచరమైంది. అసలు విషయం చెప్పలేక చిన్నా ఎందుకిలా పసివాడిలా ఏడుస్తున్నాడో ఆమెకి అర్థం కాలేదు. అయినా అతని పరిస్థితికి జాలివేసింది. నిశ్శబ్దం ఆసరాతో రెండు క్షణాలు కష్టపడి, అతను ఏడుపు నిలదొక్కుకున్నాక, మళ్ళీ పాత ప్రశ్నే అడిగింది. "ఏం జరిగింది ?"

"మావయ్య చచ్చిపోయాడు." అతను నిశ్చలంగా జవాబిచ్చేడు. ఇప్పుడతను ఏడవకుండా ఎందుకో నిశ్శబ్దంగా వున్నాడు — ఒకవేళ గుండె పగిలే రోదనలో కన్నీళ్ళన్నీ ఖర్చయిపోయాక ఏర్పడిన నిశ్శబ్దమేమో అది.

ఊహించని అతని సమాధానం విన్నాక చలించిపోయిన రేఖ వణికే పెదాల్తో అతి కష్టంమీద 'ఎలా పోయారు?' అని మాత్రం అనగలిగింది.

కోల్పోయిన గంభీరతని కూడదీసుకుంటున్నట్లు చిన్నా మాట్లాడాడు—

"కొన్ని నిజాలు తల్చుకుంటే నిజంగా నవ్వొస్తుంది ఆలోచిస్తే వాటిలో మావయ్య పోవడం కూడా వొకటేమో ననిపిస్తోంది. అసలు చనిపోవడానికి ముందు ఆయన ప్రవర్తన ఎంతో వింతగా తోచింది నాకు. ఆ రోజు మీతో కాఫీ తాగి యింటికి వెళ్ళేసరికి దేనికోసమో యిల్లంతా కంగారుగా వెదుకుతూ కనిపించాడు మావయ్య. ఏమిటని అడిగితే రోజూ తను ఆరాధించే బిగ్‌బెన్ టైంపీసు కనిపించడం లేదన్నాడు. నేను చూశానేమోనని అడిగాడు. నేను చూడలేదు. అమాటే చెప్పాను. అయినా – ఆ గడియారం మావయ్య ఆరో ప్రాణమని నాకు తెలుసుననీ, నేను దాన్ని తాకడానికేనా సాహసించననీ ఆయనకి తెలును. అప్పుడప్పుడు క్లబ్బులకి, మీటింగులకి గనక వెడితే దాన్ని కూడా తనతోబాటే తీసుకు వెళ్తాడు. అదంటే ఆయన కంత ప్రాణం. దాని కోసం యిద్దరం రెండురోజులిల్లంతా వెదికినా అంతుచిక్కలేదు. చివరికి ఆ గడియారం పోయిందని నిర్ధారణ చేసుకున్నాక మావయ్య ఎంతగానో దిగాలు పడిపోయాడు. నాకు అలాగ మావయ్యని చూసేసరికి మొదటిసారిగా ఆయనమీద జాలివేసింది. చివరికాయన – 'ఒరే చిన్నా! నా టైంపీసు పోయిందిరా! నా సర్వస్వం పోయిందిరా!'– అని, బెంగపెట్టుకున్న చంటిపిల్లాడిలా బావురుమని ఏడిచాడు. ఆ క్షణం మావయ్యపడ్డ బాధ ఎంతటిదో నాకు తెలును. ఇంగ్లండులో 'బిగ్‌బెన్' కంపెనీ అంతా సొంతం చేసిపెట్టినా, స్విట్జర్లాండంతా రాసిచ్చినా కూడా తీరే బాధ కాదది. ఎంతో ప్రయత్నించి కూడా నేనాయన్ని ఓదార్చలేకపోయాను. మావయ్య బాధనీ, భావాల్నీ అప్పుడే నేను అఖరిసారిగా చదవగలిగాను. ఆ రోజంతా ఆయన తిండి నిద్ర లేకుండా ఎండిపోయాడు. తీరని మనస్తాపంతో కృశించి పోయాడు. పిచ్చివాడిలా, తను కాగితాల గీతల్లో మలిచిన కాలాన్ని చించి పోగులు పెట్టాడు. తెల్లారాక చూస్తే తడికళ్ళతో డ్రాయింగురూములో ఆ గడియారం లేని ఖాళీ టేబిలుమీద తలవాల్చి ప్రాణాలు వదిలేసి కనిపించాడు. ఆయన మీదపడి నేను చాలాసేపు ఏడిచాను. ఏం లాభం? గతించిన కాలంలాగే మావయ్యా తిరిగిరాలేదు. కాలమే మావయ్యనలా కాలం చేయించడంతో నా కప్పుడు కాలచక్రం ఆగిపోయి నట్టనిపించింది. ఏమైతేనేం – టైంపీసు పోయింది. మావయ్యా పోయాడు."

సముద్రంమీద పేరుకున్న చీకటిలోకి నిరామయంగా చూస్తూ మాట్లాడుతున్న చిన్నా, వొక్కసారి ఆగి రేఖవేపు చూశాడు. ఆమె ముఖంలో విషాదాశ్చర్యాలు కూడుకొని వున్నాయి.

"తీరాచూస్తే నిన్న ఆ టైంపీసు కారులో బాక్‌సీటు వెనుకనున్న విండోలో కనబడింది. హఠాత్తుగా దాన్నక్కడ చూసేసరికి నాకు మతిపోయింది ఏడుపొచ్చింది. దానిమీద ఎక్కడలేని కోపం వచ్చింది. నాకోసం ఎంతగానో తాపత్రయ పడేందుకు మిగిలివున్న వొక్క వ్యక్తినీ నాకు దూరంచేసి, అది నన్ను నిస్సహాయుణ్ణి చేసింది. ఇక ఆపాడు గడియారంలో టైము చూసుకోడానికి అసహ్యమేసింది. భరించలేక ఒళ్ళు తెలియని కోపంలో దాన్ని ముక్కలు ముక్కలుగా చితగ్గొట్టి, డ్రైనేజ్‌లో పారేశాను." ముగించాడు.

రేఖ యిదంతా కళ్ళప్పగించి వింది. విన్నాక ఆమె కళ్ళు ఇప్పుడు చెవుల్లా మాటలు వినాలనే ప్రయత్నంతో చూస్తున్నట్టున్నాయి. ఆమె పెదాలు కదలిక మాని నిద్రపోతున్నట్లున్నాయి. అలా వున్న రేఖ ముఖాన్ని రెండు క్షణాలపాటు చూశాక, చిన్నాలో మళ్ళీ బాధ కదిలింది. అలాంటి 'బాధ చిన్నా'ని రెండు క్షణాలపాటు చూశాక రేఖ హృదయం ఎనలేని జాలితో రెపరెప లాడింది. అప్పుడు రేఖ మెల్లిగా అతన్ని ఓదార్చే ధోరణిలో అంది—

"పోనీండి చిన్నా! జరిగిపోయిందేదో జరిగిపోయింది. ఇప్పు డిక బాధపడి ఏం ప్రయోజనం చెప్పండి? దయచేసి నా కోసమేనా అలా బాధపడ్డం మానేయండి. మీ బాధను చూస్తూ నేను సహించలేను."

"మరి నా ఒంటరితనాన్ని చూస్తూ—?" దీనాతిదీనంగా అడిగాడు. అతని ప్రశ్నలో కోరిక మిళితమైవున్నా, కొట్టొచ్చినట్టు కనబడే ద్వైధీభావం దాన్ని కప్పేసింది. మగాడి ముఖంలో ధైర్యం బాగున్నంతగా దైన్యం బాగుండదు కనుక రేఖ ఆ చూపులకి తట్టుకోలేకపోయింది. మనస్సు విచక్షణని నిర్లక్షించడంతో "నేనుండగా మీరు వొంటరివారెలా అవుతారు?" అని పూరడించింది. ఊరడించేటప్పుడు అతని భుజంమీద చెయ్యి కూడా వేసింది. అప్పుడు చిన్నా క్రమంగా స్తిమితానికి రాగలిగేడు.

● ● ●

ఆ మర్నాటినుండీ యిద్దరి పరిచయం బలంగా మారి, వాళ్ళ మనస్సుల్లో శ్రద్ధగా పునాదులు నిర్మించడం మొదలు పెట్టింది. ఆ సందర్భంలో వారిరువురూ రేఖ ఇంట్లో

బాల్కనీ పిట్టగోడ అందున, ఎగబాకిన జూకా మల్లితీగె పరసన, 'సరసమైన' సరదా కబుర్లెన్నో చెప్పుకోడం చాలాసార్లు జరిగింది.

ఒకరోజు అదే ప్రదేశంలో, రేఖతో చిన్నా — "జూకా మల్లి పువ్వులు బావుంటాయి!" అన్నాడు. మరుసటి రోజు — "జూకా మల్లి పువ్వులు మీ ఎడమ జెళ్ళో యింకా బాగుంటాయి!" అన్నాడు. తర్వాత రోజు—"మీ చెవులకి రింగులకంటే జూకాలు బావుంటాయి." అన్నాడు. ఆ తర్వాత రోజు—"జూకాలు పెట్టుకోండి, బావుంటారు!" అన్నాడు. మర్నాడు, "మీకు పాలపిట్ట రంగు పువ్వుల చీరె బాగుంటుంది రేఖా!" అన్నాడు. తర్వాత "నీ పేరు అయ్యటి పేరు సుమా!" అన్నాడు. వీటితో రేఖ మనస్సులో సంతోషం సంబరంగా గంతులు వేసింది. మరుసటి సాయంత్రం వాళ్ళిద్దరూ బీచ్‌కి వెళ్ళి కెరటాల గురించి మాట్లాడుకున్నారు. ఓ రాత్రి సినిమాకి వెళ్ళి, సినిమాలో మనుషులు ఆలస్యంగా ఒళ్ళో జేరతారనీ, ఇంకా ఆలస్యంగా ప్రేమించుకుంటారనీ జోక్‌గా మాట్లాడుకుని నవ్వుకున్నారు.

క్రమంగా యిలా చిన్నా రేఖల చనువు, ఆడదాని తొలి యవ్వనంలా శీఘ్రగతిని, ఏవుగా పెరిగిపోయింది. ఈ సంగతి నిరంజనానికి చూచాయగా తెలిసినప్పటికీ అత సామె సమక్షంలో అలవాటు ప్రకారం ప్రేమ తప్ప మిగతావన్నీ మరచిపోయేవాడు కాబట్టి యిబ్బంది లేకపోయింది.

ఇలా వుండగా, చిన్నా ఒకరోజు రేఖతో మాటల సందర్భాన మళ్ళీ మావయ్య గురించి మాట్లాడేడు.

"ఇంతకీ మావయ్య తాలూకు పెద్ద నిజం నిన్న తెలిసింది నాకు. అప్పుడు నేను చాలా పొరబడ్డాను" ఆమె ముఖాల్ని చూస్తూ అన్నాడు

"పొరబడటం ఏమిటీ?"

"అవును పొరబాటే! మావయ్య చనిపోవడం గురించి నేనూహించినదంతా నిజంకాదు. నిన్న పాతపుస్తకాల మధ్య అయన డైరీ కనిపిస్తే తీసి చదివాను."

"చదివితే?" ఆమె ఆత్రుతగా అడిగింది "ఏం తెలిసింది నీకు?"

చిన్నా యిందాకటి లాగే చూస్తూ చెప్పాడు,

"ఏమిటా? మావయ్యకో చిత్రమైన గతం వుంది. నే ననుకున్నట్టుగా ఆయన ప్రేమించింది కాలాన్ని కాదు రేఖా! కామాక్షిని."

రేఖ దిమ్మెరబోయింది.

"కాని కాలంలాగే కామాక్షి కూడా తిరిగి మావయ్యని ప్రేమించలేదు. ఆయనతో బాగా పరిచయాన్ని పెంచుకున్నాక తను మరో వ్యక్తిని ప్రేమిస్తున్నట్టుగా చెప్పిందిట. పాపం పిచ్చి మావయ్య! ప్రేమంటే అదేనేమో అనుకున్నాడు. కాని కామాక్షి అది స్నేహం అని చెప్పిందట. అసలింతకీ పిటీ ఏమిటంటే, చివరికంత మోసం జరిగినా కూడా మావయ్య ఆమెని తనింకా ప్రేమిస్తూనే వున్నట్టు డైరీలో రాసుకున్నాడు. రాసుకోడమే కాదు. ప్రాణాలు వదిలేవరకు అంతర్గతంగా ఆమెని ప్రేమించాడు. ఇంతకీ డైరీలో నేను గ్రహించిన నిజమేమిటంటే ఆయన ప్రాణాలు తీసిన బిగ్ బెన్ క్లు పీసుని మావయ్యకి, ఆవిడే పెళ్ళి కానుకగా యిచ్చిందట."

కాస్సేపటికి దిమ్మెరబోయిన రేఖ బొమ్మయిపోయి వింది. నెమ్మదిగా తేరుకున్నాక అంది - "ఆశ్చర్యంగా వుంది!"

"కాదు మరి!"- అని చిన్నా అన్నాడేగాని, నిజంగా రేఖ అలా ఆశ్చర్యపడినందుకు గల కారణం అతనికి తెలియదు.

మరో పావుగంటసేపు అతను రేఖతో కబుర్లు చెప్పాడు. కానిఆమె అంతరంగం దీర్ఘాలోచనకి లోబడిపోవడం వల్ల, రేఖ చిన్నా మాటలన్నిటినీ భౌతికంగా మాత్రమే వినగలిగింది. చివరికి 'గుడ్ నైట్' చెప్పి చిన్నా వెళ్ళిపోయాక ఏదో కొత్త చైతన్యం వొంట్లో ప్రవేశించినట్టుయింది రేఖకి. అప్పుడు రేఖ జూకా మల్లెతీగె వేపు నడిచి, చేతివేళ్ళతో సుతారంగా తీగె ఆకుల్ని పిరుస్తూ యిలా ఆలోచించింది.

ఆలోచించినకొద్దీ తనకు విపరీతమైన భయం వేస్తోంది — చిన్నా జీవితం అతని మావయ్య జీవితాన్ని పోలగలదేమోనని. ఒకవేళ చిన్నా గాని తన్ను ప్రేమించే వుద్దేశంతో

వున్నట్టయితే యీ అనుమానం నిజం కావడం తప్పకుండా నిజం కావచ్చు. అయినా చిన్నా తన్ను ప్రేమిస్తున్నాడని తనెందు కనుకోవాలి? ఏమో!- ఒకవేళ ప్రేమిస్తున్నాడేమో? అమ్మో!!—ప్రేమిస్తే, ఇంకేమన్నా వుందా! నిరంజనం? — తన ప్రేమంతా దోచుకున్న నిరంజనం?- తనకి బాగా తెలుసు. ప్రేమకి అనుభవంకంటే వున్నతస్థాయి లేదని. తన విషయంలో అది నిరంజనం దగ్గం మాత్రమే వుంది. మరిప్పుడు చిన్నా తన్ను ప్రేమిస్తే తనేమిటీ చెయ్యడం?—ఏమిటో! — ఏమీ తోచకుండా వుంది. అసలు తను చిన్నాతో అంత చొరవగా ప్రవర్తించడమే దీనికి కారణమేమో? అయినా తను మాత్రం ఏం చెయ్యగలదని? అప్పట్లో అతని దైన్యం తనని అన్నీ మరచిపోయేలాచేసి, చిన్నా దిద్విలాసానికీ, సరదా కబుర్లకీ తన్ను అకట్టివేసింది. అప్పుడు చిన్నా తన అందాన్ని గూర్చి ఎంతో గొప్పగా మాట్లాడుతుంటే కళ్ళముందు ఎంత వున్నతంగా కనిపించాడు? స్త్రీకి తన అందం గురించి గొప్పగా మాట్లాడే మగాళ్ళంతా అలాగే కనిపిస్తారు కాబోలు! ఎందుకో పూర్తి విషయం తెలుసుకోకుండా అతన్ని మరోలా అర్థం చేసుకుని తప్పటడుగు వేశానేమో ననిపిస్తోంది. నిజమేనేమో? ఎందుకంటే 'తక్కువ తెలుసుకోవడం, ఎక్కువ అర్థం చేసుకోవడం ఆడవాళ్ళ సహజ లక్షణం' అని నిరంజనం తనతో ఒకసారి చెప్పినట్టు జ్ఞాపకం కూడా. ఏమైనా యిక చేయగలిగిందల్లా వొక్కటే— వచ్చేనెల్లో నిరంజనంతో నిశ్చయమైన తన పెళ్ళి గురించి, రేపే చిన్నాకి విదితంచేసి, అతని స్నేహానికి శాశ్వతంగా 'గుడ్ బై' చెప్పడం మంచిది. కాని — ఎలా చెప్పేది? ఇన్నాళ్ళూ తన వుత్సాహానికి ఊపిరిలా తోడ్పడ్డాడు. ఇన్నాళ్ళూ 'మావయ్య' పోయాక తనే 'మావయ్య'ంత అసరా అనుకున్నాడు. ఇంకా ఏమనుకుంటున్నాడో ఏమో! పిచ్చి చిన్నా! ఇంతకీ రేపు తను అతనికి 'గుడ్ బై' ఎలా చెప్పగలదు? చెప్పి అలవాటులేని అతని జాలి చూపులకి తను మళ్ళా ఎలా సిద్ధపడగలదు? పోనీ ప్రయత్నించి సిద్ధపడితే?— ఏమనుకుంటాడో? ఏమనుకుంటాడు? విపరీతంగా బాధపడతాడు. వాళ్ళ 'మావయ్య' పోయినప్పటిలా భుజం మీదికి తలజార్చుకొని ఏడుస్తాడు. చివరికి తన్ను హృదయమూ, సంస్కారమూలేని స్త్రీగా జమకడతాడు. అమ్మో! వీటన్నిటికీ తనెలా సిద్ధపడడం?

ఏమైనా ప్రేమనీ, చక్కటిముందు జీవితాన్నీ జీవితమంతా కలిసి బ్రతకడానికి ఎన్నిక చేసుకున్న నిరంజనాన్ని కేవలం 'చిన్నా' స్నేహం కోసం తను వదులుకోలేదు. ఏమైనాసరే రేపే తను చిన్నాకి 'గుడ్ బై!' చెప్పేయాలి.

ఆ రాత్రి ఎన్నో కలలు, ఎన్నో ఆలోచనలు, రేఖ నిద్రని మొదటిసారిగా పాడుచేశాయి.

● ● ●

అవ్వాళ చంద్రుణ్ని మేఘంచాటు చెయ్యక పోయినా బీచ్‌లో వెన్నెల కురవలేదు. రాబోయే అమావాస్యకి సూచనగా ఆకాశం మధ్యగావున్న వెన్నెల కురవని చంద్రుడు రేఖలా వున్నాడు.

బీచ్‌లో చిన్నా పక్కన కూర్చున్న రేఖమాత్రం చంద్రరేఖలా కాకుండా చంద్రుడులేని సముద్రంలా వుంది. వాళ్ళిద్దరూ చాలా సేపట్నుంచీ ఏదో మాట్లాడు కుంటున్నారు.

"ఏమిట్రేఖా! ఈరోజు హుషారేం లేకుండా అలా వున్నావేం?"

"వెన్నెల్లేదుగా—"

"హుషారుగా వున్నప్పుడల్లా వుంటోందేవిటి వెన్నెల?"

"చుట్టూ లేకపోయినా మనస్సులో వుండేది. ఇవాళ మనస్సులోకూడా లేకుండా పోయింది."

"ఎక్కడివీ బరువు మాటలు?"

"వేళాకోళం కాదు చిన్నా! నిజం. నే నిప్పుడెంత బాధపడు తున్నానో నీకు తెలయదు."

"ఏమని చెప్పను? నా కెలా మాట్లాడాలో తెలియకుండా వుంది."

"పోనీ ఏం మాట్లాడాలో తెలుస్తోందా?"

'అది తెలిసిందనే నా బాధ — తెలియక పోయినా బాగుండేది."

"నీకూ నాలా మాట్లాడ్డం అలవాటై పోయింది. ముందు సంగతేవిటో చెప్పు రేఖా?"

రేఖ తలతిప్పి అంది - "ఇక మీదట నేను నీ ఒంటరితనానికి తోడుగా నిలిచే అవకాశం లేదు చిన్నా"

"అంటే?-"

"ఏం చెప్పేది చిన్నా? కొద్ది రోజుల్లోనే నీకు నేను దూరమయి పోతున్నాను- నాకు పెళ్ళి కాబోతోంది- ఏమిటో నాకంతా వెంగగా వుంది." అని రేఖ తప్పని సరిగా మాట్లాడవలసి వచ్చినట్టు ఆగిఆగి చెప్పింది.

ఇది వింటూనే చిన్నా విరగబడి నవ్వేడు. - "ఎలాగైతేనేం యిన్నాళ్ళకి ఒక గొప్ప జోకు వేశావే! ఇంతా చేసి యిదా సంగతి! ఈ మాత్రానికే అర్థం కాకుండా యిలా బాధపడ్డం దేనికి? హేవ్‌మై హార్టీ కంగ్రాట్స్!" అన్నాడు.

ఊహించని యీ జవాబుకి రేఖ చకితురాలై చూసింది. చిన్నాలో ఎంతో బాధని వూహించిన మనస్సు భరించ శక్యంగాని దిగ్భ్రాంతితో గిజగిజ లాడింది. తన మాటల్లో ఖంగు

అతనికి అర్థంకాలేదేమోనని మళ్ళీ అంది— 'కాదు చిన్నా ! నేను లేక పోతే యిక నీమీద శ్రద్ధ చూపేందు కెవరు తోడుంటారన్నదే నా బెంగ!'

'అదా నీ వుద్దేశ్యం! బలేదానివే రేఖా! నీ అమాయకతకి థాంక్సు ఎలా చెప్పాలో నాకు తెలియకుండా వుంది. నువ్విలా బెంగపడే అవసరం లేకుండా వుండే ఏర్పాటు ఎప్పుడో జరిగిపోయిందిలే.'

'ఏమిటది?'

'ఇంకేమిటి? — పెళ్ళి. నిన్నే హైద్రాబాదునుండి వుత్తరం వచ్చింది. వచ్చే నెలే నిశ్చయమైంది. మావయ్య అభిమానానికి కృతజ్ఞతగా ఆయన కూతుర్ని జీవితాంతం నా మీద శ్రద్ధ చూపేందుకు సెలక్టు చేసుకున్నాను. ఈ విషయం ముందు నేనే చెబుదా మనుకుంటూండగా, బాధంటూ వంకపెట్టి నీ పెళ్ళి సంగతే ముందు చెప్పేశావ్!' అంటూ లేచి నిలబడ్డాడు ఇది విన్న రేఖ లేవడం మరిచిపోయింది. చిన్నా చెయ్యి వూతగా యిస్తూ— 'పద పోదాం! ఇప్పటికే చాలా ఆలస్య మయి పోయింది.' అన్నాడు. అయినా రేఖ కదలిక లేకుండా అలాగే కూర్చుని వుంది.

'లేలే!—పెళ్ళి గురించి తర్వాత ఆలోచించు కుందువుగాని — రేపే నా ప్రయాణం. బజార్లో నా కొంత పని వుంది. త్వరగా వెళ్ళాలి. లే రేఖా!'

'నువ్వెళ్ళు చిన్నా! ఇక్కడ నాకింకా కాస్సేపు కూర్చోవా లనుంది. నేను తర్వాత వెళ్తాను.' హతాశయైన రేఖ పెదాలు అస్తవ్య స్తంగా పలికేయి.

'ఏంటినిరంజనంగానివస్తావనిచెప్పా వేమిటి? ప్లెజర్‌టాక్ ప్రోగ్రాంలావుంది జాగర్త. వర్షం రాగలదు. నేనింక వెళ్తాను. పెళ్ళి మళ్ళీ యిన్విటేషన్లో జ్ఞాపకం చేస్తాను. మీరిద్దరూ తప్ప కుండా రావాలి సుమా - వస్తాను— గుడ్‌బై!' అని యిసుకలోకంగారుగా వంగివంగి అడుగులువేస్తూ కారువేపు కదిలిపోయాడు చిన్నా.

కాస్సేపటికి నిరంజనం రాలేదు గాని, వర్షం మాత్రం వచ్చింది

□□□

చందాదారులకు మనవి

పాత చందాదారులు తిరిగి చందా పైకం పంపే టప్పుడు మీచందానెంబరు, అడ్రసు వివరంగా వ్రాసి మాతో సహకరించ ప్రార్థన.

మేనేజింగ్ ఎడిటర్,

చిత్రరథుని

చైత్రయాత్ర

అవార్డు చిత్రాల ప్రత్యేక సమీక్ష

చలనచిత్ర రంగంలో విశిష్ట కృషిని భారత ప్రభుత్వం అవార్డులతో సత్కరించే సచ్చరిత్రలో నూతనా ధ్యాయం ప్రారంభమైంది.

భారత రాజధానిలోకాక తొలు దొల్త బొంబాయిలో బహూకర ణోత్సవం జరిపారు. ఒకప్పుడు రాష్ట్రపతిచే 'అవార్డులయాత్ర మీకు అలవాటయి పోయింది' అన్నప్రసంశ పుచ్చుకొన్న అక్కినేని నాగేశ్వర రావు ఈ సంవత్సరంకూడా (అనగా 1964 చిత్రానికి 1965 లో బహూ కృతి స్వీకరణ) రాధాకృష్ణ పండితుని మాటనిలిపారు. అన్నపూర్ణా వారి 'డాక్టర్ చక్రవర్తి' ముఖ్య నటుడుగా రాష్ట్రపతి రజత పతకం పొందిన చిత్రం హీరోగా బహూకరణ నందుకొన్నారు.

వి. ఎన్. ఫిలిమ్స్ 'భక్త రామ దాసు'కు యోగ్యతా పత్రం లభిం చింది. నటు, దర్శక, నిర్మాత 'పద్మశ్రీ' చిత్తూరి వి. నాగయ్య, ప్రముఖనటులు శ్రీ ముదిగొండ లింగమూర్తి, శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావు బొంబాయి మరాఠామందిర్‌లో మన యోగ్యతలను ఇనుమడింప జేశారు.

బొంబాయిలో ఉత్సవం జరిగిన దానికంటె గొప్ప విశేషం - తొలి సారి ఉత్తమ సినీ కథా రచయితకు పారితోషికం లభించడం. మూడు నాలుగేళ్ళ క్రితం సినిమా కవుల ప్రోద్బలంపై, నెహ్రూ ఆసక్తివల్ల, సినీ కథకునికి కేంద్ర బహుమతి ఏర్పాటు చేశారు. అయినా ఇన్ని సంవత్సరాలూ మంచి కథలు లేవంటూ అవార్డే యివ్వలేదు. ఈ సంవత్సర మే 'ఆరోహి' అనే బెంగాలి చిత్రం సినీ కథకునికి (బలైచంద్ ముఖర్జీ) తొలి సారి బహుమతి (యోగ్యతాపత్రం) యిచ్చారు. మొత్తానికి సినీ ఫంక్షన్‌లో కలంకూడా 'కాలర్‌యెత్తుకుతిరిగింది'

ఇంతకంటె కూడా విశిష్టమైన విజయం ఒకటి ఈ సంవత్సరం చూదాము. అది సత్యజిత్‌రాయ్ స్థాపించిన 'చారులత'. ఈ మహా చిత్రానికి మూడవసారి రాష్ట్రపతి

స్వర్ణపతకం రాబట్టారు. 'పథేర్ పాంచాలి', 'అపూర్ సన్సార్' తర్వాత ప్రభుత్వ కనకాభిషేకం చేయించింది 'చారులత'.

రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, ఈ మధ్యనే కంటికి ఆపరేషన్ చేయించుకొన్నందువల్ల బొంబాయి సభలకు రాలేదు. మహారాష్ట్ర గవర్నర్ శ్రీ పి. వి. చెరియన్ మే 31 రాత్రి బహుమతులు అందజేశారు.

తెలుగు రంగానికి సంబంధించినంతవరకు మరి రెండు విశేషాలు.

భావ సమైక్యాన్ని ప్రబోధించే చిత్రాలు రాలేదని అవార్డుల కేంద్ర ముఖ్య కమిటీ ప్రకటించింది. 'రామదాసు' ప్రబోధించిందని నాగయ్య అన్నారు. తెలుగు నవలకు సత్కారం లభించడం 'చక్ర(భ్రమణం)వర్తి'తో ప్రారంభమైంది.

చారులత

విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ 19 వ శతాబ్దంలో బెంగాలి భాషలో రచించిన 'నాష్ట-నీర్' 20 వ శతాబ్ది ద్వితీయార్థంలో 'బంగారు చిత్ర'మైనది. ఈ రోజులకే ఆధునికంగా వున్న ఈ కథ ఆ రోజులలో మరీ అత్యాధునికమై చాలా విమర్శలకు ఆక్షేపణలకు గురి అయినది. భారత స్త్రీ భర్తను కాక వేరొక పురుషుని వ్యామోహంలో (సకారణంగా సహేతుకంగానే అయినా) పడిందీ అంటే 19 వ శతాబ్దంలో ఆ రచన ఎంతటి ఆధునికమో ఊహించవచ్చు.

సంగ్రహంగా సినిమా కథ యిది:

ధనికుడైన భూపతి (శైలెన్ ముఖర్జీ) ఆంగ్లంలో ఒక రాజకీయ వార్తాపత్రికను నడుపుకుంటూ యావత్కాలాన్నీ పత్రికా వ్యాసంగానికీ, రాజకీయాలకూ వినియోగిస్తాడు. చిన్న వయసులోవున్న భార్య చారులతకు (మాధవి ముఖర్జీ) ఆ మహాభవంతిలో మగతోడే లేదు. కాలం కర్కశమై నత్తగుల్ల నడక సాగిస్తోంది. భూపతి వేలు విడిచిన చిన్న సోదరుడు అమల్ (సౌమిత్ర చటర్జీ) సెలవులకై వస్తాడు. బైనాక్యులర్స్‌తో దూరమును దగ్గర చేసుకొంటున్న చారులతకు దూరపు అమల్ దగ్గరైనాడు. ఆమెలోని సాహితీ అభిరుచిని అమల్ వికసింప జేశాడు. ఇద్దరికీ పొద్దు పోతున్నది. 'చారు'కు పొద్దు పోవడానికి తా నెలాగూ సహాయ పడడం లేదు. ధర్మపత్ని సాహితీ ధర్మమైనా నిర్వర్తిస్తున్నదని భూపతి సంబరపడ్డాడు.

అందరూ మంచివాళ్ళే అనుకొంటున్న భూపతికి తన దగ్గిరి బంధువొకడు తన పత్రిక డబ్బు కాజేసినట్లు విని మానసికంగా క్రుంగిపోతాడు. ఆ కబురు కాస్తా ఆ బంధువు కంటె ప్రబుద్ధుడైన – తన భార్యతోనే సాహచర్యం నెరపుతున్న అమల్ చెవినే పడవేస్తాడు. అమల్ తన వైఖరి మంచిదికాదని తెలుసుకొని



రత్నశ్రీ ఫిలిమ్సు "బ్రహ్మచారి"లో దేవిక

భూపతి యింటిగడప దాటుతాడు. కాని తలవని తలంపుగా రహస్యం బైటపడుతుంది. భూపతి – చారులత సంసారజీవితం తాత్కాలికంగా భగ్నమౌతుంది.

భూపతిలోవున్న గొప్పతనం తన తప్పును తానే తెలుసుకొనడం. భర్త అయివుండి భార్యతో అవసర కాలం గడపక పోవడమూ, భార్య అభిలాషలను తీర్చక పోవడమే కదా ఆమెలో మార్పులకు కారణమని గ్రహిస్తాడు.

రాయ్ భావబలానికి రెండు నిదర్శనాలు.

చారులత బైనాక్యులర్స్‌తో దూరమును దగ్గర చేసుకొంటుంది. స్త్రీకి ప్రధానం మాతృత్వం. మాతకావాలి. బైనాక్యులర్స్‌లో అలా అలా చూస్తూ ఓ తల్లి పిల్లను చూస్తుంది. నివ్వెరపోయింది. తనలో మాతృవాంఛ ప్రేరితమైనది. బైనాక్యులర్స్‌ను అలానే 'ప్యాన్' చేసుకొంటూ పోయింది. నవయువ అమల్ కన్పించాడు. ప్యానింగ్ ఆగింది. అమల్‌పై బైనాక్యులర్ చూపు నిలిచింది. తర్వాత ఆమెలో ఎటువంటి అభిప్రాయం కలుగుతుందో రాయ్ అభిమానులు, పాఠకులు ఇట్టే గ్రహించగలరు. బైనాక్యులర్స్‌ను కథలో రసస్పష్టికి గొప్పగా వినియోగించారు సత్యజిత్.

బహుమతి బెంగాలి కథ

మొట్టమొదటిసారి "అరోహి" అనే బెంగాలి చిత్రం కథకు బహుమతి (యోగ్యతాపత్రం) లభించింది. బాలైచంద్ ముఖర్జీ కథా రచయిత.

వయోజన విద్యకు సంబంధించిన కథ యిది. ఒక డాక్టరు మన రంగారావువంటి ఒక వయోజనునిపై జాలి దలచి ఓనమాల నుంచి చదువు చెప్పిస్తాడు. ఆసక్తితో చదువుకొని ప్రౌఢో డాక్టరు అంత అవుతాడు ఆ వృద్ధవాడు. డాక్టరుగారు కొద్ది సేపు లేకపోతే మందు లిచ్చేటంత 'ఖామందు' అవుతాడు. డాక్టరుకు ఒక కుమారుడు. ఈ పెద్దవాడే ఆ బాబును పెంచి విద్యా బుద్ధులలో శ్రద్ధ వహిస్తాడు. అతడూ డాక్టరు అవుతాడు కాని కొంచెం ప్రేమలో పడిపోతాడు. వృత్తి ధర్మం తెలిపి విదేశాలకు ఉన్నత విద్యా విజ్ఞానార్జనకై పంపేవరకు వృద్ధ 'వయోజనుడు' నిమిషమైనా విశ్రమించడు. కాంతి తీసుకొన్న జ్యోతి కాంతి నిచ్చేస్తుంది. అంతే కథ.

తొలి భారత "న్యూవేవ్" చిత్రం

స్వీడన్, ఫ్రాన్సు ఇటలీ, పోలెండులు చలనచిత్ర కళలో అపూర్వమైన ప్రయోగాలు సాగించి 'న్యూవేవ్' పథంలో పోటా పోటీగా పరుగుడు తున్నవి.

భారతదేశంలో తొలుదొల్త అట్టి యత్నం జరిగింది. టెక్నిక్‌కు సంబంధించినంత వరకు ఈ న్యూవేవ్ చిత్రం ఒక మైలరాయి. భారత ప్రభుత్వం వారు బహుమతులు యిచ్చేటప్పుడు కథ, కథా లక్ష్యములకే ప్రాధాన్య మిస్తున్నారు. సాంకేతిక సాహసాలను తగినంతగా పరిగణించడంలేదు. తత్కారణంగా మన తొలి 'న్యూవేవ్' చిత్రానికి ప్రాంతీయ స్థాయియోగ్యతా పత్రం మాత్రమే లభించింది. విదేశాలకు ఇటువంటి చిత్రాలు వెళ్ళినప్పుడే మన సాంకేతిక విజయాలు, 'న్యూవేవ్' యత్నాలు వెల్లడవుతవి. ప్రాంతీయ స్థాయి యోగ్యతాపత్రం ముద్రతో న్యూవేవ్ చిత్రం ఒకవేళ విదేశం వెళ్ళినా వాయి 'న్యూవేవ్'కు ప్రభుత్వం యిచ్చే విలువ యిదా అనినివ్వెర పోవచ్చు.

అలా నివ్వెర కలిగించే న్యూవేవ్ హిందీ చిత్రం "యాదీన్" (స్మృతులు.)

సినిమాకు ఏవయితే నిషిద్ధమో వాటితోకే చిత్రం తీయడం ఎంత సాహసమో ఊహించవచ్చు. డ్రామాలలోనే స్వగతాలు తలనొప్పి. అటువంటి స్వగతాలు స్మృతుల రూపం దాల్చి 10 వేల అడుగుల చిత్రమైంది. నేటి సినిమాకి స్త్రీ అవసరం. స్త్రీ లేనిదే సినిమా లేదు. స్త్రీ లేనిది సెక్స్ అప్పీలు లేదు. 'యాదీన్'లో వున్నదే ఒక్క పాత్ర. అది మగపాత్ర. స్త్రీ లేదు.



జెమినీవారి "ఆడబ్రతుకు"లో
ఎన్. టి. రామారావు, ఎస్. వి. రంగారావు

అయినా, దర్శకుడు, రచయిత, కెమెరామన్ ఊహాబలంతో సెక్స్ అప్పీలు దాటించారు. ఒక్క సెట్టులో– ఒక ముఖ్యమైన సెట్టు, మూడు నాలుగు అనుబంధపు సెట్లు — ఒక్క పాత్రతో రెండుగంటలు చిత్రం పరుగిడినా విసుగనిపించదు; ఒక కుటుంబం కథను చూచినట్లుంటుంది. అపూర్వమైన యాంగిల్స్ కన్పిస్తవి. కెమెరా 360 డిగ్రీలూ చూపుతుంది. అడుగడుగూ ఫిట్. అయినా "యాదీన్" చిత్రాని కిచ్చింది ఒక అట్టడుగు యోగ్యతా పత్రమే. కథకురాలు: నర్గిస్‌దత్: దర్శక నిర్మాత, ఏకైక నటుడు సునీల్‌దత్: స్క్రీన్‌ప్లే: ఓంకార్ సాహెబ్; ఛాయాగ్రహణం: రామచంద్ర.

ఎడిటర్ ప్రాణ్ మెహ్రా, కళాదర్శకుడు సుధేందురాయ్, సంగీత (విశేషించి నేపథ్య సంగీత) దర్శకుడు వసంత్ దేశాయ్ విన్నాణము విశిష్టం.

కరుణ కథ

కరుణ రస ప్రధాన కథ "దోస్తి" (హిందీ) ప్రాంతీయ స్థాయి రజత పతకం బహూకృతి పొందింది.

తెలివితేటలు కల రాము (సుశీల్ కుమార్) అనే కుంటి అనాథ బాలుడు చదువు సాగించడంకోసం మోహన్ (సుధీర్ కుమార్) అనే అంధ గాయక అనాథుడు పడిన శ్రమ గాథ "దోస్తి."

మనసుంటే మార్గం లేకపోలేదు. ఒకరి నొకరు బాగా అర్థం చేసుకొని సౌహార్దం పెంచుకొంటే, పంచుకొంటే పేదల బ్రతుకూ సుఖతరమే అవుతుంది అనే ఆశావాదాన్ని ఈ రాజశ్రీ ప్రొడక్షన్స్ చిత్రం నిరూపిస్తుంది.

కొత్త నటులు వుండడం, కరుణ రస ప్రధానంగా చిత్రం నడపడం మెచ్చదగిందే. కాని కొన్ని సన్నివేశాలు కేవలం కథలో కరుణను మరీ పిండించే ఉద్దేశంతో కృత్రిమంగా కల్పించబడినవి. మిత్రులు వేరుకావడం, అంధబాలుని అక్క, చాలాకాలం తర్వాత తమ్ముని చూచి దగ్గరకు వెళ్ళక పోవడం వీటికి ఉదాహరణలు. దర్శకుడు సత్యేన్‌బోస్.

మరి రెండు చిత్రాలు

చైనా యుద్ధంపై తీసిన "హకీకత్" (హిందీ) హిందీ చిత్రానికి అఖిల భారత స్థాయిలో ప్రథమ యోగ్యతాపత్రం లభించింది. విదేశీయులు అల్ప్స్‌కంటె చేతన్ ఆనంద్ హిమాలయాలను బాగా ఎక్స్‌ప్లాయిట్ చేశారు భారత్ కనివిని ఎరుగని హిమాలయన్ షేకింగ్. దాదాపు 17 రీళ్ళ చిత్రంలో ఒకటి రెండు రీళ్ళు మాత్రం ఇండోర్. తక్కినవి సిఫా, లడఖ్. తెలుపు నలుపులో తీసినందువల్ల ఎంతో వాస్తవికంగా వుంది. యుద్ధకథ, అందులో ఫ్లాష్‌బ్యాక్‌ల జీవితకథ, దేశం మట్టి మహిమచూపే మృణ్మయ పాత్రతో సాగిన ఘట్టాలు చిరస్మరణీయం.

'ఉన్నయ్‌పోల్ ఒరువన్'

"నీవంటి వాడు" అనే తమిళ చిత్రానికి అఖిల భారత స్థాయి ద్వితీయ యోగ్యతా పత్రం లభించింది. (నేపథ్య) సంగీత దర్శకుడు "వైణిక సార్వభౌమ" చిట్టిబాబు. చిత్రంలో పాటలు లేవు. పాత్రలకు మేకప్ లేదు. సెట్ అంటూ దాదాపు లేదు. అంతా స్లమ్ (మురికిపేట)లో సహజ కాంతిలో తీశారు. వారి వారి భాష యాసలే వాడారు. నటీనటులందరూ కొత్తవారే. 40 రోజుల లోపు షూటింగ్ జరిగింది. 12 రీళ్ళ లోపున చిత్రం తయారైంది. భయభక్తులలో వుంచేవారు ఒకరువుంటేనే అది అన్యమార్గాన పోదని ఈ చిత్రం చెబుతుంది.



"జ్వాలాదీప రహస్యం"లో కృష్ణకుమారి, కాంతారావు

శక నిర్మాత సత్యజిత్ రాయ్

శాంతారామ్, విజయ భట్ వద్ద తులు ఒక విధంగా పాతబడి, న్యూ థియేటర్స్ వెనుకపడి, సొహ్రాబ్ మోడి ముందుకు వెళ్ళని తరుణంలో భారత చలన చిత్రానికి కొత్తలోతు, కొత్త వెలుగు, కొత్త కాంతి యిచ్చినది సత్యజిత్ రాయ్.

విదేశాలలో త్రీ డైమెన్షన్‌లు, స్కోపులు, 55 ఎమ్ ఎమ్‌లు, 70 ఎమ్ ఎమ్‌లు "టాడ్ ఏ. ఓ." లు వస్తున్న, రానున్న సమయంలో పేద భారత్ తాహతుకు ఓ 'లోతు' కల్పించిన మేధావి సత్యజిత్. పై పటాటోపాలకు "కుబేర" విదేశీయులు పోతే మానవ హృదయంలో లోతులు తరచి చూపే టెక్నిక్‌కు ఈ "కుచేల" భారతీయుడు "కుబేర" విలువ తెచ్చారు.

తారలంటూ వేరే ఎవ్వరూ అక్కర్లేక, జనంలో 'ఐడెంటిఫై' అయ్యేవారినే తారలు చేసిన దర్శక తార రాయ్. (మొదట్లో ఇంత ఉత్తమ కర్తవ్యం నిర్వహించిన రాయ్ 'మహానగర్'లోను, 'చారులత'లోను పూర్వపు తారలనే తీసుకొన్నారు.)

టాగూర్ కథ అయినా, మరెవ్వరి కథ అయినా చిత్రంగా నిర్మించడానికి



తీసుకొన్నప్పుడు కవి హృదయపు లోతులు తరచి చూచి, ఆయన సృష్టించిన పాత్రల మనోభావాలను సాకల్యంగా గ్రహించి, వాటినే తెరపై కవితా ధోరణిలో చూపడంలో రే రీతి ఆదర్శకిరణమైనది. మానవత, కారుణ్యదృష్టి, భావుకత, జాతీయత ఆయన చిత్రాలలో మిన్నగా వుంటవి.

రే కవిని మించిన కవి, ఛాయాగ్రాహకునికి మించిన దృశ్య ఊహ వుంది. చిత్రకారుడు కాబట్టి ఫ్రేమ్‌ను కళాత్మకంగా పెట్టుకోగలరు. సంగీతం స్వయంగా కూర్చుకుంటారు. జీవిత సంగీతంలోని సుప్త స్వరాలను పలికిస్తారు. టాగూర్‌పై తీసిన డాక్యుమెంటరీ చిత్రంలో ఇవన్నీ సమ్మిళితమై వున్నవి.

నవలలు చిత్రంగా తీశారు. కథానిక చిత్రంగా తీశారు. సీరియల్ చిత్రాలు తీశారు. మూడు కథలు కలిపి ఒక్క చిత్రం, రెండు చిన్న కథలు కలిపి ఒక్క చిత్రం తీశారు. ఎటువంటి ప్రయోగాలకైనా ధైర్యంగా వెళ్ళే దర్శక హీరో రే. రైళ్ళలో ప్రయాణాలు చేస్తున్నా, తన ఊహాలలో వున్న పాత్రలకు సరిపోయే నటీనటులు దొరుకుతారేమోనని ఆయన విశాలనేత్రాలు శోధిస్తూ వుంటవి. ఇద్దరు ముగ్గురు 'తార'లను ఆయన అలా సృష్టించారు.

1921 లో కలకత్తాలో ఒక మధ్యతరగతి సాహితీ కుటుంబంలో సత్యజిత్ రాయ్ జన్మించారు. తండ్రి పేరొందిన గ్రంధకర్త, వర్ణ చిత్రకారుడు. ఛాయాగ్రాహకుడు (ఫొటోగ్రాఫర్), కవి, బాలల పత్రిక సంస్థాపకుడు. తాతా రచయితే, వాయులీన విద్వాంసుడు. హాఫ్‌టోన్‌బ్లాకులు భారతదేశంలో మొదట తయారు చేసిన వారిలో ఒకరు. వీరి కుటుంబ మిత్రుడు టాగూర్.

చిత్రకళ, సాహిత్యం, సంగీతం సత్యజిత్‌కు ఉగ్గుపాలతో వచ్చిన విద్య లయినవి.

సత్యజిత్ కలకత్తా విశ్వవిద్యాలయం అర్థిక శాస్త్ర పట్టభద్రుడైన మీదట విశ్వకవి శాంతినికేతనంలో చేరి 'డెకొరేటివ్ ఆర్ట్' అభ్యసించారు. 1941 లో టాగూర్ నిర్యాణం చెందినప్పటివరకు వారితో కలిసి వుండి జ్ఞానతృష్ణ తీర్చుకున్నారు. గురువు గురుదేవ్‌పై సినిమా తీయాలని, వారు రచించిన

కథలను అంత రసస్ఫోరకంగా తెరకెక్కించాలని సత్యజిత్ కలలు కన్నారు.

కలకత్తాలో ఒక అడ్వర్టయిజింగ్ ఏజన్సీ కళావిభాగంలో రే ఉద్యోగి అయినప్పటి నుంచి చలన చిత్ర జ్ఞానార్జన ప్రారంభించారు. లండన్‌కు 1950లో, ఆ సంస్థ పంపింది. అప్పటు ఫ్రెంచి డైరక్టర్ జీన్ రెన్వార్‌తో రేకు పరిచయ భాగ్యం కలిగింది. రేలో చలనచిత్రనిర్మాణాభిలాషను రెన్వార్ ఇనుమడింపజేశారు.

ఆ పిమ్మట కొలది సంవత్సరాలకు రెన్వార్ భారతదేశం వచ్చి ఓ చిత్రం తీశారు. రేను పిలచి పరిశీలనానుభవం సంపాదించమన్నారు. ఇక స్వయంగా దర్శకత్వం వహించే సాహసానికి దిగవచ్చునని ప్రేరేపించారు, ప్రోత్సహించారు.

రే, తోటి మిత్రులూ కలసి ఒక 'అమెచూర్ సినిమా సర్కిల్' నెలకొల్పారు.

విభూతి భూషణ్ బెనర్జీ రచించిన "పథేర్ పాంచాలి" బెంగాలీ నవలను రే అంతకుముందు బొమ్మల కథగా కూర్చి వున్నారు. బొమ్మల సెటప్‌తో సినిమా తీయాలని సంకల్పించారు. చందాలు పోగు చేశారు. స్వంత స్వల్ప ఆస్తులు విక్రయించారు. తనకా ప్రత్యక్ష సినిమా అనుభవం లేదు. ఇదివరకు సినిమా తీయని వ్యక్తిని కెమెరామన్‌గా, ఇదివరకు సినిమాలో నటించని వారిని 'తారలు'గా తీసుకొని రే వీరుడు "పథేర్ పాంచాలి" చిత్ర నిర్మాణానికి ఉపక్రమించారు. ఆదివారాలలోను,



"వీరాభిమన్యు"లో ఎన్. టి. రామారావు

సెలవు రోజులలోను సాయంవేళ షూటింగ్ జరిపారు. అలా ఒక సంవత్సరం జండి సాగింది. నిధులు నిండుకొన్నాయి. గుండెలు బ్రద్దలైనాయి. గుండె డాక్టరూ, బెంగాల్ ముఖ్యమంత్రీ డాక్టర్ బి. సి. రాయ్ ఆర్థిక సహాయం చేశారు. 1955లో "పథేర్ పాంచాలి" విడుదలైంది.

సహజ కాంతిలో, సహజ మానవులతో, సహజ ప్రకృతిలో సహజజీవన విలువలను అసాధారణంగా చిత్రించే శకం నాడు ప్రారంభమై నేడు "చారులత" పరాకాష్ఠ నందుకొన్నది.

"ప్రమీలార్జునీయం"

అనురాగం, ఆదర్శాలమధ్య సంఘర్షణ పడిన అబల—కాదు—సబల ప్రబల గాథ "ప్రమీలార్జునీయం."

• 'ప్రపంచమంతా శక్తిమయం. శక్తికి మేమే ప్రతినిధులం - పురుషాధిక్యం సాగదు, స్త్రీల ధాటికిక ఎదురే లేదు-ప్రతియువతీ ఒకప్రళయశక్తి'అని ముల్లోకముల చాటేందుకు, 'ప్రబుద్ధ నారీ జయ నినాదముల నభోంతరాళము నింప'డానికి స్త్రీ సామ్రాజ్య మహారాజ్ఞి, ధీరవ్రత ప్రమీల కంకణం కట్టుకొన్నది అదే ఆమె జీవిత ఆదర్శం.

బీభత్స బిరుదాంకితుడు, "ముక్కంటి నెదిరించి మొక్కవోవక నిల్చి పాశుపతాస్త్రమ్ము బడసిన" వీరప్రభ విఖ్యాతుడు, కురుక్షేత్ర సంగ్రామ శూరుడు అర్జునుడు ఆ ప్రమీల పట్టిన యాగాశ్వమును వశం చేసుకోవాలి. అస్త్రంతో కాదు, సమరంతో కాదు. కృష్ణ సహాయంతో కాదు. అ(స)బలతో పోరు అసలే కూడదు.

"కృష్ణ మిత్రుడు" మరి ఏ సాధనంతో యాగాశ్వమున్నూ, ప్రమీలనూ సాధించ వీలవుతుంది ?

సృష్టి రహస్యమే (ప్రేమ) ఆ సాధనం. స్త్రీ పురుషులు లేనిదే సృష్టి లేదు. సృష్టికిమూలం ప్రేమ. అది జంతుజాలం నుంచి జగదాధారుల వరకు భిన్న రూపాలలో, లక్షణాలలో నిక్షిప్తమై వుంటుంది. స్త్రీలా, పురుషులా, ఎవరధికులు ? అన్నది ప్రశ్న కాదు. ఉభయులు సమానులు. ఒకరి కొకరు ఆధారం. అది గ్రహించినది ప్రమీల, అర్జునుడు. ప్రేమను నిషేధించినా ప్రమీలకు అర్జునునిపై అనురాగం తప్పలేదు. గురుదేవి భగవతి హెచ్చరికవల్ల ఆదర్శమూ (పురుషునిపై స్త్రీ ఆధిక్య నిరూపణ) విడనాడలేదు. అనురాగ ఆదర్శముల మధ్య నలిగిన నవయౌవని వీర శృంగారగాథే "ప్రమీలార్జునీయము".

రసవత్తర గమనము, చతుర సంభాషణలు, కవితా మాధురి, హాస్యపు జల్లులు, మధుర మనోజ్ఞ అభినయము కలిసిన ఈ చిత్రంలో ఒక విశిష్టత ఆ కాలపు గాథను ఈ కాలపు అభిరుచులకు, అభిమానాలకు, ఆదర్శాలకు, అనురాగాలకు, వినోద వైర వైరాగ్యాలకు బదులు చెప్పే రమ్యరీతితో మలచడము.

చిత్ర గోత్రీకుల ప్రజ్ఞా కులగోత్రాలకు ఒక్కొక్క ఉదాహరణ.

నిర్మాతలు : ఆదిబాబు, నాగమణి — పెద్ద తారాగణంతో చిన్న కథను రమ్యాకర్షణలతో చలన చిత్రంగా రూపొందించడం. నిర్మాణ సంస్థ ఎస్. ఆర్. మూవీస్.

దర్శకుడు ఎమ్. మల్లిఖార్జునరావు. స్క్రీన్‌ప్లే రచయిత కూడా



"ఆకాశరామన్న"లో కాంతారావు, ఎల్. విజయలక్ష్మి

ఈ యువకుడే. సాఫీగా సరళముగా సన్నివేశములను నడిపించి, ఆదిశక్తి పరముగ చిత్ర లక్ష్యమును నిరూపించడము.

కథకుడు, సంభాషణ కర్త, కవి: పింగళి నాగేంద్రరావు. పాత్రలకు మించి సన్నివేశము, సన్నివేశముకు మించి సంభాషణలు సందర్భోచిత రసములతో ఒప్పించుట. వినోదములోవలె ఊహా వినువీధిలో కూడా వీరి కలము ఆనందతాండవం చేస్తుంది.

సంగీత దర్శకుడు : పెండ్యాల. "ప్రపంచమంతా శక్తిమయం" (నృత్యగానము), "సరిక్రొత్త కన్నెనోయి, చొరవింత కూడదోయి", "నిను చూసీ చూడగనె పరవశము, నిను వీడి వీడగనె విరహము." పాటల బాణీలు, సంగీతము మధురాతి మధురము.

అభినయం : ప్రణయంలో ప్రళయం చూపినప్పుడు సరోజ, ప్రళయంలో ప్రణయం చూపినప్పుడు రామారావు, వీరి (ప్రమీలార్జునుల) ప్రణయమును ప్రళయముగ [illegible] నప్పుడు ఋష్యేంద్రమణి (గురుదేవి) వారివారి ప్రళ[illegible]

చెలగాటువు ప్రపంచములో పరిభ్రమించి నప్పుడు రేలంగి, కాంతారావు (కృష్ణుడు), పద్మనాభం నటన విశిష్టము.

నేత్రోత్సవంగా చిత్రం అమరి నందుకు ముఖ్యంగా తోడ్పడిన రవికాంత్, రహిమాన్, బుల్‌బులే ట్రిక్ ఫొటోగ్రఫీ ప్రత్యేకించి ప్రశంసనీయం. గోఖలే, ప్రభాకర్ (కళా దర్శకులు) కూడా అభినందనీయులు.

ప్రేమకు చోటు లేకపోయినా ప్రేమను దట్టించుట ఒక విశిష్టత.

'అంతస్తులు'

కాలంతోపాటు సినిమా కళ కూడా అభివృద్ధి చెందుతున్నది. టేకింగ్, ఛాయాగ్రహణం, సెట్‌లు, కథా సంవిధానం మొదలైన వాటిలో నిన్నటిది ఈ రోజుకు పాత; ఏ రోజు కారోజు కొత్త కనిపెడుతున్నారు.

సినిమా కళలోని అభివృద్ధి తెలుగు సినిమాలలో తరచుగా కాకపోయినా అప్పుడప్పుడూ ప్రతిబింబిస్తూనే వున్నది. ఆ ప్రత్యేక అంతస్తు బాగా కన్పించిన చిత్రాలలో ఒకటి జగపతీ వారి "అంతస్తులు"

కథాగమనంలో గతము, ప్రస్తుతముల మెల్ జోడింపు కానవస్తున్నది. భ్రాంతికి, నిజానికి దూరం లేదన్నది విభ్రాంతి కలిగించేటట్లు నిరూపించ కలిగారు రాజా, జమిందారు జగన్నాధరావు పాత్రల ద్వారా.

బెల్జియమ్ అద్దంవంటి ఛాయాగ్రహణం. దానికి నేస్తం నేత్ర పర్వమైన సెటప్. పూర్వం రష్యన్ ఏంగిల్స్ ఎంతో ప్రతీతి. ఈ చిత్రం "హైదరాబాద్ ఏంగిల్స్" పేరు సృష్టించేటట్లుంది.

పోతే దర్శకత్వం. పలవటికథను ఆనంద ప్రదమైన చలన శిల్పంగా మలచడంలోనే దర్శకత్వపు శిల్పం వుంటుంది. అందులో ఒక శాఖ "టేకింగ్", "అంతస్తులు"లో ఈ శిల్పాంశం అంతస్తు ఉన్నతం.

తెలుగు సినిమా శిల్పం అంతస్తు పెరుగుతున్న దనడానికి "అంతస్తులు" ఒక నిదర్శనం.

రక్తంలోను అంతస్తులున్నాయి. కాని ఆత్మ అంతస్తులకు అతీతం అని నిరూపించ యత్నించిన కథ "అంతస్తులు" చిత్రానికి ఆధారం.

నాగేశ్వరరావుకు కొత్త పాత్ర. ప్రేమభక్తుడు. నాగేశ్వరరావు కాబట్టే ఆ భూమికను అంత బాగా నిర్వహించ కలిగారు.

గుమ్మడి రూపమే వేరు. చాలా కాలం నిలచేది.



"ప్రేమించిచూడు"లో చలం, నాగేశ్వరరావు

భానుమతి వీధి వనిత వేషం వేసి చాలా రోజులయింది. పాత్ర నిలది నంతవరకు ఆమె నటన ఉదయ భానునివలె నున్నది.

తారలు, టెక్నీషియనులు తమ తమ అంతస్తులకు తగ్గ ప్రతిభ చూపినా ఊహించని అంతస్తు సంభాషణలలో నేపథ్య సంగీతం ఎఫెక్ట్‌లలో కాన వచ్చింది.

ఈ చిత్రానికి సంబంధించినంత వరకు జగపతి బలగం వివరమిది:

నాగేశ్వరరావు, జగ్గయ్య, గుమ్మడి, రేలంగి, రమణారెడ్డి, రాజబాబు, శాండో కాంతారావు.

భానుమతి, కృష్ణకుమారి, జి. వరలక్ష్మి, ఎల్. విజయలక్ష్మి.

వి. మధుసూదనరావు, కె. వి. మహదేవన్, సి. నాగేశ్వరరావు, ఆత్రేయ, కొసరాజు, అరుద్ర, హీరాలాల్, రెడ్డి, జి. వి. సుబ్బారావు, ఎడిటర్ సత్యం, కథకుడు సీతారామన్.

సహాయ దర్శకుడు వి. సి. రెడ్డి.

నిర్మాత రాజేంద్రప్రసాద్.

● ● ●

మద్రాసు ఫిలిం ఫాన్స్ వారు చెన్నపట్నంలో ఇటాలియన్ చలన చిత్రోత్సవం జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇవి ప్రయివేట్ షోలు కాబట్టి సెన్సార్ కత్తెర అడ్డురాకుండా చెయ్యాలని కూడా వీరు యత్నిస్తున్నారు.

చలన చిత్ర వార్తలు

వాహినీ విశిష్ట సంకల్పం

వాహినీ ప్రొడక్షన్స్ బానర్‌తో శ్రీ బి. యన్. రెడ్డి డైరెక్టు చెయ్యనున్న సాంఘిక చిత్రంలో ఒకటి రెండు ముఖ్య భూమికలు తప్పిస్తే తక్కిన వాటిని కొత్త నటీనటులే నిర్వహించనున్నారు. కథ పాలగుమ్మి పద్మరాజు తయారు చేస్తున్నారు. జూన్ నెలాఖరుకు ఫైనల్ కాపీ చేరుతుంది. ఆ పిమ్మట సంభాషణల రచన, ఆ తర్వాత కొత్త వారల సెలక్షన్ జరుగుతుంది.

కమలాకర కొత్తచిత్రం

బందరు ప్రముఖులు కొత్తగా నెలకొల్పిన ఫిలిం సంస్థకు దర్శకుడుగా కమలాకర కామేశ్వరరావు బుక్ అయినారు. జానపదం. పింగళి నాగేంద్రరావు స్క్రిప్టుపని ప్రారంభించారు.

శకుంతల జలవిహారం

బి. సరోజాదేవి 'శకుంతల' అయిన మీదట రాజ్యం పిక్చర్స్ చిత్ర నిర్మాణం జోరుగా సాగుతున్నది. శకుంతల నౌకా విహారం ఉంగరం జారిపోవడం, చేప మింగడం మద్రాసులో అడయార్ నదిలో చిత్రీకరించారు. జాలరి చేపను కోయడం, ఉంగరం పడడం మొదలైన దృశ్యాలను భరణీలో తీశారు. జాలరి: రేలంగి, దుష్యంతుడు: రామారావు, దర్శకుడు: కమలాకర కామేశ్వరరావు.

వీరాభిమన్యు ఎడిటింగ్

రాజలక్ష్మీ వారు తమ సర్వాడంబర చిత్రం "వీరాభిమన్యు" ఫైనల్ ఎడిటింగ్ జూన్ 12న ప్రారంభించారు. ఆ తర్వాత రెండు మూడు రోజుల నుంచి ప్యాచ్‌వర్క్ సాగింది. రామారావుతోసహా ముఖ్య పాత్రధారులు ఆయా ఘట్టాలలో పాల్గొన్నారు. సైంధవుడు (సత్యనారాయణ) పాండవులను అడ్డగించడం, భీముడు (దండమూడి రాజగోపాల్ శాండో) ఆగ్రహావేశములతో రథమునే నిలువెత్తు ఎత్తి విసిరివేయడం, సైంధవునిమాయా యుద్ధం మొదలైన ఘట్టాలు చిత్రీకరించారు. దర్శకుడు వి. మధుసూదనరావు, నిర్మాతలు సహతా, డూండీ. విడుదల ఆగస్టు ఐదు.

హైదరాబాద్ చిత్రాలు

హైదరాబాద్ శ్రీ సారథి స్టూడియోస్‌లో జూన్ మొదటి వారంలో రవీంద్ర ఆర్ట్స్ చిత్రం షూటింగ్ షెడ్యూలు జరిగింది. నాగేశ్వరరావు, హేమలత, లింగమూర్తి పాల్గొన్నారు. దర్శకుడు వి. మధుసూదనరావు, నిర్మాత తమ్మారెడ్డి, సంగీతం చలపతిరావు, రచన ముళ్ళపూడి.

* * *

పి. ఏ. పి. వారి తాజా సాంఘిక చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో ముగిసినట్లే. నాగేశ్వరరావు, జయలలిత, సావిత్రి ముఖ్య పాత్రధారులు. దర్శకుడు ప్రత్యగాత్మ, నిర్మాత ఎ. వి. సుబ్బారావు, రచన ఆత్రేయ. రెండు పాటల (ఔట్‌డోర్) చిత్రీకరణ జరుగనున్నది.

* * *

హైదరాబాద్‌లో అతి త్వరలో అన్నపూర్ణ, శంకరరెడ్డి చిత్రాల షూటింగ్ జరుగనున్నది.

* * *

ఏసుప్రభువు జీవిత చరిత్ర ఆధారంగా తీసిన అనువాద చిత్రం 'ముళ్ళ కిరీటం' త్వరలో ఆంధ్రలో విడుదల కానున్నది.



"సింగపూర్ సి. ఐ. డి."లో సరోజాదేవి, శివాజీగణేశన్

సింగపూర్ సి. ఐ. డి.

శ్రీనివాస్ మూవీస్‌వారి ఈస్ట్‌మన్ కలర్ అపరాధ పరిశోధక చిత్రం 'సింగపూర్ సి. ఐ. డి.' త్వరలో విడుదల కానున్నది. బి. సరోజాదేవి, శివాజీ గణేశన్ ముఖ్య పాత్రధారులు.

జూన్, జులైలు

జూన్‌లో వాసవీ వారి భక్త తిన్నడు షూటింగ్ ప్రారంభమైంది. పల్నాటి వీరకథ, శ్రీకృష్ణ పాండవీయం, ఆంధ్రమహావిష్ణువు, సి. ఐ. డి., వీలునామా, పరమానందయ్య శిష్యుల కథ, రాజభక్తి, పాదుకా పట్టాభిషేకం మొదలైన చిత్రాల షూటింగ్ జోరుగా సాగింది.

జులైలో ఆకాశ రామన్న, సింహాచల క్షేత్ర మహిమ, దేవత, జ్వాలాద్వీప రహస్యం విడుదల కానున్నవి.

"ప్రేమించి చూడు"

నవ ప్రేమికుల బాధలు తెలుసుకోవాలి అంటే—ప్రేమించి చూడు!

"ఒకసారికి • మించి చూడు" అని అనేటట్లుగా పద్మశ్రీవారు హాస్య శృంగార రస ప్రధానంగా "ప్రేమించి చూడు" చిత్రం తీర్చిదిద్దారు.

వాను (జగ్గయ్య) కాంచన మాలను (కాంచన), అతని మిత్రుడు రంగ (నాగేశ్వరరావు) ఆమె చెల్లెలు రత్నమాలను (రాజశ్రీ) గాఢంగా ప్రేమించి కావలిస్తే మా హృదయాలు "దించి చూడు" అని అన్నారు.

బి. ఎస్. సి, పి. యు. సి. విద్యార్థినులైన ఆ పిల్లలు ప్రేమను "పంచి "చూడు" అని వారి వంచ చేరారు.

రెండు జంటల తండ్రులూ (గుమ్మడి, రేలంగి) మిత్రులే. అయితే వారు సంతానమునకు అనురాగం "పంచి" "చూడు" అని అనలేదు. అరునొక్క రాగం "పంచి, చూడు" అని అన్నారు.

ఇద్దరు అమ్మాయిలవద్ద "జయించి చూడు" శపథం చేసిన ఇద్దరు అబ్బాయిలు, తమ తండ్రులను (గుమ్మడి, రేలంగి) అద్భుత తతంగాలలో పల్టీలు కొట్టించి, పెళ్ళి పీటలుచేరి, మాంగల్యం కట్టుతున్న మమ్ము "క్షమించి చూడు" అని అర్థించారు.

సమ్మోహనాస్త్రమయమైన ఈ ప్రేమ పరుగు పరీక్షా చిత్రంలో నాగేశ్వరరావు చలాకీనటన, జగ్గయ్య "ముగ్గులు" (ప్లానులు), కాంచన అందం, రాజశ్రీ చందం, కులుకు తెచ్చిన వెలుగు(ఛాయాగ్రహణం - పి. ఎల్. రాయ్, కె. ఎస్. రామకృష్ణారావు) ఘంటసాల, శ్రీనివాస్, బసవేశ్వర్ సుశీల, వేణు కృషి వొచ్చదన మిచ్చినవి; మెచ్చదగినవైనవి.

"సైలెన్స్"మాస్టారు(తాడికొండల రావు)నుంచి సాంకేతిక మాష్టారుల వరకు అందరి ప్రజ్ఞకు, ఉపజ్ఞకు వన్నె తెచ్చిన దర్శకుడు వి. పుల్లయ్య, నిర్మాత వి. వెంకటేశ్వర్లు "హాయి చిత్రాలను ప్రేమించిచూడు" అనే నినాదానికి ప్రారంభకులైనారు.

□□□

Edited and Published by V. V. Raghavaiah and Printed by him at Jyothi Press, Congress Office Road, Governorpet, Vijayawada-2.

JYOTI
JULY '65
Regd No
H-368

